PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 298 | విజయవాడ, ఆదివారం 2 జూన్ 2024 | 10 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 2 June 2024 | Rs

విదేశాల్లోనే సగం భారత బంగారం

- అక్కడే ఆర్‌బిఐ ఎందుకు నిల్వ చేస్తోంది..!
- దేశంలో 4 లక్షల కిలోల బంగారం
- ఈ ఏడాది భారీగా కొనుగోళ్లు

• లోపలి పేజీలో..



గోదావరి డెల్టా కాలువలకు స్విచ్ ఆన్‌చేసి సాగునీటిని విడుదల చేస్తున్న కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత

గోదావరి డెల్టాకు సాగునీటి విడుదల

2





పాలస్తీనా సంఘీభావ ర్యాలీలో బృందాకరత్, సీతారాం ఏచూరి తదితరులు

మారణహోమం ఆపాలి

- పాలస్తీనా ప్రజలకు అండగా నిలవాలి
- నిరసనలో ఏచూరి

జంతర్ మంతర్ వద్ద సంఘీభావ ర్యాలీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గాజాలో ఇజ్రాయిల్ ప్రభుత్వ మారణహోమం ఆపాలని, తక్షణమే కాల్పులు విరమణ పాటించాలని డిమాండ్ చేస్తూ శనివారం నాడిక్కడ జంతర్‌మంతర్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. పాలస్తీనా సంఘీభావ కమిటీ పిలుపు మేరకు ఈ నిరసనలో కార్మిక నేతలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, మేధావులు, ఇతర వామపక్ష సంఘాల కార్యకర్తలు సహా వందలాదిమంది పాల్గొన్నారు. పాలస్తీనాపై ఆంక్షలు ఎత్తి వేయాలని, దాడులు ఆపాలని, కాల్పుల విరమణ పాటించాలని, ఇజ్రాయిల్‌కు ఆయుధాల సరఫరా నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. పాలస్తీనా జెండాలను చేతబట్టి సంఘీభావం తెలిపారు. పాలస్తీనా ప్రజలను ఊచకోత కోస్తున్న ఇజ్రాయిల్‌కు అమెరికా అతి పెద్ద మద్దతుదారుగా నిలిచిందన్నారు. భారత ప్రభుత్వం పాలస్తీనాకు తన సంఘీభావాన్ని తక్షణమే ప్రకటించాలని, ఇజ్రాయిల్‌తో అన్ని రక్షణ, భద్రతా ఒప్పందాల నుండి వైదొలగాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ పాలస్తీనా ప్రజలకు అండగా ఉండాలనే దేశ దీర్ఘకాలిక విధానం నుంచి మోడీ ప్రభుత్వం తప్పుకుందని విమర్శించారు. 'గాజాలో ఇజ్రాయిల్ కొనసాగిస్తున్నది యుద్ధం కాదు, మారణహోమం. యుద్ధం రెండు సైన్యాల మధ్య ఉంటుంది. రెండువైపులా ఆయుధాలు ఉంటాయి. కానీ, ఇక్కడ నిరాయుధ వ్యక్తులపై దాడి జరుగుతోంది. ఇది ఆమోదయోగ్యం కాదు" అని ఏచూరి అన్నారు. 'నెతన్యాహుకు మద్దతుగా మోడీ ప్రభుత్వం మోకాలడ్డింది. ప్రపంచం దీన్ని ఖండించాలి. దాడిని ఆపడానికి ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తేవాలి" అని అన్నారు.

మానవ చరిత్రలోఅత్యంత దారుణం : బృందాకరత్

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ మాట్లాడుతూ ఇజ్రాయిల్‌కు ఆయుధాలను సరఫరా చేయడం ద్వారా మానవ చరిత్రలో అత్యంత దారుణమైన మారణకాండలో మోడీ ప్రభుత్వం కూడా భాగమైందని, దీనిని తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. 1967కి ముందు సరిహద్దులతో తూర్పు జెరూసలెం రాజధానిగా స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు మద్దతుగా నిలవాలని అన్నారు. రఫాలో నిర్వాసితుల శిబిరంపై ఇజ్రాయిల్ దాడిని ఖండించారు. ప్రముఖ మేధావి అచిన్ వనాయక్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ ఇప్పటికే పాలస్తీనా జనాభాలో 5శాతం మందిని పొట్టనపెట్టుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలస్తీనా సంఘీభావ కమిటీ నేత ఆర్. అరుణ్ కుమార్, ఢిల్లీ డిప్యూటీ మేయర్ అలై ముహ్మద్ ఇక్బాల్, సిఐటియు ఢిల్లీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనురాగ్ సక్సేనా, సుప్రీం కోర్టు న్యాయవాది కెఆర్ సుభాష్ చంద్రన్ తదితరులు మాట్లాడారు. నిరసనలో సిఐటియు, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఎఐడిఎస్ఒ, కెవైఎస్, ఎఐఎస్ఎ, సిపిఐ (ఎంఎల్-న్యూడెమోక్రసీ), దాహ, ప్రగతిశీల మహిళా సంఘం, కలెక్టివ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



పోస్టల్ బ్యాలెట్ల నిబంధనల సడలింపుపై

ఉత్తర్వులు ఇవ్వలేం

హైకోర్టు ధర్మాసనం

ప్రజాశక్తి, అమరావతి

పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి రాష్ట్రంలో కొన్ని అంశాల్లో నిబంధనల సడలింపుపై ఉత్తర్వులు జారీ చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారంపై తాము ఉత్తర్వులు జారీ చేయలేమని స్పష్టం చేసింది. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన డిక్లరేషన్ ఫాంపై అటెస్టింగ్ అధికారి సంతకం ఉండి, పేరు, హోదా, సీలు లేకపోయినా కూడా వాటిని అనుమతించాలని కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వులను వైసిపి సవాల్ చేసిన వ్యాజ్యంలో ఉత్తర్వుల జారీకి హైకోర్టు నిరాకరించింది. ఎన్నికల ప్రక్రియ మొదలైన కారణంగా ఈ వ్యవహారంపై ఉత్తర్వులు జారీ చేయలేమని స్పష్టం చేసింది. అలాంటి పోస్టల్ బ్యాలెట్లను ఆమోదించాలని రిటర్నింగ్ అధికారులను ఇసి ఆదేశిస్తూ వైసిపి దాఖలు చేసిన వ్యాజ్యం పరిష్కారిస్తున్నట్లు ప్రకటించింది. పోస్టల్ బ్యాలెట్ వ్యవహారంపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఎన్నికల పిటిషన్లు (ఇపి) దాఖలు చేసుకోవాలని వైసిపికి సూచించింది.

కేంద్రం ఎన్నికల సంఘం గురువారం జారీ చేసిన ఉత్తర్వులను చట్ట విరుద్ధమని ప్రకటించాలని కోరుతూ వైసిపి ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన డివిజన్ బెంచ్ శనివారం తీర్పు వెలువరించింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యాక కోర్టులు జోక్యం చేసుకోరాదన్న ఇసి వాదనతో ఏకీభవించింది. పోస్టల్ బ్యాలెట్స్ లెక్కింపు కూడా ఎన్నికల ఫలితాల కిందకే వస్తుందని చెప్పింది. ఈ వివాదాన్ని ఎన్నికల పిటిషన్ ద్వారా తేల్చుకోవాలేగానీ కోర్టుల్లో సాధారణ కేసుల ద్వారా కాదని స్పష్టం చేసింది. ఈ వివాదం రాష్ట్ర తోసిపుచ్చింది. ఏపీలో జరిగిన చట్టసభ సా అసెంబ్లీలోని మొత్తం175 నియోజకవర్గాలు, 25 పార్లమెంట్ సీట్ల ఫలితాలతో ముడిపడి ఉందని, ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఎన్నికల పిటిషన్లు దాఖలు చేయడం కష్టమని పిటిషనర్ వాదనను కానీ, కొన్ని స్థానాలకు మాత్రమే పోస్టల్ బ్యాలెట్ల వ్యవహారంపై ప్రత్యేకంగా ఆదేశాలు ఇచ్చిందన్న వాదనను కానీ హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు.

రాష్ట్రంలో మిశ్రమం

ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వివిధ సర్వే సంస్థలు శనివారం సాయంత్రం వెల్లడించిఎన ఎగ్జిట్ పోల్స్‌లో రాష్ట్రంలో మిశ్రమ ఫలితాలు వచ్చాయి. కొన్ని సర్వే సంస్థలు ఎన్‌డిఎ కూటమికి పట్టం కట్టగా, మరికొన్ని వైసిపి మళ్లీ అధికారం చేజిక్కించుకుంటుందని పేర్కొన్నాయి.

	అసెంబ్లీ		పార్లమెంటు	
సర్వే సంస్థ	ఎన్‌డిఎ	వైసిపి	ఎన్‌డిఎ	వైసిపి
రైజ్	113-122	48-60	19-21	3-5
చాణక్య	104-118	44-57	17-20	7-10
పయనీర్	144	31	20	5
పీపుల్స్‌పల్స్	111-135	45-60	17-19	3-5
కెకె సర్వేస్	161	14	25	-
ఆత్మసాక్షి	59-77	98-116		
ఆరా	71-81	94-104		
పోల్ స్ట్రాటజీ	55-65	110-120		
పొలిటికల్ లాబొరేటరీ	67	108		
జనమత పోల్స్	65-73	95-103		
టైమ్స్ నౌ	161	14		



ఎన్‌డిఎకు ఓటేసిన ఎగ్జిట్ పోల్స్

- ఆ కూటమికి 350కి పైగా సీట్లు
- 100-150 మధ్య 'ఇండియా' బ్లాక్

2

'ఇండియా' గెలుస్తుంది

- మల్లికార్జున ఖర్గే ధీమా
- ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పారదర్శకత పాటించాలి
- నేడు ఇసిని కలవనున్న ఇండియా వేదిక నేతలు



అభివాదం చేస్తున్న 'ఇండియా' వేదిక నేతలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇండియా మారుతుందని, 'ఇండియా' వేదిక గెలుస్తుందని ఆ ఫోరమ్ నేతలు ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో ఇండియా బ్లాక్‌కు 295 సీట్లు వస్తాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధీమా వ్యక్తం చేశారు. ఏడు విడతల సార్వత్రిక ఎన్నికల పోలింగ్ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఇండియా బ్లాక్ నేతలు ఖర్గే నివాసంలో సమావేశమై తాజా పరిస్థితిపై చర్చించారు. ఈ సమావేశానికి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కెసి వేణుగోపాల్ (కాంగ్రెస్), సీతారాం ఏచూరి (సిపిఎం), డి.రాజా (సిపిఐ), శరద్ పవార్ (ఎన్‌సిపి), ఫరూక్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), అఖిలేష్ యాదవ్, రామ్ గోపాల్ యాదవ్ (ఎస్‌పి), తేజస్వి యాదవ్ (ఆర్‌జెడి), అనిల్ దేశాయ్ (శివసేన), ఢిల్లీ, పంజాబ్, జార్ఖండ్ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, భగవత్‌మాన్ (ఆప్), చంపయీ సోరేన్ (జెఎంఎం), సంజయ్ సింగ్, రాఘవ్ చద్దా (ఆప్), కల్పనా సోరేన్ (జెఎంఎం), టిఆర్ బాలు (డిఎంకె), దీపాంకర్ భట్టాచార్య (సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసి), ముఖేష్ సహాని (వికాశీల్ ఇన్సాన్ పార్టీ), జితేంద్ర అవద్ (ఎన్‌సిపి) తదితరులు హాజరయ్యారు. చివరి విడత పోలింగ్‌లో బిజీగా ఉన్నందున తాము ఢిల్లీ సమావేశానికి రాలేనని టిఎంసి నేత, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ముందే తెలియజేశారు. వ్యక్తిగత కారణాల రీత్యా దీనికి హాజరుకాలేకపోతున్నానని పిడిపి అధినేత్రి మెహబూబా ముఫ్తీ చెప్పారు. దాదాపు రెండున్నర గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించిన సన్నాహాలు, వ్యూహాలపై చర్చించారు .టీవీల్లో ఎగ్జిట్ పోల్‌పై చర్చలలో పాల్గొంటామని కాంగ్రెస్‌సహా ఇండియా బ్లాక్ పార్టీలు ప్రకటించాయి.

సమావేశం అనంతరం ఖర్గే మీడియాతో మాట్లాడుతూ, కౌంటింగ్ రోజు సన్నాహాల గురించి తాము చర్చించామన్నారు. పోరాటం ఇంకా ముగిసిపోలేదు. ఓట్ల లెక్కింపు రోజున అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, కౌంటింగ్ పూర్తయ్యే వరకు కౌంటింగ్ హాల్ నుంచి బయటకు రాకూడదని సూచించినట్లు తెలిపారు. తాము తమ పూర్తి బలంతో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేశామని, దేశ ప్రజలు తమకు మద్దతు మిగతా 2లో

ఏడో దశ 59.45 శాతం పోలింగ్

- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు
- బెంగాల్‌లో చెలరేగిన హింస, పలుచోట్ల ఆందోళనలు



• లోపలి పేజీలో..

బెదిరింపులతో భూ ఒప్పందాలు

విశాఖ జిల్లాలో భీమిలి, పద్మనాభం, ఆనందపురంల్లో వందల ఎకరాలు పెద్దల పరం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'భూములు ఇప్పుడు మాకు అప్పజెప్పకపోతే ప్రభుత్వం తెచ్చిన కొత్త విధానాలతో గజం భూమి కూడా మీకు దక్కదు. మేం చెప్పినట్టు వింటే లక్షల రూపాయలు మీ చేతుల్లోకి వస్తాయి. లేదంటే కాలికింద నేలను కోల్పోతారు' అని పేదలను బెదిరించి విశాఖ జిల్లా గ్రామీణ ప్రాంతంలోని పలు మండలాల్లో భూ ఒప్పందాలు చేసుకున్నారు. ప్రభుత్వ పెద్దల తరపున గ్రామీణ ప్రాంతాల్లో కొందరు బినామీలు చేసిన భూ దందా ప్రజాశక్తి జరిపిన క్షేత్రస్థాయి పరిశీనలలో వెలుగులోకి వచ్చింది.

భీమిలి మండలంలోని నేరెళ్లవలస, నిడిగట్టు, అగ్రహారం, పద్మనాభం మండలంలోని అనంతవరం తదితర ప్రాంతాల్లో ఈ భూ దందా సాగినట్టు స్థానికులు చెప్పారు. ఈ ఏడాది మార్చిలో విశాఖ జిల్లా భీమిలి మండలం నిడిగట్టుకు చెందిన 20 మంది దళిత రైతులకు నేరెళ్లవలసలో 1978లో ప్రభుత్వం ఇచ్చిన అసైన్‌మెంట్ భూమి 60 ఎకరాలకు ప్రభుత్వ పెద్దలు కొందరు బెదిరించి ఒప్పందాలు చేసుకున్నారు. ఇలా రెండు ఎకరాలు వదులుకున్న గ్రామానికి చెందిన ముదపాక రాంబాబు అనే వ్యక్తి మాట్లాడుతూ శుక్రవారం 20 మంది రైతుల బ్యాంకు అక్కౌంట్లలో ఐదు లక్షల రూపాయల చొప్పున వేసినట్లు చెప్పారు. ఇంతవరకు ఒక్కోకరికి పది లక్షల రూపాయల చొప్పున అందినట్లు తెలిపారు.



నేరేళ్లవలసలో దళితుల నుంచి కాజేసిన భూమి ఇదే..

2023 నుంచి గ్రామాల్లో పర్యటనలు

ఒక రాష్ట్ర మంత్రితో పాటు, ప్రభుత్వ ఉన్నతాధికారులు మరికొందరు బినామీలు 2023లో గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. అందరూ కలిసి, విడివిడిగా జరిపిన ఈ పర్యటనల్లో నే విశాఖ జిల్లాలోని భీమిలి, పద్మనాభం, ఆనందపురం మండలాల్లో భూ కబ్జాకు తలుపులు తెరిచారు. నేరెళ్లవలస వద్ద ఐఎన్ఎస్ కళింగ గోడకు వెనుకభాగంలో నిడిగట్టు గ్రామానికి చెందిన దళితులు 20 మందికి గతంలో ప్రభుత్వమిచ్చిన 60 ఎకరాల అసైన్డ్ భూమి కనీస ధర రూ.50 లక్షలకుపైగా పలుకుతుండగా మిగతా 2లో

అల్యూమినియం ఫ్యాక్టరీలో గ్యాస్ లీక్

- 30 మందికి తీవ్ర అస్వస్థత

వడదెబ్బకు నలుగురు మృతి

సరిపడ విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి

- ఎపి రైతు సంఘం డిమాండ్

రూ. 1.26 లక్షల కోట్ల డివిడెండ్‌తో

పిఎస్‌యుల రికార్డు


• లోపలి పేజీలో..

ఆగని మరణాలు

- విజయవాడలో అతిసారతో మరొకరు మృతి
- వివిధ ఆస్పత్రుల్లో వంద మందికిపైగా బాధితులు

ప్రజాశక్తి- విజయవాడ

విజయవాడలో మరణ మృదంగం కొనసాగుతోంది. అతిసారతో శనివారం మరొకరు మరణించడంతో మృతుల సంఖ్య తొమ్మిదికి చేరింది. మృతుల్లో ఏడు నెలల బాబుతోపాటు ఐదుగురు మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నారు. వివిధ ఆస్పత్రుల్లో వంద మందికిపైగా చికిత్స పొందుతున్నారు. శనివారం తెల్లవారుజామున మొగల్రాజపురం గుమ్మడి తోట ప్రాంతానికి చెందిన గల్లా కోటేశ్వరరావు (65) మరణించారు. ఆరు రోజుల నుండి వాంతులు, విరోచనాలతో బాధపడుతున్న ఆయన ఓ ప్రయివేటు ఆస్పత్రి వైద్యుల సలహా మేరకు నర్సుల పర్యవేక్షణలో ఇంటి వద్దే చికిత్స తీసుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో, మొగల్రాజపురం ప్రాంతంలో ఇప్పటి వరకు ఆరుగురు మృతి చెందినట్లయింది. పాయకాపురం రాధా రంగానగర్, ప్రజాశక్తి నగర్ ప్రాంతాల్లో గత పదిహేను రోజుల్లో ముగ్గురు మరణించారు. గత నాలుగు నెలలుగా నగరంలో మంచినీటి కొరత, రంగు మారిన, కలుషిత నీటిపై ప్రజల నుండి అనేక ఫిర్యాదులు వస్తున్నా నగర పాలక సంస్థ అధికారులు, ప్రభుత్వం పట్టించుకోలేదు. కృష్ణా నదిలో నీటిమట్టం తగ్గి పేరుకుపోయిన నాచు, మట్టితో కూడిన నీరు హెడ్‌వాటర్ వర్క్స్ నుండి ప్రజలకు సరఫరా అవుతోంది. కోటేశ్వరరావు మృతదేహాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.



గల్లా కోటేశ్వరరావు (ఫైల్)

పలు ప్రాంతాలకు విస్తరణ

మొగల్రాజపురం 7, 6వ డివిజన్ల పరిధిలోని చంద్రరాజేశ్వరరావు నగర్, బోయపాటి మాధవరావు వీధి, పటమట వారి వీధి, బందుల దొడ్డి, పటమట వారి వీధి, గుమ్మడి వారి వీధి, అట్లూరి పర్వతమ్మ విధి, వాటర్ ట్యాంక్ రోడ్డు, ఆశ్రమం రోడ్డు, బోయపాటి వారి వీది, సున్నపు బట్టీల సెంటర్లలో వ్యాధి ప్రబలింది. 64వ డివిజన్ ప్రజాశక్తి నగర్, రాధానగర్ ప్రాంతాలకూ అది విస్తరించింది.

బాధితులను ఆదుకోవాలని సిపిఎం నిరసన

అతిసారతో మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాలని, బాధితులకు వైద్య ఖర్చులు చెల్లించాలని, కృష్ణ నది నుండి మిగతా 2లో

విద్యార్థులకు జూన్ 12న విద్యాసామాగ్రి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జూన్ 12న విద్యాసామాగ్రి పంపిణీ చేస్తామని పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. 1-10 తరగతుల విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలతో పాటు టోఫెల్ వర్క్‌బుక్, ఫ్యూచర్ స్కిల్స్ పాఠ్యపుస్తకాలు, మూడు జతల యునిఫాం, స్కూల్ బ్యాగు, బెల్ట్, ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు అందిస్తామని పేర్కొన్నారు. 1-5 తరగతుల విద్యార్థులకు వర్క్‌బుక్‌లు, 6-10వ తరగతుల వారికి నోట్‌బుక్‌లు, బూట్లు అందిస్తామని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ప్రియుడిని బంధించి యువతిపై హోంగార్డు అత్యాచారం

- నిందితుడు అరెస్టు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

ప్రజాశక్తి-విజయనగరం కోట

బయటకు వెళ్లిన ప్రేమికులను హోంగార్డు వెంబడించి.. వారిని బెదిరించి యువకుని ఎదుటే యువతిపై అత్యాచారానికి పాల్పడిన ఘటన విజయనగరం జిల్లాలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం... విజయనగరం జిల్లాకు చెందిన ప్రేమికులు మే 25న పూసపాటిరేగ మండలంలోని కుమిలి గ్రామ శివారులోకి వెళ్లారు. తొలి నుంచి వారిని వెంబడించిన హోంగార్డు రాజ్‌కుమార్.. పోలీసు వాహనంతో వెళ్లి స్టేషన్‌కు రావాలని బెదిరించాడు. దీంతో తమను వదిలేయాలని వారు ప్రాధేయపడగా డబ్బులు డిమాండ్ చేశాడు. వారివద్దనున్న రూ.రెండు వేలు తీసుకున్న రాజ్‌కుమార్.. అనంతరం ఆ యువకుడిని తాళ్లతో కట్టేసి యువకుని ఎదుటే యువతిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనుకోని ఈ సంఘటన ఆ జంటను తీవ్ర భయాందోళనకు గురిచేసింది. పోలీసే ఈ ఘాతుకానికి పాల్పడడంతో ఎవరికి ఫిర్యాదు చేయాలోనని, బయటకు తెలిస్తే పరువుపోతుందని భయపడ్డారు. చివరికి ధైర్యం తెచ్చుకొని బాధితురాలు శుక్రవారం దిశ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుడు రాజ్‌కుమార్‌ది విజయనగరం కాగా, ప్రస్తుతం శ్రీకాకుళంలోని ఎస్‌సి, ఎస్‌టిసెల్ డిఎస్‌పి అధికారి వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న విజయనగరం ఎస్‌పి ఎం దీపిక దర్యాప్తునకు ఆదేశించారు. రంగంలోకి దిగిన పోలీసులు సంఘటనా స్థలాన్ని, కుమిలి గ్రామ సమీపాన గుణుపూరుపేట రోడ్డులో ఉన్న సిసి కెమెరాను పరిశీలించారు. సంఘటన జరిగిన ముందు, తరువాత కూడా శ్రీకాకుళం జిల్లాలోని డిఎస్‌పి వినియోగిస్తున్న వాహనాన్ని వారు గుర్తించారు. కారు డ్రైవర్ రాజ్‌కుమారే ఈ దారుణానికి పాల్పడినట్లు గుర్తించి ఆయనను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రేపు తెలంగాణ పాలిసెట్ ఫలితాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పాలిటెక్నిక్, డిప్లొమా, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పాలిసెట్ రాతపరీక్ష ఫలితాలు సోమవారం విడుదల కానున్నాయి. అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లో ఉన్న సాంకేతిక విద్యాభవన్‌లో ఈ ఫలితాలను విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం విడుదల చేస్తారు. గతనెల రాష్ట్రంలోని 259 పరీక్షా కేంద్రాల్లో పాలిసెట్ రాతపరీక్షను నిర్వహించిన విషయం తెలిసిందే. 92,808 మంది దరఖాస్తు చేసుకుంటే 82,809 (89.23 శాతం) మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు.

ఓటర్లే నిజమైన విజేతలు

- విజయవంతంగా ముగిసిన పోలింగ్
- ప్రజలకు ఎన్నికల సంఘం కృతజ్ఞతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశవ్యాప్తంగా పలు సవాళ్లను, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని కూడా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేసి ప్రజాస్వామ్య రథాన్ని ముందుకు నడుపుతున్న ఓటర్లే నిజమైన విజేతలని కేంద్ర ఎన్నికల సంఘం ప్రస్తుతించింది. ఏప్రిల్ 19న మొదటి దశ పోలింగ్‌తో ఏడు దశల్లో పోలింగ్ ప్రక్రియ శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ నేపథ్యంలో ఓటర్లకు, ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొన్న అధికారులకు, ఇతర ప్రజానీకానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ



కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్‌కుమార్, సుఖ్బీర్ సింగ్ సంధు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సంఘం పూర్తి చిత్తశుద్ధితో ప్రజలకు కృతజ్ఞతలు, ప్రశంసలు తెలియజేస్తోందని పేర్కొన్నారు. భారత ప్రజలంతా ఒకే గొంతుకై ప్రతిధ్వనించి ప్రజాస్వామ్య రథచక్రాలను ముందుకు నడుపుతూ 18వ సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు ముగింపు పలికామని తెలిపారు. ఈ ప్రక్రియను విజయవంతం చేసిన ఓటరు మహాశయులకు, రాజకీయ పక్షాలకు, పోలీసు సిబ్బందికి, ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. ప్రజాస్వామ్య రథాన్ని సమిష్టి కృషితో అవిరళంగా మున్ముందుకు నడవడంలో దేశ ప్రజానీకం భాగస్వాములమయ్యారని తెలిపారు.

నేడు మహబూబ్‌నగర్... ఐదున నల్లగొండ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూన్ 2న మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఓట్ల లెక్కింపును జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభిస్తామని రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్ తెలిపారు. శనివారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ముగ్గురు అభ్యర్థులు బరిలో నిలిచిన ఈ ఎన్నికలో మొత్తం 1,439 ఓట్లు పోలయ్యాయని తెలిపారు. అలాగే నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు ఈ నెల ఐదున ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. ఇందుకోసం నల్లగొండ సమీపంలోని దుప్పలపల్లి తెలంగాణ వేర్‌హౌజింగ్ కార్పొరేషన్‌లో నాలుగు కౌంటింగ్ హాళ్లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మొత్తం 900 మంది సిబ్బందిని నియమించామని వెల్లడించారు. మూడు ప్రధాన పార్టీలతో పాటు 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని పేర్కొన్నారు

విశ్వవిద్యాలయంలో ప్రభుత్వ జోక్యం అనవసరం

- ప్రొఫెసర్ హరగోపాల్
- వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఘనంగా దశాబ్ది ఉత్సవాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విశ్వవిద్యాలయాలు స్వయం ప్రతిపత్తి కలిగినవని, వీటిలో రాజకీయ, ప్రభుత్వ జోక్యం అనవసరమని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ప్రభుత్వాలు వర్సిటీలకు నిధులు కేటాయించి, అక్కడి సమస్యలను పరిష్కరిస్తే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో ప్రొఫెసర్ కోదండరామ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ.. దేశానికి వ్యవసాయం చాలా కీలకమని, ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేయొద్దని అన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఈ పదేండ్లలో ఆశించిన ఫలితాలు రాలేదని అన్నారు. గత దశాబ్దం పూర్తిగా విషాదంగా ముగిసిందని, రాబోయే కాలంలో రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరి కృషి అవసరమని చెప్పారు. దానికి అనుగుణంగానే ప్రభుత్వం అన్ని రంగాల్లో పనిచేస్తున్న



రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

వారి అభిప్రాయాలు తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి ఒక కమిషన్, హైదరాబాద్ చుట్టూ ఉన్న భూములు పరిరక్షణకు ఒక కమిషన్‌ను వేయాలని మాజీ సిఎం కెసిఆర్‌కు సూచించినా పట్టించుకోలేదని గుర్తు చేశారు. తెలంగాణ రైతుల్లో అధిక శాతం సన్న, చిన్నకారు రైతులేనని, వారి అభ్యున్నతిలో వ్యవసాయ విశ్వవిద్యాలయానిదే కీలకపాత్ర అని అభిప్రాయపడ్డారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన బోధన, బోధనేతర సిబ్బంది, జర్నలిస్టులకు ఈ సందర్భంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి, ప్రజాగాయకులు గద్దర్ కూతురు వెన్నెల, డాక్టర్ వనమాల, వాసుదేవరెడ్డి, విద్యాసాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డిఎకు ఓటేసిన ఎగ్జిట్ పోల్స్

- ఆ కూటమికి 350కి పైగా సీట్లు
- 100-150 మధ్య 'ఇండియా' బ్లాక్
- గతంలో ఆరుసార్లు తప్పు అని తేలిన ఎగ్జిట్ పోల్స్

పోల్	ఎన్‌డిఎ	ఇండియా వేదిక	ఇతరులు
ఇండియా న్యూస్-డి-డైనమిక్స్ సర్వే	371	125	47
రిపబ్లిక్ భారత్-మ్యాట్రిజ్	353-368	118-133	43-48
రిపబ్లిక్ టివి-పి మార్క్	359	154	30
జన్ కీ బాత్	362-392	141-161	10-20

న్యూఢిల్లీ : పద్దెనిమిదో లోక్‌సభకు, నాలుగు రాష్ట్రాల అసెంబ్లీలకు ఏడు విడతల పోలింగ్ ముగిసిన వెంటనే వెలువడిన ఎగ్జిట్ పోల్స్ కేంద్రంలో ఎన్డీయేనే మళ్లీ వస్తుందని, మన రాష్ట్రంలో టిడిఎ-బిజెపి-జనసేన కూటమి గెలుస్తుందని జోస్యం చెప్పాయి. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమి 350కి పైగా సీట్లు గెలుచుకుంటుందని, ఇండియా బ్లాక్ 140 స్థానాలకే పరిమితమవుతుందని అవి జోస్యం చెప్పాయి. గతంలో ఇటువంటి జోస్యాలు ఆరు సార్లు తప్పు అని తేలాయి.

శనివారం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఇండియా బ్లాక్ నేతలు మాట్లాడుతూ, 295కి పైగా సీట్లు గెలుస్తామని, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థితిలో వుంటామని చెప్పారు. సెఫాలజిస్ట్ యోగేంద్ర యాదవ్ బిజెపికి 270కన్నా తక్కువే వస్తాయని అంచనా వేశారు.

రాష్ట్రాల వారీగా ఎగ్జిట్ పోల్స్ అంచనాలు

కర్ణాటకలో ఎన్‌డిఎకు 23-25 సీట్లు వస్తాయని, ఇండియా బ్లాక్‌కు మూడు నుండి ఐదు మధ్య సీట్లు వస్తాయని ఇండియా టుడే-యాక్సిస్ మై ఇండియా పోల్ పేర్కొంది. బీహార్‌లో ఎన్‌డిఎకు 29-33 సీట్లు వస్తాయని, ఇండియా అలయన్స్‌కు 7-10 సీట్లు వస్తాయని తెలిపింది. కేరళలో ఎన్‌డిఎకు 2-3, వామపక్షాల కూటమి ఎల్‌డిఎఫ్‌కు 0-1, కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్‌కు 17-18 వస్తాయని ఆ పోల్స్ అంచనా వేశాయి. రాష్ట్రంలో పోలైన ఓట్లలో ఎన్‌డిఎకు 27శాతం ఓటు వాటా దక్కుతుందని జోస్యం చెప్పింది. తమిళనాడులో ఎన్‌డిఎ రెండు నుండి నాలుగు సీట్లలో గెలుపొందుతుందని, అన్నాడిఎంకె నేతృత్వంలోని కూటమికి 0-2 సీట్లు రాగా, ఇండియా బ్లాక్ పార్టీలు మొత్తంగా 33-37 స్థానాలు కైవసం చేసుకుంటాయని ఆ పోల్స్ పేర్కొన్నాయి. చత్తీస్‌గఢ్‌లో ఎన్‌డిఎకు 10-11, ఇండియా అలయన్స్‌కు 0-1 సీట్లను ఇవ్వగా, జార్ఖండ్‌లో ఎన్‌డిఎ 8-10 స్థానాలు గెలుస్తుందని భావిస్తున్నారు. ఇండియా అలయన్స్‌కు 4-6 స్థానాలు దక్కుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం అరెస్టయి జైల్లో వున్న హేమంత్ సోరెన్ పార్టీ జార్ఖండ్ ముక్తి మోర్చా కూడా ఇండియా వేదికలో భాగంగా వుంది. గోవాలో గల రెండు సీట్లు ఎన్‌డిఎ, ఇండియా బ్లాక్‌లకు చెరొకటి వస్తాయని అంచనా. రాజస్థాన్‌లో ఎన్‌డిఎకు 16-19 వస్తాయని, ఇండియా అలయన్స్‌కు 5-7, ఇతరులకు 1-2 సీట్లు రావచ్చని మై యాక్సిస్ పేర్కొంది. ఇక మధ్యప్రదేశ్‌లో ఎన్‌డిఎ మొత్తంగా 20 స్థానాలను కైవసం చేసుకుంటుందని భావిస్తున్నారు. గుజరాత్‌లో కూడా ఇదే పరిస్థితి వుండబోతోందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి.

ఎగ్జిట్ పోల్స్ ఎంతవరకు కరక్ట్ ?
ఆరుసార్లు తప్పిన అంచనాలు

ఎగ్జిట్ పోల్స్ చరిత్ర చూస్తే, ఇప్పటివరకు ఆరుసార్లు ఈ ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పని తేలాయి. ఇండియా టుడే పోల్స్ మినహా 2019 లోక్‌సభ ఎన్నికల్లో చాలా ఎగ్జిట్ పోల్స్ సరిగా లేవని తేలింది. 2014లో కూడా, ఏ ఒక్క ఎగ్జిట్ పోల్ ఎన్‌డిఎ కూటమి ఘన విజయాన్ని లేదా యుపిఎ ఓటమిని అంచనా వేయలేదు..

2004 లోక్‌సభ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తలకిందులు

మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్‌ల్లో విజయాలతో మంచి ఊపు మీద వున్న వాజ్‌పేయి నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం 2004లో 'భారత్ ప్రకాశిస్తోంది' అనే నినాదంతో త్వరగా ఎన్నికలకు పిలుపిచ్చింది. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమి 240 నుండి 275 మధ్య సీట్లు గెలుచుకుంటుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. తుది ఫలితాలు వచ్చాక అందరూ ఆశ్చర్యపోయారు. ఎన్‌డిఎ కేవలం 187 సీట్లతో సరిపెట్టుకోగా, కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు మాత్రం అంచనాలను తలకిందులు చేస్తూ ఏకంగా 216 సీట్లను గెలుచుకున్నాయి.

2014 లోక్‌సభ ఎన్నికల్లో

బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమే విజయం సాధిస్తుందని, కానీ మెజారిటీ తగ్గుతుందని 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు వేశాయి. 261-289 మధ్య ఎన్‌డిఎ సీట్లు గెలుచుకుంటుందని చాలావరకు ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. వాస్తవ ఫలితాలు ఈ అంచనాలన్నీ అధిగమిస్తూ ఎన్‌డిఎ ఏకంగా 336 సీట్లు గెలుచుకుంది. కేవలం బిజెపి సొంతంగా గెలుచుకున్న సీట్లతోనే మెజారిటీ మార్కును దాటింది. మరోపక్క కాంగ్రెస్ చారిత్రక రీతిలో ఓటమిని మూటగట్టుకుంది. కేవలం 44స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

2017 యుపి అసెంబ్లీ ఎన్నికల్లో

పెద్ద నోట్ల రద్దు నేపథ్యంలో ఉత్తరప్రదేశ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హంగ్ అసెంబ్లీ ఏర్పడుతుందని, బిజెపి పెద్ద పార్టీగా ఆవిర్భవిస్తుందని ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నాయి. ఆ అంచనాలకు భిన్నంగా, బిజెపి అత్యధికంగా 325 సీట్లను గెలుచుకుంది.

2015 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో

2015లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ఉధృతంగా సాగాయి. అత్యధికంగా పోలింగ్ శాతం నమోదైంది. ఎవరికీ స్పష్టమైన మెజారిటీ రాదని, హోరాహోరీగా పోటీ వుంటుందని అంచనా వేశాయి. వాస్తవిక ఫలితాలు వచ్చేసరికి, ఆర్‌జెడి-జెడియు-కాంగ్రెస్ కూటమి నిర్ణయాత్మకమైన విజయాన్ని సాధించింది. ఆర్‌జెడి అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు అందని విధంగా ఈ ఫలితాలు వచ్చాయి.

2015 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో

2015లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో, ఆప్‌కు మెజారిటీ వస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. వారి విజయం ఏ స్థాయిలో వుంటుందో ఎవరూ అంచనా వేయలేకపోయారు. మొత్తంగా 70సీట్లకు గానూ ఆప్ 67 స్థానాల్లో విజయ బావుటా ఎగరేసింది. 50 స్థానాలు దాటవచ్చని మాత్రమే ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నాయి. ఎవరూ ఊహించని రీతిలో ఫలితాలు వచ్చాయి.

ఈ ఉదాహరణలన్నీ చూస్తుంటే ఎగ్జిట్ పోల్స్ ఎంత అసందిగ్ధంగా, అనిశ్చితంగా వుంటాయో స్పష్టమవుతోంది. ప్రస్తుత ఎన్నికల తుది ఫలితాల కోసం దేశం యావత్తు ఆతృతంగా ఎదురుచూస్తుంటే, ఎగ్జిట్ పోల్స్ కేవలం చర్చలకు దారి తీసుందని, తుది ఫలితాలు పూర్తి భిన్నంగా వుండొచ్చునని ఈ చారిత్రక ఉదాహరణలు మనకు గుర్తు చేస్తున్నాయి.

2023 చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్

గిరిజన రాష్ట్రమైన చత్తీస్‌గఢ్‌లో గతేడాది జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ సునాయాసంగా విజయం కైవసం చేసుకుంటుందని ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నాయి. అందుకు పూర్తి భిన్నంగా బిజెపి చత్తీస్‌గఢ్‌పై తిరిగి పట్టును సాధించింది. బిజెపికి 50కి పైగా సీట్లు వచ్చాయి. చత్తీస్‌గఢ్‌లో బిజెపి నిర్ణయాత్మకమైన విజయం సాధిస్తుందని ఇండియా టుడే-యాక్సిస్ మై ఇండియా, టుడేస్ చాణక్య, ఇండియా టివి-సిఎన్‌ఎక్స్‌లు మాత్రమే అంచనా వేశాయి. 15ఏళ్ల బిజెపి పాలనకు చరమగీతం పలుకుతూ 2018లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ఓడించి బిజెపి మళ్లీ రాష్ట్ర పగ్గాలు చేపట్టింది.

'ఇండియా' గెలుస్తుంది

(మొదటిపేజీ తరువాయి)

ఇస్తున్నందున సానుకూల ఫలితాలు వస్తాయన్న విశ్వాసం ఉందని ప్రతిపక్ష నేతలు సమావేశంలో చెప్పారని తెలిపారు. కౌంటింగ్ సమయంలో ఫారం 17సి విషయంలో జాగ్రత్తగా ఉండాలని అన్నారు. తమ ఆందోళనలను లేవనెత్తి, వాటిని పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ఎన్నికల కమిషన్‌ను ప్రతిపక్షాలు కలుస్తాయని తెలిపారు. "ఇది ప్రజల సర్వే. ప్రజలు ఈ సమాచారాన్ని మా నాయకులకు ఇచ్చారు. ప్రభుత్వ సర్వేలు ఉన్నాయి. వారి మీడియా స్నేహితులు కూడా లెక్కలు పెంచి బయటపెడతారు. కాబట్టి, మేము మీకు వాస్తవాల గురించి చెప్పాలనుకుంటున్నాము" అని ఖర్గే అన్నారు. "బిజెపి ప్రభుత్వ ఎగ్జిట్ పోల్స్ తో ప్రచారానికి ప్రయత్నిస్తుందని, మేము ప్రజలకు నిజం చెప్పాలనుకుంటున్నాము" అని అన్నారు.

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ "ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన సంఖ్యకు చేరుకోగానే కనీస ఉమ్మడి కార్యక్రమం అమలులోకి వస్తుందని, అదే కొత్త ప్రభుత్వానికి పునాది అవుతుందని అన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ అన్ని చోట్ల నుండి అభిప్రాయాన్ని తీసుకున్న తరువాత "ఇండియా ఫోరం 295 కంటే ఎక్కువ సీట్లు గెలుస్తుందని మేము నమ్ముతున్నాం. బిజెపికి దాదాపు 220 సీట్లు వస్తాయని మేము విశ్వసిస్తున్నాం. అదే సమయంలో ఎన్‌డిఎకు దాదాపు 235 సీట్లు వస్తాయి. ఇండియా ఫోరం బలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు సాగుతుంది" అని అన్నారు. సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ "ఇండియా ఫోరం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. ఆయన (పిఎం) సముద్రం చూడటానికి వెళ్లాడు. తనకు వ్యతిరేకంగా ఉన్న ప్రజలకు వెన్నుపోటు పొడిచాడు" అని అన్నారు. ఫలితాలు ఇండియా ఫోరానికి అనుకూలంగా ఉన్నాయని, బిజెపి ఓడిపోవడమే పెద్ద విషయమని ఆయన అన్నారు. జార్ఖండ్ ముఖ్యమంత్రి చంపయీ సోరేన్ మాట్లాడుతూ జార్ఖండ్‌లో ఇండియా ఫోరం పది సీట్లకుపైగా గెలుస్తుందని చెప్పారు. దేశంలో 295 సీట్లకుపైగా గెలుచుకుంటుందని అన్నారు. ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ మాట్లాడుతూ "ప్రజలు గెలుస్తున్నారు. ఇండియా గెలుస్తుంది. మాకు 295 ప్లస్ సీట్లు వస్తాయి. ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరనే ప్రశ్నకు "జూన్ 4 తరువాత మిగిలిన వారితో కలిసి నిర్ణయిస్తాము" అని ఆయన చెప్పారు.

తెలంగాణలో 10 నుంచి బడిబాట

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో సోమవారం నుంచి ఈనెల 19 వరకు జరిగే బడిబాట కార్యక్రమాన్ని వాయిదా వేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. ఈ నెల 10 నుంచి ప్రారంభించే అవకాశమున్నట్టు సమాచారం. బడిబాట కార్యక్రమాన్ని ఈనెల 25 వరకు నిర్వహించే అవకాశమున్నది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని విశ్వసనీయ సమాచారం. అందుకే బడిబాట షెడ్యూల్‌ను విద్యాశాఖ అధికారులు సవరించారు. ఆ ప్రతిపాదనలను ఇప్పటికే ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించారు.

రేపు లాసెట్ రాతపరీక్ష

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే లాసెట్ రాతపరీక్ష సోమవారం జరగనుంది. అదేరోజు ఉదయం తొమ్మిది నుంచి 10.30 గంటల వరకు లాసెట్ (మూడేండ్లు), మధ్యాహ్నం 12.30 నుంచి రెండు గంటల వరకు లాసెట్ (మూడేండ్లు) రెండు విడతల్లో, అదేరోజు సాయంత్రం నాలుగు నుంచి 5.30 గంటల వరకు లాసెట్ (ఐదేళ్లు, పిజిలాసెట్) నిర్వహిస్తారు. మూడేళ్ల కోర్సుకు 36,079 మంది, ఐదేండ్ల కోర్సుకు 10,197 మంది, పిజిలాసెట్‌కు 4,408 మంది దరఖాస్తు చేశారు.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర వహించి, వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పోరాటాలతో కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1206వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఎల్‌ఎంఎంఎం, ఎస్‌బిఎం విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ డైరక్షన్‌లో స్టీల్ యాజమాన్యం నడుస్తూ ప్లాంటును నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఈ క్రమంలోనే ఉత్పత్తిని తగ్గించడం, కార్మికుల జీతాలను సకాలంలో ఇవ్వకపోవడం వంటి చర్యలు చేపడుతోందని వివరించారు. కార్మికుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని తెలిపారు. ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీయడమే కాకుండా 14 సంవత్సరాలుగా ఉద్యోగోన్నతులు కల్పించకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. ఇతర ఉక్కు పరిశ్రమల్లో కార్మికులకు నూతన వేతన ఒప్పందం జరిగి ఏళ్లు గడుస్తున్నా వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో మాత్రం నూతన వేతన ఒప్పందం జరగలేదన్నారు. మరో మూడు రోజుల్లో ఏర్పడే కొత్త ప్రభుత్వాలు విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు కట్టుబడి ఉండాలని కోరారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు దాసరి శ్రీనివాస్, రమణ, నాయుడు, సురేష్ కుమార్, డి అప్పారావు, వేణు, రామకృష్ణ పాల్గొన్నారు.

గోదావరి డెల్టాకు సాగునీటి విడుదల

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని ఆయకట్టుకు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత శనివారం సాగునీటిని విడుదల చేశారు. ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద గోదావరికి పూజలు నిర్వహించి తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాల మూడు ప్రధాన పంట కాలువలకు సాగునీటిని వదిలారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ మూడు డెల్టాల పరిధిలోని రైతులు ఈ నీటిని ఉపయోగించుకొని 2024 ఖరీఫ్ పంటల సాగుకు సయాయత్తం కావాలని కోరారు. సకాలంలో వరి నాట్లు వేసుకోవాలని సూచించారు. గోదావరి నదిలో ప్రస్తుతం ఎనిమిది వేల క్యూసెక్కుల నీరు నిల్వ ఉందని, అదనంగా ఉన్న మూడు వేల క్యూసెక్కుల సాగునీటిని మూడు డెల్టాలకు విడుదల చేస్తున్నామన్నారు. తూర్పు డెల్టాకు 1,500 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 1,000, మధ్య డెల్టాకు 500 క్యూసెక్కుల సాగునీరు విడుదల చేసినట్టు తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఖరీఫ్‌లో ఏటా 4.94 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. పశ్చిమ డెల్టా కింద (ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో) 4.60 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. నీటి విడుదల కార్యక్రమంలో ధవళేశ్వరం గోదావరి డెల్టా సిస్టం చీఫ్ ఇంజనీరు ఆర్.సతీష్ కుమార్, ఇరిగేషన్ ఎస్ఇ జి.శ్రీనివాసులు, ఇఇ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో తెలంగాణ గ్రూప్-1 హాల్‌టికెట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్ష జూన్ తొమ్మిదిన ఆఫ్‌లైన్ విధానంలో ఓఎంఆర్ పద్ధతిలో జరగనుంది. శనివారం నుంచి టిఎస్‌పిఎస్‌సి వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అభ్యర్థులకు అవకాశమున్నది. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-1కు 4.03 లక్షల దరఖాస్తులొచ్చాయి. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను జూన్ తొమ్మిదిన ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తారు. అదే రోజు ఉదయం తొమ్మిది గంటల నుంచే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఉదయం పది గంటలకు అంటే పరీక్షా ప్రారంభానికి అరగంట ముందే గేట్లు మూసివేస్తారు. ఆ తర్వాత వచ్చిన అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోరు. సకాలంలో చేరుకోవాలని అధికారులు సూచించారు. కాలిక్యులేటర్లు, పేజర్లు, సెల్‌ఫోన్లు, టేబుల్స్, పెన్‌డ్రైవ్‌లు, బ్లూటూత్ పరికరాలు, గడియారాలు, మ్యాథమెటికల్ టేబుళ్లు, లాగ్ బుక్స్, లాగ్ టేబుళ్లు, వ్యాలెట్, హ్యాండ్‌బ్యాగ్‌లు, సంచులు, పౌచ్‌లు, ప్యాడ్‌లు, నోట్స్, చార్ట్‌లు, లూజ్ షీట్స్, జ్యుయెలరీ, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను వెంటతెచ్చుకోవద్దన్నారు.

ఆగని మరణాలు

(మొదటిపేజీ తరువాయి)

స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కోరుతూ శనివారం మొగల్రాజపురంలో సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం, బాధితులకు రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం, ఆస్పత్రి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డి కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అతిసార నివారణకు చర్యలు
: ఎన్‌టిఆర్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని

నగరంలో అతిసార నివారణకు పలు చర్యలు తీసుకుంటున్నాం. బాధితుల ఇళ్లల్లో నీటి నమూనాలను సేకరించి, పరీక్ష కోసం గుంటూరుకు పంపాం. మొగల్రాజపురం ప్రాంతంలో ఇప్పటి వరకు 44 మంది బాధితులు నమోదయ్యారు. శుక్ర, శనివారాల్లో కేసులు నమోదు కాలేదు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సిబ్బంది మూడు షిఫ్ట్‌ల్లో సేవలందిస్తున్నారు. ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు.

నీరు కలుషితం కాలేదు
: విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మంచినీరు కలుషితమైనట్లు వస్తున్న అసత్యపు వదంతులను నమ్మొద్దు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నమూనాల పరీక్షల్లో ఎక్కడా నీరు కలుషితం కాలేదని తేలింది. ఇంటింటి సర్వే నిర్వహించి తాగునీటి విషయంలో ప్రజలకు ఇబ్బందులూ లేకుండా చర్యలు తీసుకుంటాం.

నీటి కాలుష్యమే కారణం
: బాధితురాలు కృష్ణకుమారి భర్త ఎస్.వెంకటరమణ

కలుషిత నీరే అతిసార విజృంభణకు కారణం. సున్నపు బట్టీల సెంటర్, మొగల్రాజపురం ఆటో స్టాండ్, సిపిఎం కార్యాలయం సమీపంలోని ఒక వీధిలో మంచినీటి పైప్‌లైన్లు పగిలిపోయి డ్రెయినేజీ నీరు కూడా కలుస్తోంది. ప్రతి ఇంట్లో ఇద్దరు ముగ్గురు అతిసార బాధితులు ఉన్నారు.

అతిసార మరణాలు ఆందోళనకరం : చంద్రబాబు

విజయవాడలో అతిసార మరణాలు ఆందోళనకరమని టిడిపి అధినేత చంద్రబాబు అన్నారు. వారం రోజుల్లో తొమ్మిదిమంది మృతి చెందడంపై ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బెదిరింపులతో భూ ఒప్పందాలు

(మొదటిపేజీ తరువాయి)

రూ.10 నుంచి రూ.15 లక్షలు రైతుల చేతుల్లో పెట్టారు.

ఒప్పందాల తరువాత ఫ్రీ హోల్డ్

ఐఎన్ఎస్ కళింగ వద్ద రూ.కోట్ల విలువైన భూములను ప్రభుత్వ పెద్దలు కాజేశారు. సర్వే నెంబరు 94/2లో ముదపాక నూకన్నకు చెందిన ఎకరా 60 సెంట్లు, సర్వే నెం.94/4లోని ముదపాక రాంబాబుకు చెందిన 2 ఎకరాలు, సర్వే నెంబరు 94/5లోని ముదపాక బంగారమ్మకు చెందిన 2 ఎకరాలు, 94/2లోని ముదపాక తారుకు చెందిన ఎకరా 97 సెంట్లు.. ఇలా 104/5 నుంచి వరుసగా 20 సర్వే నెంబర్ల భూమిని ఒక బినామీ పేరిట ఒప్పందం చేసుకున్నారు. ప్రభుత్వంలోని అత్యున్నత అధికారికి ఆయన బినామీగా వ్యవహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. రాష్ట్ర మంత్రి ఈ వ్యవహారంలో భాగస్వామిగా ఉన్నారని, చెబుతున్నారు. ఒప్పందాలు కుదిరిన ఈ భూములను త్వరలో ఫ్రీ హోల్డ్ చేయనున్నారని సమాచారం.

అంతటా వీరే...

విశాఖ జిల్లా పద్మనాభం మండలం అనంతవరంలో సుమారు 90 ఎకరాలకు కూడా ఇదే విధంగా అడ్వాన్స్ ఇచ్చినట్లు తెలిసింది. 2003కు ముందు ఇచ్చిన డి పట్టా కాబట్టి రిజిస్ట్రేషన్ జరిపేందుకు ఫ్రీ హోల్డ్ చేయనున్నారని సమాచారం. అనంతవరంలోనూ 300 ఎకరాలకు బేరసారాలు జరుగుతున్నట్లు సమాచారం. ఇక్కడ కూడా 90 ఎకరాలకు ఒప్పందం కుదరినట్లు చెబుతున్నారు. నందపురం పూలమార్కెట్ లోపల 100 ఎకరాలకుకూడా ఒప్పందాలు చేసుకోనున్నట్లు సమాచారం.

కలెక్టర్ ఏమంటున్నారంటే ?

విశాఖ జిల్లాలోని భీమిలి, పద్మనాభం, ఆనందపురం మండలంలోని సుమారు 700 ఎకరాలకు మే 21న జిల్లా స్థాయి రివ్యూ కమిటీ లో ఆమోదం అనంతరం ఫ్రీ హోల్డ్ ఇచ్చినట్లు కలెటక్లర్ డాక్టర్ ఎ. మల్లికార్జున చెప్పారు. 2023 డిసెంబరు 19న జీవో ఎంఎస్ నెంబరు 596 ఆధారంగా ఈ ప్రక్రియ జరిపినట్లు తెలిపారు.

కౌంటింగ్ రోజున, ముందు
భావోద్వేగాలు అదుపుతప్పే ప్రమాదం

- అత్యంత శ్రద్ధతో శాంతిభద్రతలు నిర్వహణ : సిఇఓ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఓట్ల లెక్కింపు రోజు, ముందు రోజు భావోద్వేగాలు అదుపుతప్పే అవకాశం ఉందని, అత్యంత శ్రద్ధతో శాంతిభద్రతల పరిస్థితిని నిర్వహించాల్సిన అవసరం ఉందని సిఇఓ ముకేష్‌కుమార్ మీనా అధికారులకు సూచించారు. ఏడు దశల ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో శనివారం జిల్లాల ఎన్నికల అధికారులు, ఎస్‌పిలు, సిపిలకు అభినందనలు తెలియజేస్తూ లేఖ రాశారు. ఈ ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అసాధారణమైనవని తెలిపారు. ఇప్పటి వరకూ ఎప్పుడూ లేనంత అధికస్థాయిలో పోలింగు నమోదైందని తెలిపారు. ప్రస్తుతం ఓట్ల లెక్కింపు క్లిష్టమైన దశకు చేరుకున్న నేపథ్యంలో ఎంతో వ్యూహాత్మకంగా ఎదుర్కోవాల్సి ఉందని తెలిపారు. ఎగ్జిట్‌పోల్స్ ప్రకటన అనంతరం ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉందని, దీన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలో ఆటంకాలు కలిగించే వ్యక్తిని1961 రూల్ 53(4) ప్రకారం బయటకు పంపించాలని తెలిపారు. రాజకీయంగా సున్నితమైన ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలను కఠినంగా అదుపు చేయాలని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలు, ఇబ్బంది కలిగించేవారిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. తప్పుడు వార్తలు, పుకార్లను ఎప్పటికప్పుడు ఖండించాలని, దీనికోసం పూర్తిస్థాయిలో కమ్యూనికేషన్ వ్యవస్థను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. కర్తవ్య నిర్వహణలో అప్రమత్తంగా చురుకుగా ఉండాలని, ఈ కీలకమైన కాలంలో శాంత్రిభద్రతలను కాపాడటం ఎంతో అమూల్యమూని పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారిని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. శనివారం ఉదయం సుప్రభాత సేవలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు శ్రీవారి శేష వస్త్రంతో సత్కరించారు.

తిరుమలలో భక్తుల రద్దీ

తిరుమలలో సందర్శకుల రద్దీ కొనసాగుతోంది. శనివారం కావడంతో రద్దీ మరింత పెరిగింది. రోజురోజుకూ యాంత్రికుల సంఖ్య పెరుగుతుండడంతో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. క్యూ లైన్‌లో ఉన్నవారికి ఉచిత మంచినీళ్లు, అన్నప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. రూ. 300 ప్రత్యేక దర్శనం టికెట్లను కొనుగోలు చేసినవారికి శ్రీవారి దర్శనం మూడు నుంచి నాలుగు గంటల సమయం, ఉచిత దర్శనానికి 24 గంటల సమయం పడుతుందని టిటిడి అధికారులు తెలిపారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లన్నీ సందర్శకులతో నిండిపోయాయి. బయట వరకూ క్యూ లైన్ ఉంది.

తిరుమల శ్రీవారిని శుక్రవారం 67,873 మంది సందర్శకులు దర్శించుకున్నారు. తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.93 కోట్లు వచ్చిందని టిటిడి అధికారులు తెలిపారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి- అరకులోయ రూరల్ (అల్లూరి జిల్లా)



మృతి చెందిన రంగారావు

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం పద్మాపురం పంచాయతీ కేంద్రంలో శనివారం పిడుగుపాటుకు వ్యక్తి మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం... పద్మాపురంలో వాలీబాల్ టోర్నమెంట్ జరుగుతోంది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఎక్కువ మంది అక్కడకు వచ్చారు.

అంతలోనే ఉరుములు మెరుపులతో వర్షం మొదలవడంతో వారంతా సమీపంలోని చెట్ల కిందకు చేరారు. సరిగ్గా అప్పుడే పిడుగు పడడంతో హుకుంపేట మండలం పాతకోట పంచాయతీ గూన్నగుమి గ్రామానికి చెందిన గెమ్మెలి రంగారావు (35) అక్కడికక్కడే మృతి చెందారు. అదే గ్రామానికి చెందిన గెమ్మెలి సాయి గాయపడి అరకులోయ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

భారత జాతీయ రహదారుల సంస్థ
(రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ - భారత ప్రభుత్వం)
ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్, # 6-4-239, 3వ క్రాస్, మారుతీ నగర్, అనంతపురం - 515 004,
Ph : 08554-275599, ఇ-మెయిల్: anantapur@nhai.org

బహిరంగ ప్రకటన

జాతీయ రహదారుల రుసుము (రేట్లు మరియు వసూళ్ల నిర్ణయం) నియమాలు, 2008 మరియు సవరించిన నియమాలు, 2011 మరియు భారత గెజిట్‌లో 18.02.2013 న ప్రచురించబడిన అధికారిక నోటిఫికేషన్ యస్.ఒ నెం. 403 (ఇ) ప్రకారం, పార్ట్ -II సెక్షన్ 3 – సబ్-సెక్షన్ (ii) ప్రకారం హైదరాబాద్ - బెంగళూరు పై ఉన్న సెక్షన్ కి.మీ. 211.000 నుండి కి.మీ. 295.000 వరకు అమకతాడు గ్రామం సమీపంలోని ప్లాజా వద్ద వినియోగదారుల నుండి రుసుము వసూలు చేయడానికి రేట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జాతీయ రహదారి నెం. 44 దిగువున సవరించబడిన రేట్లు మరియు 03.06.2024, 00.00 గంటల నుండి అమలులోకి వస్తాయి.

వాహన శ్రేణి	సింగిల్ ప్రయాణానికి రుసుము	ఒక రోజులో తిరుగు ప్రయాణానికి రుసుము	నెలలో 50 సింగిల్ ప్రయాణాలకు నెలవారీ పాస్ రుసుము	ఫీ ప్లాజాలోని జిల్లాపరిధిలో నమోదు కాబడిన వాణిజ్య వాహనాలకు సింగిల్ ప్రయాణానికి రుసుము
కారు, జీపు, వ్యాన్ లేదా తేలికైన మోటారు వాహనము	135	200	4490	65
తేలికైన వ్యాపార వాహనము, తేలికైన సరుకుల వాహనము లేదా చిన్న బస్సు	220	325	7255	110
బస్సు లేదా ట్రక్కు (రెండు యాక్సిల్స్)	455	685	15200	230
మూడు- యాక్సిల్ వ్యాపార వాహనములు	495	745	16580	250
HCM లేదా EMC లేదా MAV (నాలుగు నుండి ఆరు యాక్సిల్స్)	715	1070	23835	355
భారీ వాహనాలు (ఏడు లేదా అంతకంటే ఎక్కువ యాక్సిల్స్)	870	1305	29015	435

గమనిక: 1. స్థానిక వ్యక్తిగత ట్రాఫిక్ కోసం నెలవారీ పాస్ రేటు రూ. 2024-25 సంవత్సరానికి 340.00 (మూడు వందల నలభై రూపాయలు). 2. పట్టికలో పైన పేర్కొన్న రుసుము రేట్లు మరియు స్థానిక వ్యక్తిగత ట్రాఫిక్ కోసం నెలవారీ పాస్ మొత్తం జాతీయ రహదారులు రుసుము (రేట్ల నిర్ణయం మరియు సేకరణ) నిబంధనల ఆధారంగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీ నుండి వార్షిక సవరణకు లోబడి ఉంటాయి., నియమాలు, 2008 వాటి సవరణలు.
సం/- ఎ. తరుణ్ కుమార్, డిజిఎం (టెక్నికల్) & ప్రాజెక్ట్ డైరెక్టర్

భారత జాతీయ రహదారుల సంస్థ
(రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ - భారత ప్రభుత్వం)
ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్, # 6-4-239, 3వ క్రాస్, మారుతీ నగర్, అనంతపురం - 515 004,
Ph : 08554-275599, ఇ-మెయిల్: anantapur@nhai.org

బహిరంగ ప్రకటన

జాతీయ రహదారుల రుసుము (రేట్లు మరియు వసూళ్ల నిర్ణయం) నియమాలు, 2008 మరియు సవరించిన నియమాలు, 2011 మరియు భారత గెజిట్‌లో 18.02.2013 న ప్రచురించబడిన అధికారిక నోటిఫికేషన్ యస్.ఒ నెం. 403 (ఇ) ప్రకారం, పార్ట్ -II సెక్షన్ 3 – సబ్-సెక్షన్ (ii) ప్రకారం హైదరాబాద్ - బెంగళూరు పై ఉన్న సెక్షన్ కి.మీ. 295.000 నుండి కి.మీ. 374.000 వరకు కాసేపల్లి గ్రామం సమీపంలోని ప్లాజా వద్ద వినియోగదారుల నుండి రుసుము వసూలు చేయడానికి రేట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జాతీయ రహదారి నెం. 44 దిగువున సవరించబడిన రేట్లు మరియు 03.06.2024, 00.00 గంటల నుండి అమలులోకి వస్తాయి.

వాహన శ్రేణి	సింగిల్ ప్రయాణానికి రుసుము	ఒక రోజులో తిరుగు ప్రయాణానికి రుసుము	నెలలో 50 సింగిల్ ప్రయాణాలకు నెలవారీ పాస్ రుసుము	ఫీ ప్లాజాలోని జిల్లాపరిధిలో నమోదు కాబడిన వాణిజ్య వాహనాలకు సింగిల్ ప్రయాణానికి రుసుము
కారు, జీపు, వ్యాన్ లేదా తేలికైన మోటారు వాహనము	125	190	4200	65
తేలికైన వ్యాపార వాహనము, తేలికైన సరుకుల వాహనము లేదా చిన్న బస్సు	205	305	6785	100
బస్సు లేదా ట్రక్కు (రెండు యాక్సిల్స్)	425	640	14215	215
మూడు- యాక్సిల్ వ్యాపార వాహనములు	465	700	15505	235
HCM లేదా EMC లేదా MAV (నాలుగు నుండి ఆరు యాక్సిల్స్)	670	1005	22290	335
భారీ వాహనాలు (ఏడు లేదా అంతకంటే ఎక్కువ యాక్సిల్స్)	815	1220	27135	405

గమనిక: 1. స్థానిక వ్యక్తిగత ట్రాఫిక్ కోసం నెలవారీ పాస్ రేటు రూ. 2024-25 సంవత్సరానికి 340.00 (మూడు వందల నలభై రూపాయలు). 2. పట్టికలో పైన పేర్కొన్న రుసుము రేట్లు మరియు స్థానిక వ్యక్తిగత ట్రాఫిక్ కోసం నెలవారీ పాస్ మొత్తం జాతీయ రహదారులు రుసుము (రేట్ల నిర్ణయం మరియు సేకరణ) నిబంధనల ఆధారంగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీ నుండి వార్షిక సవరణకు లోబడి ఉంటాయి., నియమాలు, 2008 వాటి సవరణలు.
సం/- ఎ. తరుణ్ కుమార్, డిజిఎం (టెక్నికల్) & ప్రాజెక్ట్ డైరెక్టర్

భారత జాతీయ రహదారుల సంస్థ
(రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ - భారత ప్రభుత్వం)
ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్, # 6-4-239, 3వ క్రాస్, మారుతీ నగర్, అనంతపురం - 515 004,
Ph : 08554-275599, ఇ-మెయిల్: anantapur@nhai.org

బహిరంగ ప్రకటన

జాతీయ రహదారుల రుసుము (రేట్లు మరియు వసూళ్ల నిర్ణయం) నియమాలు, 2008 మరియు సవరించిన నియమాలు, 2011 మరియు భారత గెజిట్‌లో 18.02.2013 న ప్రచురించబడిన అధికారిక నోటిఫికేషన్ యస్.ఒ నెం. 403 (ఇ) ప్రకారం, పార్ట్ -II సెక్షన్ 3 – సబ్-సెక్షన్ (ii) ప్రకారం హైదరాబాద్ - బెంగళూరు పై ఉన్న సెక్షన్ కి.మీ. 374.000 నుండి కి.మీ. 462.164 వరకు మరూర్ గ్రామం సమీపంలోని ప్లాజా వద్ద వినియోగదారుల నుండి రుసుము వసూలు చేయడానికి రేట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జాతీయ రహదారి నెం. 44 దిగువున సవరించబడిన రేట్లు మరియు 03.06.2024, 00.00 గంటల నుండి అమలులోకి వస్తాయి.

వాహన శ్రేణి	సింగిల్ ప్రయాణానికి రుసుము	ఒక రోజులో తిరుగు ప్రయాణానికి రుసుము	నెలలో 50 సింగిల్ ప్రయాణాలకు నెలవారీ పాస్ రుసుము	ఫీ ప్లాజాలోని జిల్లాపరిధిలో నమోదు కాబడిన వాణిజ్య వాహనాలకు సింగిల్ ప్రయాణానికి రుసుము
కారు, జీపు, వ్యాన్ లేదా తేలికైన మోటారు వాహనము	140	210	4635	70
తేలికైన వ్యాపార వాహనము, తేలికైన సరుకుల వాహనము లేదా చిన్న బస్సు	225	335	7490	110
బస్సు లేదా ట్రక్కు (రెండు యాక్సిల్స్)	470	705	15695	235
మూడు- యాక్సిల్ వ్యాపార వాహనములు	515	770	17120	255
HCM లేదా EMC లేదా MAV (నాలుగు నుండి ఆరు యాక్సిల్స్)	740	1105	24610	370
భారీ వాహనాలు (ఏడు లేదా అంతకంటే ఎక్కువ యాక్సిల్స్)	900	1350	29960	450

గమనిక: 1. స్థానిక వ్యక్తిగత ట్రాఫిక్ కోసం నెలవారీ పాస్ రేటు రూ. 2024-25 సంవత్సరానికి 340.00 (మూడు వందల నలభై రూపాయలు). 2. పట్టికలో పైన పేర్కొన్న రుసుము రేట్లు మరియు స్థానిక వ్యక్తిగత ట్రాఫిక్ కోసం నెలవారీ పాస్ మొత్తం జాతీయ రహదారులు రుసుము (రేట్ల నిర్ణయం మరియు సేకరణ) నిబంధనల ఆధారంగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీ నుండి వార్షిక సవరణకు లోబడి ఉంటాయి., నియమాలు, 2008 వాటి సవరణలు.
సం/- ఎ. తరుణ్ కుమార్, డిజిఎం (టెక్నికల్) & ప్రాజెక్ట్ డైరెక్టర్

భారత జాతీయ రహదారుల సంస్థ
(రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ - భారత ప్రభుత్వం)
ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్, # 6-4-239, 3వ క్రాస్, మారుతీ నగర్, అనంతపురం - 515 004,
Ph : 08554-275599, ఇ-మెయిల్: anantapur@nhai.org

బహిరంగ ప్రకటన

ప్రజాస్వామ్యానికి ప్రాణమైన ఎన్నికల ప్రక్రియను రాజకీయ రహిత క్రీడగా మార్కెట్ వ్యవహారంగా మార్చడం అతి పెద్ద మార్పు. నిజానికి పరిభాష కూడా మారిపోయింది. ప్రజలను ఓటర్ల డేటాగా చూడటం. బిగ్ డేటా వుంటే రకరకాల పద్ధతుల్లో బుర్రలు నింపేయొచ్చని భావించడం ఇందులో మొదటిది. బిగ్ డేటా, డేటా ఎనలిస్టులు, మార్కెటింగ్ సర్వే సైన్యంతో బయలుదేరడమే. వీలైతే సొంత టీములు, లేదంటే ఉమ్మడిగా, అదీ కాదంటే నాయకులకు పార్టీలకు అనుబంధంగా వుండి డీల్ కుదుర్చుకోవడం. ఈ క్రమంలో వారి సమస్యలు మనోభావాలు కూడా ఓట్ల ఆకర్షణ కోణంలోనే. ఏది వారిని ప్రభావితం చేస్తుందంటే కాస్త చర్చించి ఏదో పేరుతో ఏదో రూపంలో అది చేయడం. అది కుల మత ఛాందసమా అసభ్యత అసహనం పెంచేదా వంటి కొలబద్దలేమీ వుండక్కర్లేదు. ఉద్వేగాలు పెంచడానికి పనికి వచ్చేదైతే మరీ మంచిది. అలాంటి వ్యక్తిగత అంశాలను అనుకూలంగానూ ప్రతికూలంగానూ వెతికి తెచ్చి మరీ రచ్చ చేయడం. టీవీ రేటింగులలాగే ఈ పనుల వల్ల కలిగిన లాభనష్టాలను బేరీజు వేసి మరో చోట అదే రకమైన ప్రయోగం. అంతే. దీర్ఘకాల ప్రజా ప్రయోజనం ప్రజాస్వామిక విలువల వంటి సంకోచాలే వుండక్కర్లేదు. కావాలంటే మరో పక్షాన్ని లేదా ప్రత్యర్థిని అప్రతిష్ట పాలు చేసేందుకు ఏం చేసినా ఫర్వాలేదు. పైగా ఫలానా వారు ఫలానా పార్టీలోనే వుడాలనీ లేదు. గిట్టుబాటయ్యే బేరం వస్తే పార్టీలో చీలిక తేవచ్చు. ఇప్పుడు తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ విచారణలో ఒక కోణం ఏమిటంటే బిఆర్‌ఎస్ రోహిత్ రెడ్డిని బిజెపి నేతలు కదిలించడం, మరికొందరిని కలుపుకోవాలని చూడటం, దాన్ని కెసిఆర్ వాడుకున్నారనే ఆరోపణ ఒకటైతే అసలా అనైతికత విషయమేంటి? వచ్చిన రాజకీయ దళారులలో వ్యాపారులు, పూజారులు కూడా వుండటమేమిటి? ఆర్థిక వనరులు పుష్కలంగా వున్న వారు ఎప్పుడు ఏ పార్టీ మారినా స్వాగతమే. తాజాగా ఆంధ్ర ప్రదేశ్‌లోనే చూస్తే ఒక కూటమిగా ఏర్పడిన పార్టీలలో కూడా అటూ ఇటూ దూకి పోటీ చేసినవారు కనిపిస్తారు. అందుకోసం అత్యధిక సంపదలు కలిగిన అభ్యర్థుల వేట. అవకాశాలతో అన్వేషణ. టికెట్ ఇచ్చే పార్టీకి రూ. వంద కోట్లో యాభై కోట్లో ముందే నిధి. తాము పోటీ చేసే పార్లమెంటు సీటు పరిధిలో అసెంబ్లీ స్థానాలకు పెట్టుబడి. వీలైతే ముందే అక్కడ శిబిరాలు ఏర్పాటు చేయించుకుని హంగామా చేయడం. టికెట్ కోసం ప్రయత్నం చేయడానికి ముందే నియోజక వర్గంలో ఓటర్ల కులాల పొందికపై ప్రత్యేక పరిశీలన. నిజం చెప్పాలంటే ప్రశాంత కిశోర్‌తో సహా ఈ వ్యూహకర్తలు ఎక్కువ సార్లు చెప్పేది కులం లెక్కలేనని పాలక పార్టీల నేతలు ఒప్పుకుంటున్నారు. ఒకే వ్యూహకర్త ఒకోసారి ఒక వైపున పని చేయడం వెంటనే మరోవైపు దూకడం ఆశ్చర్యం కలిగించే వాస్తవం. మోడీకి, రాహుల్ గాంధీకి ఒకే ప్రశాంత కిశోర్ పనిచేస్తాడు. జగన్‌కు పని చేసి మళ్లీ చంద్రబాబుతో మంతనాలు జరుపుతాడు. ఆయన పని చేసిన ఐ ప్యాక్ సంస్థ వారే రెండు వైపులా వుంటారు. ఈ మధ్యలో చాలా విన్యాసాలు చేస్తాడు. కానీ బడా మీడియా ఆయనకే అగ్ర తాంబూలం ఇచ్చి అభిప్రాయాలు ఆణిముత్యాలన్నట్టు ప్రచారం ఇస్తుంది. ఎందుకంటే ఆ పార్టీలకూ కార్పొరేట్ మీడియాకు పనిచేయించుకునే పార్టీలకూ కూడా రాజకీయ సైద్ధాంతిక పట్టింపులేమీ వుండవు. ఇవన్నీ డీల్స్ మాత్రమే.



ఇమేజి గేమ్

ఒక డ్రైవరో కండక్టరో ఎక్కిన వాళ్లను ప్యాసింజర్లుగా మాత్రమే లెక్కపెడతారు. ఒక హోటల్ యజమాని ఎన్ని టిఫన్లు, ఎన్ని మీల్సు లెక్క కడతాడు. అలాగే ఎన్నికలు, ఓట్లు, ఓటర్లు, వారిపై ఖర్చు అంతా మార్కెట్ భాషలో చూడటమే. ఈ పని రాజకీయ విధానాలతో సేవలతో కాకుండా చిట్కాలతో ఎత్తులతో పూర్తి చేయాలి. ఓటరు ప్రొఫైల్ ఏమిటి? కులం, మతం, లింగం, నేపథ్యం తెలుసుకుంటే ఏ విధంగా పడగొట్టొచ్చు. ఓట్ల కొనుగోలు దీనికి అదనం. దానికి కూడా మెథడాలజీ. పోల్ మేనేజిమెంట్ అంటే మనేజ్‌మెంటు అని సరదాగా అనేదందుకే. ఇవన్నీ గతంలో కార్యకర్తలు లేదా స్థానిక దాదాలు చేస్తే ఇప్పుడు కార్పొరేట్ స్టయిల్‌లో చేసేవాళ్లు వచ్చేశారు. మీరు సోషల్ మీడియాలో లేదా మీడియాలో ఏం చూస్తున్నారు మీ స్నేహితులెవరు. అభిరుచులేమిటి తెలుసుకుని ఆ రూట్లో చేరుకోవడం. మార్కెట్ భాషలో గ్యారంటీలు ప్రకటించడం. గ్యారంటీ వారంటీ డబుల్ ధమాకా ఆఫర్ ఇలాంటి భాష ఇప్పుడు రాజకీయాల్లో సర్వసాధారణమైపోయింది. ఓటర్లే కాదు, అభ్యర్థులూ సరుకులే. మొదటిది వారి బడ్జెట్ ఎంత? స్వంతంగా భరించగలరా లేక భరించేవారి తరఫున ఏజంటుగా పనిచేస్తారా? ఈ తతంగం మార్కెటింగ్ టీం కూడా సహకరించే విధంగా జరగొచ్చు. ఆ మేరకు నేతలను కలిసి ఆఫర్లు ఇచ్చి పార్టీలు మార్పించడం చేర్చుకోవడం జరగొచ్చు. అది కాస్త ముగిశాక ఇమేజ్‌పెంచడం. మేకోవర్. మోడీ చాయ్ వాలాగా బయిలుదేరి గాయ్ వాలాగా మారి, రామ్ చే లాగా ఎదిగి ఇప్పుడు సాగర్ ఝూ లా వూగుతున్నారంటే ఇదంతా ఒక నిర్దిష్టమైన పథకం ప్రకారం జరుతున్నదే. ఆయన వేషభాషలు, సందేశాల సంకేతాలు మకాం వేసే నేపథ్యాలు ఏవీ ఊరికే నిర్ణయం కావు. మార్కెట్ ప్రొడక్టు అభ్యర్థి అయితే తనను కష్టమర్లయిన ఓటర్లకు ఆకర్షణీయంగా తయారుచేయాలి. అదే బ్రాండ్ ఇమేజి. మోడీ బ్రాండ్, చంద్రబాబు బ్రాండ్, అమరావతి బ్రాండ్. ఇలా చాలా చెప్పొచ్చు. ఇందుకోసం ప్రత్యేక అధ్యయనాలు. అభిప్రాయ సేకరణలు చాప కింద నీరులా సాగిపోయాయి. నిజానికి ఇది 1980లో ఇందిరాగాంధీ పనిచేసే ప్రభుత్వం అంటూ తిరిగివచ్చిన సమయంలోనే మొదలైంది. తర్వాత వాజ్‌పేయి హయాంలో ఫీల్‌గుడ్ ఫ్యాక్టర్, ఇండియా షైనింగ్ వంటి నినాదాలు కూడా వచ్చాయి. ప్రపంచీకరణ మీడియా విస్తరణతో పాటు ఇప్పుడు ఈ యంత్రాంగం కూడా విస్తరించిందన్నమాట. ఎ.పి ముఖ్యమంత్రి జగన్ సభల క్యాప్షన్, బొమ్మ ప్రసంగాలలో ఎత్తుగడ అన్నీ స్క్రిప్టులే. ఈ అయిదేళ్లు ఐప్యాక్ టీము ఏదో రూపంలో ఆయనతో వుంటూనే వచ్చింది కదా? విధానాల పరమైన ప్రణాళికలు పోయి గ్యారంటీలు వాటికి మోడీ గ్యారంటీలని గొప్పలు చెప్పడం వ్యాపార భాష కదా?

వాట్సప్ నుంచి యూ ట్యూబ్

ఇక ప్రచారంలో సాధనాలు సంస్థలు కూడా సిద్ధంగా వుంటాయి. ఒక మీడియా సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంటే మన ప్రమోషన్ చూసి పెడుతుంది. ఎన్ని ఇంటర్వ్యూలు, ఎంత కవరేజి అన్నీ సాగిపోతాయి. మనను కవర్ చేయడంతో పాటు ప్రత్యర్థిని బద్‌నాం చేసే పని కూడా వాళ్లదే. ఇందుకు సోషల్ మీడియా ఆర్మీలు. అసలైన సమస్యలు పక్కన పెట్టి అవతలివారిని దెబ్బ తీయడం మనను పైకి లేపడం మాత్రమే టార్గెట్‌గా పనిచేయడం. తక్కువ జీతాలకే యువత దొరుకుతారు గనక వారిని పనిలో పెట్టుకుంటే బతుకుతెరువు కోసం అన్నీ చేసి పెడతారు. మన ప్రచారం మోత మోగిస్తారు. 2019లో వాట్సప్‌లో మెసేజ్‌లు పంపడం ప్రధానంగా వుంటే ఈ సారి నేరుగా యూట్యూబ్ ఛానళ్లు లేదా మన స్వంత ఛానల్ పెట్టుకుని అప్‌లోడ్ చేసుకోవడమే. ఎవరికీ బాధ్యత లేదు. ఏదైనా వివాదం వస్తే తప్ప, వివాదాలు పెంచడం కూడా ఇందులో భాగమే. అంటే రాజకీయ నిబద్ధత ఎంత మాత్రం లేని అభ్యర్థులు వ్యూహకర్తలు ప్రచార యంత్రాంగం పనిచేసి పెడతాయి. మీడియాలో కూడా నిబద్ధతతో పని చేసేవారిని వేటాడటం, ఆ సంస్థలనే కొనేయడం రివాజుగా మారిపోయింది. ప్రణయ్ రాయ్ వంటి వారు కూడా స్వంత వేదికలు ఏర్పాటు చేసుకోవడం తప్ప పెద్ద తరహా సంస్థల్లో చోటు కాపాడుకోలేని పరిస్థితి. బడా కుటుంబాలు లేదా వ్యాపారాల్లో గుట్టలు పోసుకున్నవారు కాదంటే సినిమా సెలబ్రిటీలు, కార్పొరేట్ వర్గాల సేవకులు ఎన్‌ఆర్‌ఐలు మీడియాలో రాజకీయాల్లో దిగిపోవడమే. విశేషించి తెలుగు రాష్ట్రాల్లో దేశంలోనే అతి సంపన్నులైన అభ్యర్థులు రంగంలో నిలవడం దేశమంతా చర్చనీయాంశమైంది. వామపక్షాల వరవడి వుంది గనక సమస్యలపై చర్చ కొంతైనా జరిగింది గానీ లేకపోతే కేవలం మార్కెటింగ్ వ్యూహాలతోనే గడిచిపోయేది. సంఘ సంస్కరణ, స్వాతంత్రోద్యమం, కమ్యూనిస్టు ఉద్యమం వంటి బలమైన సంప్రదాయాలు గల చోట కార్పొరేట్ బాబులు కుల శక్తుల కుమ్ములాటగా ఎన్నికలు జరగడం దిగ్భ్రాంతి కలిగించే వాస్తవం. ఇవన్నీ సర్వసాధారణమైనట్టు భావించడం మరింత దారుణం. ఇరువైపుల ఆటగాళ్లు ఒకే ఆట ఆడుతూ ఆశయాలు ఉద్యమాల కోసం పాటు పడేవారిని అపహాస్యం చేయడం అలక్ష్యం చేయడం ఇక్కడ కొసమెరుపు. బ్యూరోక్రసీ కూడా ఇందుకు తగినట్టే వ్యవహరిస్తుంది. ప్రైవేట్ భాగస్వాములను కూడా సలహాదారులై సర్కార్లను నడిపిస్తున్నారు. ముప్పయ్యేళ్ల ప్రపంచీకరణ పర్యవసానమైన కార్పొరేట్ గవర్నెన్స్ ప్రతిఫలనమే ఇది. పైగా కార్పొరేట్ మార్కెటింగ్ రాజకీయం మితవాద, మతవాద రాజకీయాలను తప్ప ప్రగతిశీలతను సహించదు. ఎందుకంటే ఉద్యమ చైతన్యం దోపిడీని ప్రశ్నిస్తుంది గనక ఆ శక్తులను లేకుండా చేసే కుట్ర సాగిపోతుంటుంది. ఎందుకంటే ప్రపంచీకరణ మౌలికంగా ప్రజాస్వామిక విలువలకు వ్యతిరేకమైంది. అందుకే తక్షణ రాజకీయ పోరాటంతో పాటు దీర్ఘకాలంలో ప్రజాస్వామిక పునాదులు కాపాడుకోవడానికి గట్టి కృషి అవసరం. పూర్తి ఫలితాల తర్వాత ఇందుకు సంబంధించిన మరింత నిర్దిష్టత రావచ్చు.

సంఘ సంస్కరణ, స్వాతంత్రోద్యమం, కమ్యూనిస్టు ఉద్యమం వంటి బలమైన సంప్రదాయాలు గల చోట కార్పొరేట్ బాబులు కుల శక్తుల కుమ్ములాటగా ఎన్నికలు జరగడం దిగ్భ్రాంతి కలిగించే వాస్తవం. ఇవన్నీ సర్వసాధారణమైనట్టు భావించడం మరింత దారుణం. ఇరువైపుల ఆటగాళ్లు ఒకే ఆట ఆడుతూ ఆశయాలు ఉద్యమాల కోసం పాటు పడేవారిని అపహాస్యం చేయడం అలక్ష్యం చేయడం ఇక్కడ కొసమెరుపు. బ్యూరోక్రసీ కూడా ఇందుకు తగినట్టే వ్యవహరిస్తుంది. ప్రైవేట్ భాగస్వాములను కూడా సలహాదారులై సర్కార్లను నడిపిస్తున్నారు. ముప్పయ్యేళ్ల ప్రపంచీకరణ పర్యవసానమైన కార్పొరేట్ గవర్నెన్స్ ప్రతిఫలనమే ఇది. పైగా కార్పొరేట్ మార్కెటింగ్ రాజకీయం మితవాద, మతవాద రాజకీయాలను తప్ప ప్రగతిశీలతను సహించదు. ఎందుకంటే ఉద్యమ చైతన్యం దోపిడీని ప్రశ్నిస్తుంది గనక ఆ శక్తులను లేకుండా చేసే కుట్ర సాగిపోతుంటుంది. ఎందుకంటే ప్రపంచీకరణ మౌలికంగా ప్రజాస్వామిక విలువలకు వ్యతిరేకమైంది. అందుకే తక్షణ రాజకీయ పోరాటంతో పాటు దీర్ఘకాలంలో ప్రజాస్వామిక పునాదులు కాపాడుకోవడానికి గట్టి కృషి అవసరం.

పట్టాలు లేవని పరిహారం ఇవ్వలేదు

- ఇష్టానుసారంగా తోటలు ధ్వంసం చేస్తే ఎలా?
- ఆవేదన వ్యక్తం చేసిన రీసుపేట, బసవపాలెం గ్రామస్తులు
- చెట్ల తొలగింపు అడ్డగింత


మా పొలంలోని చెట్లను తొలగించొద్దంటూ అడ్డుపడుతున్న కుటుంబం

ప్రజాశక్తి- భోగాపురం (విజయనగరం జిల్లా)

ఏళ్ల తరబడి ఏపుగా పెంచుకున్న జీడి తోటలను భూములకు పట్టాలు లేవని పరిహారం ఇవ్వకుండా జిఎంఆర్ సంస్థ సిబ్బంది ఇష్టానుసారంగా ధ్వంసం చేస్తున్నారని విజయనగరం జిల్లా భోగాపురం మండలం ముడసర్లపేట పంచాయతీ రీసుపేట, బసవపాలెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు కూడా తమ పరిహారం విషయంలో పట్టించుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ వారి భూముల్లో జిఎంఆర్ సంస్థ చేపడుతున్న చెట్ల తొలగింపును శనివారం రైతులు అడ్డుకున్నారు. బసవపాలెం రెవెన్యూ పరిధిలో అంతర్జాతీయ విమానాశ్రయం సెక్యూరిటీ విభాగమైన సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) సిబ్బంది ఉండేందుకు నివాస గృహాలు నిర్మించనున్నారు. ఇందుకోసం సర్వే నెంబరు 25లో 25 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించారు. ఇందులో డి-పట్టా మూడున్నర ఎకరాలు కూడా ఉంది. పట్టాలు ఉన్నందున ఆ భూమికి ఎకరాకు రూ.53 లక్షలు నష్టపరిహారం ఇచ్చేందుకు అధికారులు నిర్ణయించారు. మిగతా 22 ఎకరాల భూములకు పరిహారం ఊసెత్తలేదు. ఈ భూములు కూడా రైతుల ఆధీనంలోనే ఉన్నా పరిహారం ఇవ్వడానికి ముందుకు రాలేదు. దీంతో, తాతదండ్రుల నుంచి ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న తమ భూములకు పరిహారం ఇవ్వకపోవడం దారుణమని సుమారు 40 మంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడ్డుకున్నా జెసిబితో జీడితోట్ల తొలగింపు

ఈ భూముల్లో రైతులు పెంచుకున్న జీడి తోటలను గత రెండు రోజుల నుంచి జిఎంఆర్ సంస్థ సిబ్బంది జెసిబిలతోపాటు రంపం మిషన్లతో తొలగిస్తున్నారు. తాము అడ్డుకుంటున్నప్పటికీ పక్కకు తోసేసి మరీ దౌర్జన్యంగా తొలగిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది రైతులు చెట్ల దగ్గరకు జెసిబిలు రాకుండా అడ్డుకున్నారు. మరి కొంతమంది రైతులు అందుబాటులో లేకపోవడంతో వారి తోటల్లోని చెట్లను జిఎంఆర్ సిబ్బంది తొలగించారు. ఒక మాజీ ఆర్మీ అధికారి తన భూమికి సంబంధించిన పేపర్లు ఉన్నాయని చెప్పడంతో తహశీల్దారు కార్యాలయానికి వెళ్లి చూపించాలని అక్కడ ఉన్న అధికారులు సూచించారు.

మహిళలమని చూడకుండా దౌర్జన్యం చేస్తున్నారు



ఎన్నో ఏళ్ల నుంచి ఈ భూముల్లో మేమంతా సాగు చేసుకుంటున్నాం. ఎప్పటి నుంచో పెంచిన జీడి చెట్లను నష్టపరిహారం ఇవ్వకుండా నరికేస్తున్నారు. అడ్డుపడితే జిఎంఆర్ సంస్థ సిబ్బంది మహిళలమని చూడకుండా దౌర్జన్యం చేస్తున్నారు. నా భుజంపై చేయివేసి మరీ తోసేశారు. ఇది చాలా దారుణం. మమ్మల్ని నాయకులు, అధికారులు ఆదుకొని నష్టపరిహారం ఇవ్వాలి.

-రీసు పాప, మహిళా రైతు, బసవపాలెం.

సినీ గేయ రచయిత జాలాది భార్య మృతి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

ప్రముఖ తెలుగు సినీ రచయిత కీర్తిశేషులు జాలాది రాజారావు సతీమణి జాలాది ఆగ్నేషమ్మ శనివారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె విశాఖలోని సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం సుమారు 3 గంటల ప్రాంతంలో తుది శ్వాస విడిచారు. జాలాదిగా పేరుగాంచిన జాలాది రాజారావు 275 సినిమాల్లో 1500కు పైగా పాటలను రచించారు. సినీ గేయ రచయితగా ఆయన ప్రయాణంలో జాలాది ఆగ్నేషమ్మ ప్రముఖ పాత్ర పోషించారు. ఆమె మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, అభిమానులు సంతాపం తెలియజేశారు. ఆగ్నేషమ్మ కుమార్తె డాక్టర్ జాలాది విజయ అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నగరంలో నిర్వహిస్తూ గుర్తింపు పొందారు. ప్రస్తుతం విశాఖపట్నం పార్లమెంట్ స్థానం నుంచి సమాజ్‌వాది పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆగ్నేషమ్మ అంత్యక్రియలు ఆదివారం జరగనున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

నాగ్‌పూర్‌లో 56 డిగ్రీల ఉష్ణోగ్రత నిజం కాదు : వాతావరణ శాఖ

నాగ్‌పూర్ : మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఉన్న ఓ వాతావరణ స్టేషన్‌లో గురువారం 56 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవ లేదని, ఎలక్ట్రానిక్ సెన్సార్‌లో లోపం వల్ల అలా జరిగిందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. నాగ్‌పూర్‌లో భారత వాతావరణ విభాగం నాలుగు ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. వీటిలోని సోనేగావ్‌లోని ఎడబ్ల్యూఎస్ స్టేషన్‌లో 54 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా.. ఉత్తర అంబాజరీ రోడ్డులోని ఐఎండి కేంద్రంలో రికార్డు స్థాయిలో 56 డిగ్రీలు నమోదైంది. మిగతా రెండు స్టేషన్లలో 44 డిగ్రీలు ఉన్నట్టు రికార్డయింది. ఈ వార్త దేశమంతా వైరల్‌గా మారింది. ఈ క్రమంలోనే వాతావరణ శాఖ దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేసింది. "మే 30న 56 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవ్వడం నిజం కాదు. దీన్ని అధికారికంగా ధ్రువీకరించడంలేదు. నాగ్‌పూర్‌లో ప్రాంతీయ వాతావరణ కేంద్రం నిర్వహిస్తున్న వాతావరణ స్టేషన్‌లో ఉష్ణోగ్రతలు నమోదయ్యే సెన్సార్ సరిగా పనిచేయడం లేదు. దాన్ని బాగు చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఒక్కోసారి అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో ఎలక్ట్రానిక్ సెన్సార్లు తప్పుడు ఉష్ణోగ్రతలు నమోదు చేసే అవకాశముంది. అప్పుడు సమీపంలోని మరో వాతావరణ స్టేషన్‌లో నమోదైన రికార్డులతో సరిపోల్చుకుంటాం. నాగ్‌పూర్‌లో 56, 54 డిగ్రీలు ఇలా సెన్సార్ తప్పిదం వల్లే నమోదయ్యాయి. సమీపంలోని మరో స్టేషన్‌లో 44-45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది" అని వాతావరణ అధికారులు వెల్లడించారు. ఇటీవల ఢిల్లీలోని ముంగేష్‌పూర్‌లో 52.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన సంగతి తెలిసిందే. ఢిల్లీ చరిత్రలో ఇదే అత్యధికం కావడంతో వాతావరణ శాఖ స్పందించింది. ఆ వాతావరణ స్టేషన్‌లోని సెన్సార్ సరిగా పనిచేస్తుందో, లేదో తనిఖీ చేస్తున్నట్టు తెలిపింది.



మామిడి పండ్ల మేళా అదుర్స్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖ)

విశాఖలోని ఎంవిపి.కాలనీ డబుల్ రోడ్డులోగల గిరిజన భవనంలో శనివారం ఏర్పాటు చేసిన మామిడి పండ్ల మేళాకు నగర వాసులు పోటెత్తారు. సహజ సిద్ధంగా పండించి, ముగ్గించిన వివిధ రకాల జాతుల మామిడి పండ్లను ఇక్కడ ప్రదర్శనకు, అమ్మకానికి ఉంచారు. తొలుత ఈ మేళాను ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం రాష్ట్ర ప్రతినిధి పివిఎస్.రాజు ప్రారంభించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మామిడి రైతులను ఆదుకోవాలనే సంకల్పంతో రెండు రోజులపాటు ఈ మేళాను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే తలంపుతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. మామిడిని సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తులసి నేచురల్స్ ప్రతినిధి సత్యనారాయణ, పాలెం నేచురల్స్ ప్రతినిధి చవ్వాకుల అశోక్, వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


జెసిబితో చదును చేస్తున్న ఆక్రమణదారులు

చెరువు కబ్జాకు యత్నం

- అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి- బొబ్బిలి (విజయనగరం జిల్లా)

మున్సిపాలిటీలోని మిలటరీ కాలనీ సమీపంలో ఉన్న చెరువును కబ్జా చేసేందుకు చేసిన ఓ వ్యాపారి ప్రయత్నించగా రెవెన్యూ ఉద్యోగులు అడ్డుకున్నారు. మిలటరీ కాలనీ సమీపంలో సుమారు రెండెకరాలకుపైగా విస్తీర్ణంలో ఉన్న చెరువును కబ్జా చేసేందుకు పట్టణానికి చెందిన చేపల వ్యాపారి ప్రయత్నించి ప్రొక్లెయిన్‌తో చదును చేయడం ప్రారంభించారు. చెరువును కబ్జా చేస్తున్నట్టు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కల్యాణ్ చక్రవర్తికి తెలియడంతో మల్లమ్మపేట, ఇందిరమ్మ కాలనీ వీఆర్‌ఓ శ్రీనివాసరావు, లలితను చెరువు వద్దకు పంపించి కబ్జాను అడ్డుకున్నారు. చెరువును చదును చేస్తున్న ప్రొక్లెయిన్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. చెరువులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చర్యలు తీసుకోవాలి : సిపిఎం, సిపిఐ

చెరువు కబ్జాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకరరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కోట అప్పన్న వేర్వేరుగా ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చెరువులను ఆక్రమణ చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు.

వ్యవసాయ డిప్లమా కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- రంపచోడవరం (అల్లూరి జిల్లా)

ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించే వ్యవసాయ డిప్లమా కోర్సుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు రంపచోడవరం పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్ కాలేజీ ప్రిన్సిపల్ డి సుధాకర్ తెలిపారు. ఈ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుకు పదవ తరగతి ఉత్తీర్ణత, ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2023 ఆగస్టు 31 నాటికి 15 నుండి 22 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చదివిన విద్యార్థులకు 75:25 నిష్పత్తిలో సీట్లు కేటాయింపు ఉంటుందని తెలిపారు. ఈ నెల 20లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం ఎన్‌జిఆర్‌ఎయు.ఎసి.ఇన్ అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న ఏకైక పాలిటెక్నిక్ అగ్రికల్చర్ కాలేజీలో 2013 నుండి రెండేళ్ల అగ్రికల్చర్ డిప్లమో కోర్సు అందుబాటులో ఉందన్నారు. గత సంవత్సరం నలుగురు స్థానిక కాలేజీ విద్యార్థులు అగ్రిసెట్‌లో ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ అగ్రికల్చర్ డిప్లమా కోర్సులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయని, రెండవ సంవత్సరం మొదటి సెమిస్టర్ పిఎంఎస్ ద్వారా విద్యార్థులకు నేరుగా వ్యవసాయ విధానాలు, వ్యవసాయ వ్యాపారాలు, ఇతర నైపుణ్యాలను అభ్యసిస్తారని పేర్కొన్నారు. స్థానికుల ఎవరైనా సందేహాలుంటే రంపచోడవరం పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్ కళాశాల వేళల్లో నేరుగా సంప్రదించవచ్చని, మరిన్ని వివరాలకు 8247848525 నెంబర్ ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చునని సూచించారు.

విషజ్వరంతో చిన్నారి మృతి

ప్రజాశక్తి- పరిగి (శ్రీసత్యసాయి)

శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండల పరిధిలోని మోదా పంచాయతీ ఆనందపాల్యంలో బాలుడు విషజ్వరంతో శనివారం మరణించాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... ఆనందపాల్యంకు చెందిన అనిరుధ్ సాయి (6) గత కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. అక్కడ నయం కాకపోవడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని బాప్టిస్ట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ బాలుడు మరణించినట్టు వైద్యులు తెలిపారు. విషజ్వరంతో బాలుడు మరణించిన విషయం తెలుసుకున్న పిహెచ్‌సి వైద్యులు స్వరూప్ రెడ్డి, పర్యవేక్షకులు వన్నప్ప ఆనందపాల్యం గ్రామంలో పర్యటించారు. చిన్నారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు. గ్రామంలో మలేరియా, డెంగీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలకు వాతావరణం మారడంతో గ్రామీణ ప్రాంతాల్లో విష జ్వరాలు ప్రబలి చిన్నారులు ఆస్పత్రుల పాలవుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు.

కూచిపూడి నాట్య పతాక స్వర్ణోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

డిసెంబర్ 27, 28, 29 తేదీలలో కూచిపూడి గ్రామంలో కూచిపూడి నాట్య పతాక స్వర్ణోత్సవాలను భారీ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు కళా రత్న, విశాలపట్నం కూచిపూడి కళా కేంద్రం డైరెక్టర్ ఎబి.బాల కొండలరావు, సెంట్రల్ సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత పసుమర్తి రామలింగ శాస్త్రి తెలిపారు. శనివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో కూచిపూడి నాట్య అకాడమీ, అభినయం స్కూల్ ఫర్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ సంయుక్త ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య కళాకారుల, శిక్షకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కూచిపూడి నాట్య పతాక స్వర్ణోత్సవాల పోస్టర్, వెబ్‌సైట్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంపటి చిన సత్యం కూచిపూడి నృత్యాన్ని విశ్వవ్యాప్తం చేశారన్నారు. భారతదేశంలో పాటు అనేక దేశాలలో కూచిపూడి నృత్యం ప్రసిద్ధి చెందిందని తెలిపారు. కూచిపూడి గ్రామంలో జరిగే పతాక స్వర్ణోత్సవాల కార్యక్రమానికి పలు దేశాల నుంచి ప్రతినిధులు, గొప్ప గొప్ప నాట్య విద్వాంసులు రానున్నారని చెప్పారు. సమావేశంలో వేదాంతం వెంకట నాగ చలపతిరావు, డాక్టర్ పసుమర్తి వెంకటరమణ పాల్గొన్నారు.

కారాగారాల్లో సంస్కరణల అమలుకు కమిటీలు

- జైళ్ల శాఖ ఐజి డాక్టర్ ఇంద్ర శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఆరిలోవ (విశాఖ)

దేశంలో కారాగారాల ఆధునీకరణ, పటిష్ట సంస్కరణలు అమలు, అభివృద్ధి, జైలు ఉద్యోగులకు పటిష్టమైన శిక్షణ తదితర వాటి కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ప్రత్యేక కమిటీలను నియమించిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జైళ్ల శాఖ ఐజి డాక్టర్ ఇంద్ర శ్రీనివాసరావు తెలిపారు. విశాఖ కేంద్ర కారాగారాన్ని సందర్శించిన ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. జాతీయ స్థాయిలో జైళ్ల ఆధునీకరణ, సంస్కరణల అమలు కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బిపిఆర్‌డి) ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రెండు జాతీయ కమిటీలకు తనను చైర్మన్‌గా నియమించిందని చెప్పారు. ఈ కమిటీలు దేశవ్యాప్తంగా ఉన్న జైళ్లను పరిశీలించి వాటికి అనుకూలమైన వ్యవహారాలకు సంబంధించిన నివేదికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ప్రస్తుతం సుమారు నెల రోజులుగా ఈ కమిటీలు పనిచేస్తున్నట్టు తెలిపారు. ఈ కమిటీల ద్వారా దేశంలో ఎక్కడైనా కొత్తగా జైలు ఏర్పాటు చేయాలంటే ఎలాంటి స్థలంలో జైలును నిర్మించాలి, జైలు నిర్మాణానికి అనుకూలమైన వాతావరణం ఉంది, వాతావరణానికి తగ్గట్టు ఎలాంటి సౌకర్యాలు, మౌలిక వసతులు ఉండాలి, గ్రీనరీ ఏవిధంగా ఉండాలి, ఎలాంటి రక్షణ గోడలు ఉండాలి, జైలుకు వేసే రంగులు తదితర వాటి గురించి 50 సంవత్సరాల జీవిత కాలం ప్రామాణికంగా చేసుకొని నివేదిక సిద్ధం చేసి కేంద్రక హోం శాఖకు నివేదిక సమర్పించాల్సి ఉంటుందన్నారు.

తాళ్లరేవులో పెనుగాలి బీభత్సం

ప్రజాశక్తి - తాళ్లరేవు (కాకినాడ జిల్లా)



కాకినాడ జిల్లా తాళ్లరేవులో శనివారం తెల్లవారు జామున ఆకస్మాత్తుగా వచ్చిన పెనుగాలి, కుండపోత వర్షం బీభత్సం సృష్టించడంతో పలుచోట్ల స్తంభాలు విరిగి విరిగిపడ్డాయి. చెట్లు నేలకొరిగి ప్రయాణికుల రాకపోకలకు ఆటంకం కలిగింది. స్థానిక పంచాయతీ గుత్తులవారిపాలెంలో రెండు విద్యుత్ స్తంభాలు పూర్తిగా విరిగి పడడంతో విద్యుత్ తీగలు తెగిపోయాయి. అదే ప్రాంతంలో రోడ్డుకు రెండో వైపు ఉన్న 24 గంటల హైవోల్టేజ్ విద్యుత్తు లైనుకు సంబంధించిన మరో రెండు స్తంభాలు నేలకొరిగాయి. దీంతో, ఆ ప్రాంతంలో పూర్తిగా విద్యుత్ స్తంభించింది. స్థానిక రైతులు చెట్లను యంత్రాల సహాయంతో తొలగించి విద్యుత్ శాఖ అధికారులకు తెలిపారు. రంగనాయకపురంలో విద్యుత్ స్తంభం నేలకొరిగి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

సాగని వేట.. అందని పరిహారం..

- ఆర్థిక ఇబ్బందుల్లో మత్స్యకారులు



ప్రజాశక్తి- భీమునిపట్నం (విశాఖ జిల్లా)

ఏటా వేట విరామ సమయంలో ప్రభుత్వం అందజేసే పరిహారం (భృతి) నేటికీ మత్స్యకారులకు అందలేదు. మత్స్యకార భరోసా పథకం కింద ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. ఏటా ఏప్రిల్ 14 అర్ధరాత్రి నుంచి జూన్ 14 అర్ధరాత్రి వరకు వేట నిషేధకాలంగా పరిగణిస్తారు. చేపలు గుడ్లు పెట్టే కాలంలో వేట సాగిస్తే పునరుత్పత్తి దెబ్బ తింటుంది గనుక ఆ సమయంలో వేట నిషేధం అమలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పర్యావరణపరంగానూ ఈ నిర్ణయం సరైందే. అయితే ఆ సమయంలో చేపల వేటపైనా, అనుబంధ రంగాలపైనా ఆధారపడే మత్స్యకారుల ఉపాధి పూర్తిగా దెబ్బతింటోంది.

మోటారైజ్డ్ బోటుపై ఆరుగురు, మెకనైజ్డ్ బోటుపై 8 మంది, తెర చాపపై ముగ్గురు చొప్పున వేటకు వెళ్తారు. మండలంలో మోటారు బోట్లు 289, తెప్పలు 191 ఉన్నాయి. మండలంలో అటు అన్నవరం మొదలు కొని ఇటు జివిఎంసి నాలుగో వార్డు మంగమారిపేట వరకు సుమారు 18 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది.

సవాలక్ష నిబంధనలు..

పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం సవాలక్ష నిబంధనలు పెట్టింది. ఇందులో భాగంగా లబ్ధిదారులను గుర్తించి ఎంపిక చేసేందుకు మత్స్యశాఖ అధికారులు ఇటీవల చేపట్టిన ఎన్యూమరేషన్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. అయితే గతేడాది 2087 మందిని లబ్ధిదారులుగా గుర్తించిన ఆ శాఖ అధికారులు ఇప్పుడేమో 2,307 మందిని గుర్తించారు. పింఛను పొంది ఉంటే పరిహారం ఇవ్వరు.

ఆర్థికంగా ఇబ్బందులు

ఓ వైపు వేట లేదు. మరో వైపు ఉపాధి లేదు. పరిహారం ఇంకా అందలేదు. దీంతో ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం.

-కాసరపు భీమరాజు, మత్స్యకారుడు, బోయివీధి, భీమిలి

పరిహారం త్వరగా ఇవ్వాలి

ఇచ్చే పరిహారం త్వరగా ఇస్తే ఉపయోగం. ముందుగా ఇస్తే ఉపాధితో పాటు వేట సామాగ్రికి అవసరమయ్యే పని ముట్లు, సామగ్రి కొనుక్కునే వీలుంటుంది.

-కాసరపు సత్తిరాజు; మత్స్యకారుడు, భీమిలి

కేరళ అంతటా రుతుపవనాల విస్తరణ

- పలు జిల్లాలకు రెడ్ అలర్ట్

తిరువనంతపురం: కేరళ తీరాన్ని నైరుతి రుతుపవనాలు తాకిన రెండ్రోజులకు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాయి. దీంతో పలు జిల్లాల్లో భారీగా వర్షాలు పడుతున్నాయి. దక్షిణ కేరళలో కొండచరియలు విరిగిపడటం, చెట్లు కూలడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. గంటల తరబడి కురుస్తున్న వర్షాలకు కొట్టాయం, ఇడుక్కి జిల్లాల్లోని హై-రేంజ్ ప్రాంతాల్లో వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. త్రిసూర్ జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో కేరళలోని పలు జిల్లాలకు భారత వాతావరణ శాఖ (ఐఎండి) సెంట్రల్ జిల్లా త్రిసూర్, ఉత్తర జిల్లాలైన మలప్పురం, కోజికోడ్‌లకు శనివారం రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఇడుక్కి, పాలక్కాడ్, వాయనాడ్‌లకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించగా, ఆరు జిల్లాల్లో ఎల్లో అలర్ట్ జారీ చేశారు. రానున్న 24 గంటల్లో రెడ్ అలర్ట్ జారీ చేసిన ప్రాంతాల్లో 20 సెం.మీ కంటే భారీ వర్షపాతం నమోదవుతుందని అధికారులు తెలిపారు. ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన ప్రాంతాల్లో 11 సెం.మీ నుండి 20 సెం.మీ వరకు వర్షం కురుస్తుందని.. ఎల్లో అలర్ట్ జారీ చేసిన ఏరియాల్లో 6 సెం.మీ నుంచి11 సెం.మీ వర్షపాతం నమోదవుతుందని చెప్పారు.

చిన్నారుల టాయ్స్, లంచ్ బాక్సుల్లో డ్రగ్స్





అహ్మదాబాద్ : గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. విదేశాల నుంచి వచ్చిన వారి నుంచి సుమారు రూ.కోటికిపైగా విలువైన డ్రగ్స్‌ను కస్టమ్స్ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. అహ్మదాబాద్ క్రైమ్ బ్రాంచ్‌తోపాటు కస్టమ్స్, ఎక్సైజ్ శాఖ అధికారులు సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో చిన్నారుల ఆట బొమ్మలు, చాక్లెట్లు, లంచ్ బాక్స్‌లలో దాచి అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.1.15 కోట్ల విలువైన డ్రగ్స్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

పరువు నష్టం కేసులో సిద్ధరామయ్య, డికె శివకుమార్‌లకు బెయిల్

బెంగళూరు : పరువు నష్టం కేసులో కర్ణాటక సిఎం సిద్ధరామయ్యకు, డిప్యూటీ సిఎం శివకుమార్‌లకు ఊరట లభించింది. బిజెపి ప్రధాన కార్యదర్శి కేశవ ప్రసాద్ దాఖలు చేసిన పరువు నష్టం కేసులో కోర్టు వీరిద్దరికీ శనివారం బెయిల్ మంజూరు చేసింది. గత బిజెపి ప్రభుత్వం అన్ని పనుల్లో 40 శాతం కమిషన్ వసూలు చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం పేపర్‌లలో ప్రకటనలు ఇచ్చింది. వివిధ పనుల కోసం బిజెపి సర్కార్ అవినీతి రేటు కార్డులు నిర్ణయించిందని ఆరోపిస్తూ పోస్టర్లను కూడా ముద్రించింది. సిద్ధరామయ్య, శివకుమార్‌తోపాటు రాహుల్‌గాంధీలపై.. బిజెపి ఎమ్మెల్సీ, ప్రధాన కార్యదర్శి కేశవ్ ప్రసాద్ కోర్టులో పరువు నష్టం దావా వేశారు. ఈ కేసు విచారణ సందర్భంగా సిద్ధరామయ్య, శివకుమార్ 42వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట వ్యక్తిగతంగా హాజరయ్యారు. కోర్టు వీరిద్దరికీ బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది.

ఆక్సిజన్.. అంబులెన్స్ లేక ఆగిన ఊపిరి

- సమయానికి చికిత్స అందక నవజాత శిశువు మృతి
- ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘటన

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

సమయానికి ఆక్సిజన్.. అంబులెన్స్ ఉండి ఉంటే ఆ పసిగుడ్డు ప్రాణం నిలిచేది.. కానీ పిహెచ్‌సిలో కనీసం ఆక్సిజన్ కూడా లేకపోవడం.. అంబులెన్సూ లేక ఆటోలో మరో ఆస్పత్రికి వెళ్లేసరికే జరగాల్సిన తీవ్ర నష్టం జరిగింది. నవజాత శిశువు ప్రాణం కోల్పోయింది. ఇది ఆ తల్లిదండ్రులకు తీవ్ర వేధనకు గురిచేసింది. ఈ ఘటన హైదరాబాద్‌లోని ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం జరిగింది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ చిల్కానగర్ ప్రాంతానికి చెందిన మమతకు పురిటి నొప్పులు రావడంతో శనివారం తెల్లవారుజామున ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. నాలుగు గంటల సమయంలో ఆమెకు ప్రసవం జరిగి ఆడబిడ్డ పుట్టింది. అయితే, అరగంట తర్వాత పసికందు ఏడవడంలేదని, వేరే ఆస్పత్రికి తీసుకెళ్లాలని స్టాఫ్‌నర్స్ కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అయితే పిహెచ్‌సిలో ప్రస్తుతం అంబులెన్స్, ఆక్సిజన్ లేదని చెప్పారు. దాంతో కుటుంబసభ్యులు పసికందును ఆటోలో నీలోఫర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే బిడ్డ చనిపోయిందని తెలిపారు. మిమ్మల్ని ఇలా ఎవరు పంపారు..? ఆక్సిజన్ పెట్టుకొని అంబులెన్స్‌లో తీసుకురావాలని తెలియదా అని డాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కుటుంబసభ్యులు పసికందు మృతదేహంతో ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి కొద్దిసేపు ఆందోళన చేశారు.

జలదిగ్బంధంలో మణిపూర్

- ఐదుగురు మృతి

మణిపూర్ : మణిపూర్‌లో రెమాల్ తుపాను బీభత్సం సృష్టించింది. భారీ వర్షాలు, వరదల కారణంగా ఐదుగురు మరణించారు. మరో 13మంది గాయపడ్డారు. లక్షలాది మందిపై వరదల ప్రభావం పడింది. ఇంఫాల్ నగరం నుంచి ప్రవహించే చాలా నదుల్లో నీటి మట్టాలు వేగంగా పెరుగుతున్నాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పాఠశాలలు, కళాశాలలకు రెండు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు అధికారులు తెలిపారు. స్థానిక మీడియా కథనం మేరకు ... వరద బీభత్సానికి మే 28 నుంచి మే 31 వరకు వరుసగా మరణించారు. సహాయ, విపత్తు నిర్వహణ శాఖ విడుదల చేసిన తాజా సమాచారం ప్రకారం ... రాష్ట్రంలో 255 గ్రామాలు జలదిగ్బంధమయ్యాయి. 16,364 ఇళ్లు దెబ్బతిన్నాయి. వరదల్లో చిక్కుకున్న 20,504 మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 522 హెక్టార్ల పంట ప్రాంతాలు నష్టపోయాయి. కొండ జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో గత మూడు రోజుల్లో 292 కొండచరియలు విరిగిపడ్డాయి. బాధితుల కోసం 51 సహాయక శిబిరాలను ప్రారంభించినట్లు అధికారిక నివేదిక తెలిపింది. ఇంఫాల్ గుండా ప్రవహించే చాలా నదులలో నీటి మట్టాలు వేగంగా పెరిగాయి. రెండు ప్రధాన నదులు ఇప్పటికే ఇంఫాల్ తూర్పు, పశ్చిమ జిల్లాల్లోని అనేక ప్రాంతాలకు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వినీత్ జోషితో కలిసి ముఖ్యమంత్రి ఎన్ బీరెన్ సింగ్ ఇంఫాల్‌లోని వరద ప్రభావిత పానా బజార్‌ను సందర్శించారు.

ఏడో దశ 59.45 శాతం పోలింగ్

• ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు • బెంగాల్‌లో చెలరేగిన హింస, పలుచోట్ల ఆందోళనలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల ఏడో (చివరి) విడత పోలింగ్ జరిగింది. శనివారం ఉదయం 7 గంటల నుండి రాత్రి 8.45 గంటల వరకూ 59.45 శాతం పోలింగ్ నమోదైంది. శనివారం దేశవ్యాప్తంగా ఎనిమిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 57 లోక్‌సభ నియోజకవర్గాలకు పోలింగ్ జరిగింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ పోటీ చేసే వారణాసికి కూడా తాజా విడతలో పోలింగ్ జరిగింది. ఒరిస్సాలో 42 అసెంబ్లీ స్థానాలకు కూడా పోలింగ్ జరిగింది. కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన వివరాల ప్రకారం, సాయంత్రం రాత్రి 8.45 గంటల వరకూ వరకు పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా 69.89 శాతం పోలింగ్ నమోదుకాగా, అత్యల్పంగా బీహార్‌లో 50.79 శాతం నమోదైంది. హిమాచల్‌ప్రదేశ్‌లో 67.53 శాతం, జార్ఖండ్‌లో 69.59 శాతం, ఒరిస్సాలో 63.57 శాతం, పంజాబ్‌లో 55.86 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 55.60 శాతం పోలింగ్ నమోదైంది. కేంద్ర పాలిత ప్రాంతం చండీగఢ్‌లో 62.80 శాతం పోలింగ్ నమోదైంది.

ఏడో దశ 2019 కంటే ఇప్పుడు ఓటింగ్ శాతం తగ్గింది. 2019లో 65.3 శాతం నమోదు కాగా, ఇప్పుడు 59.45 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో మొదటి దశ 66.14 శాతం, రెండో దశ 66.71 శాతం, మూడో దశ 66.68 శాతం, నాలుగో దశ 69.16 శాతం, ఐదో దశ 62.2 శాతం, ఆరో దశ 63.36 శాతం పోలింగ్ జరిగింది.



హిమాచల్‌ప్రదేశ్ సిర్మూర్‌లో పోలింగ్ బూత్ వద్ద వేచియున్న ఓటర్లు

బెంగాల్‌లో ఘర్షణలు

పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖలీలో ఎన్నికల అవకతవకల ఆరోపణలపై టిఎంసి, బిజెపి మద్దతుదారుల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. 'టిఎంసి గూండాలు' ఓటర్లను ఓట్లు వేయకుండా అడ్డుకున్నారని బిజెపి అభ్యర్థి రేఖా పాత్ర ఆరోపించారు. టిఎంసి కూడా 'బిజెపి గూండాలు' ఎన్నికల వాతావరణాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది. ఇరు పక్షాలు పరస్పరం ఆరోపణలు చేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. బసంతి ఎక్స్‌ప్రెస్ హైవేపై ఇరు పక్షాలు ఘర్షణకు దిగడంతో, గుంపును చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జి, బాష్పవాయువు ప్రయోగించారు. బసిర్‌హట్ ఎస్పీ హొస్సేన్ మెహెదీ రహమాన్ మాట్లాడుతూ, సందేశ్‌ఖలీలోని బయ్‌మరీ వద్ద టిఎంసి, బిజెపి మద్దతుదారుల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురు గాయపడ్డారని, దీనికి సంబంధించి ఒకరిని అరెస్టు చేసిందని తెలిపారు. జాదవ్‌పూర్, డైమండ్ హార్బర్ నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాల్లో కూడా టిఎంసి, బిజెపి కార్యకర్తలు ఘర్షణకు దిగారు. జాదవ్‌పూర్‌లో టిఎంసి, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ (ఐఎస్‌ఎఫ్), బిజెపి మద్దతుదారుల మధ్య ఘర్షణలు చెలరేగాయి. పార్టీలు తమ పోలింగ్ ఏజెంట్లను బూత్‌లలోకి రాకుండా ఆపారని ఆరోపించాయి. జాదవ్‌పూర్ నియోజకవర్గం పరిధిలోని భాంగర్‌లో టిఎంసి, ఐఎస్‌ఎఫ్ మద్దతుదారుల మధ్య ఘర్షణ చెలరేగింది. రెండు వైపుల నుండి బాంబులు విసిరినట్లు ఆరోపణలు వచ్చాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు భద్రతా సిబ్బంది లాఠీచార్జి చేసి పలు బాంబులను స్వాధీనం చేసుకున్నారు.

జాదవ్‌పూర్, డమ్ డమ్, డైమండ్ హార్బర్ నియోజకవర్గాల్లో సిపిఎం ఏజెంట్లను అనుమతించకపోవడంతో జాదవ్‌పూర్ సిపిఎం అభ్యర్థి శ్రీజన్ భట్టాచార్య, డమ్ డమ్ అభ్యర్థి సుజన్ చక్రవర్తి ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. వారే దగ్గరుండి సిపిఎం ఏజెంట్లను పోలింగ్ బూత్‌ల్లోకి తీసుకెళ్లారు. కలకత్తా సౌత్‌లో సిపిఎం మహిళా ఏజెంట్‌ను వేధింపులకు గురిచేశారు. దీంతో సిపిఎం అభ్యర్థి సైరా షా హలీం అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు.

ఓటు హక్కు ఉపయోగించుకున్న ప్రముఖులు

ఏడో దశ పోలింగ్ లో హిమాచల్‌ప్రదేశ్‌లో బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆర్‌జెడి చీఫ్ లాల్లూ ప్రసాద్ యాదవ్, ఆయన భార్య రబ్రీ దేవి ఓటు వేశారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ తన సతీమణితో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ హిమాచల్ ప్రదేశ్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి జితన్ రామ్ మాంఝీ, ఆర్‌జెడి నేత, బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ తన కుటుంబంతో కలిసి ఓటు వేశారు. పంజాబ్‌లో ఆప్ ఎంపి రాఘవ్ చద్దా, పశ్చిమ బెంగాల్‌లో బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి, హిమాచల్ ప్రదేశ్‌లో నటి కంగనా రనౌత్, బిజెపి ఎంపి కిరణ్ ఖేర్, పంజాబ్‌లో నటి గుల్ పనాగ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.



పరారీలో ప్రజ్వల్ రేవణ్ణ తల్లి


బెంగళూరు : అశ్లీల వీడియోల కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న ప్రజ్వల్ రేవణ్ణ తల్లి భవానీ రేవణ్ణ పరారీలో ఉన్నారు. ఇంటి వద్ద ఉండాలని నోటీసులు జారీ చేసినా ఆమె ఇంట్లో లేరని పోలీసులు తెలిపారు. లైంగిక దాడి, కిడ్నాపింగ్ కేసుల్లో ఆమె భర్త హెచ్‌డి రేవణ్ణ కూడా నిందితుడే. మాజీ ప్రధాని, జెడిఎస్ అధినేత హెచ్‌డి దేవెగౌడ కోడలు భవానీ రేవణ్ణ. ఇదే కేసులో తనకు అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ భవాని దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం స్థానిక కోర్టు తిరస్కరించిన సంగతి తెలిసిందే. ఇంటి పని సహాయకురాలి కిడ్నాపింగ్ కేసులో భవాని పాత్రను పరిశీలించాల్సి ఉంటుందని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (ఎస్‌ఐటి) పేర్కొంది. శనివారం ఉదయం 10 గంటలకు వ్యక్తిగతంగా విచారిస్తామని, అందుబాట్లో ఉండాలని నోటీసు పంపామని, సిట్ అధికారులు ఇంటికి వెళ్లినప్పుడు భవాని ఆచూకీ లేదని, ఆమె మొబైల్ ఫోన్ స్విచ్చాఫ్ రావడంతో సాయంత్రం 5 గంటల వరకూ ఇంటివద్దే ఉన్నా రాలేదని వివరించింది.

యెమెన్‌పై అమెరికా, బ్రిటన్ వైమానిక దాడులు

సనా: అమెరికా, బ్రిటన్ కలిసి యెమెన్‌పై మరోసారి పెద్దయెత్తున వైమానిక దాడులకు తెగబడ్డాయి. యెమెన్‌పై ఈ రెండు సామ్రాజ్యవాద దేశాలు యెమెన్‌పై దాడికి తెగబడడం గత అయిదు మాసాల్లో ఇది అయిదవసారి. తాజాగా శుక్రవారం జరిపిన దాడుల్లో 16 మంది చనిపోయారు, మరో 40 మంది దాకా గాయపడ్డారు. ఈ దాడుల్లో చనిపోయినవారంతా సాధారణ పౌరులేనని హౌతీ గ్రూపు తెలిపింది. పిచ్చుకపై బ్రహ్మాస్త్రం సంధించినట్లుగా ప్రపంచంలో అతి పేద దేశమైన యెమెన్‌పై బైడెన్, సునాక్‌లు బాంబులతో విరుచుకుపడుతున్నారని 'స్టాప్ వార్ కొయిలేషన్ ' కో కన్వీనర్ లిండ్సే జర్మన్ వ్యాఖ్యానించారు. గాజాలో ఊచకోత సాగిస్తున్న ఇజ్రాయిల్‌కు ఎదురులేకుండా చూడడమే వీటి ఉద్దేశమని ఆయన అన్నారు. యెమెన్‌లోని హుదాయ్‌దా సమీపంలోని రెండు ప్రాంతాలపై దాడులు జరిగాయి.. ఎర్ర సముద్రంలో నౌకలను అడ్డుకుంటున్నందుకు ప్రతీకారంగా ఈ దాడులు చేస్తున్నట్టు సునాక్ చెప్పారు. గాజాలో గత ఎనిమిది మాసాల్లో 36వేల మంది అమాయక పౌరులను చంపేసిన ఇజ్రాయిల్‌కు అతి పెద్ద మద్దతుదారులుగా అమెరికా, బ్రిటన్ ఉన్నాయన్న సంగతి అందరికీ ఎరుకే. అందుకే ఎర్ర సముద్రంలో పశ్చిమ దేశాల నౌకలను లక్ష్యంగా చేసుకున్నట్లు హౌతీ తిరుగుబాటుదారులు చెబుతున్నారు.

ఓటింగ్ బలం తగ్గడంతో మెజారిటీని కోల్పోయిన ఎఎన్‌సి

జోహానెస్‌బర్గ్ : దక్షిణాఫ్రికాలో బుధవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఎఎన్‌సి) తన మెజారిటీని కోల్పోయింది. శనివారానికి 99శాతానికి పైగా ఓట్ల లెక్కింపు పూర్తయిన నేపథ్యంలో ఎఎన్‌సికి 41 శాతం ఓట్లు లభించాయి. దీంతో రాబోయే ఐదేళ్ల కాలానికి ఎఎన్‌సి తన పట్టును నిలబెట్టుకోనుంది. ఆదివారం అధికారికంగా తుది ఎన్నికల ఫలితాలు ప్రకటిస్తారు. దామాషా పద్ధతిలో జరిగిన ఈ ఎన్నికల్లో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వచ్చినదీ నిర్దిష్టంగా గురువారం వెల్లడిస్తారు. అయితే 2019లో ఎఎన్‌సికి 52 శాతం ఓట్లు రాగా, ఈసారి అది 41 శాతానికి తగ్గింది. ఆ మేరకు ప్రత్యర్థులు లాభపడ్డారు. ప్రధాన ప్రతిపక్షమైన డెమోక్రటిక్ అలయెన్స్ (డిఎ) 2019లో సాధించిన 17.05శాతానికి మరో 4.26శాతం ఓట్లు కలుపుకుని మొత్తంగా 21.31శాతం ఓట్లు వచ్చాయి. మరో ప్రతిపక్షమైన ఇఎఫ్‌ఎఫ్‌కు గత ఎన్నికల్లో 11.06శాతం ఓట్లు రాగా, ఈసారి ఆ వాటా 13.09శాతానికి పెరిగింది. ఫ్రీడమ్ ఫ్రంట్ ప్లస్ పార్టీకి 3.71శాతం నుండి 2.49శాతానికి ఓట్లు తగ్గాయి. ఈ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని మరో పార్టీ ఎసిటి (ఆఫ్రికన్ కాంగ్రెస్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేషన్) నేత విమర్శించారు. ఆ పార్టీకి కేవలం 1.39శాతం ఓట్లే వచ్చాయి. పోలింగ్‌లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ వెస్ట్రన్ కేప్‌లోని ప్రతిపక్ష పార్టీలు రీకౌంటింగ్‌కు డిమాండ్ చేశాయి.



కేజ్రీవాల్ తాత్కాలిక బెయిల్ పిటిషన్‌పై 5వరకు తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ : మనీ లాండరింగ్ కేసులో తాత్కాలిక బెయిల్ కోరుతూ ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ పెట్టుకున్న పిటిషన్‌పై తన తీర్పును 5వ తేదీ వరకు ఢిల్లీ కోర్టు రిజర్వ్ చేసుకుంది. ఆరోగ్య కారణాల రీత్యా తాత్కాలిక బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఈ పిటిషన్ దాఖలు చేశారని, అంతేకానీ సుప్రీంకోర్టు ఇచ్చిన తాత్కాలిక బెయిల్ పొడిగింపు కోసం కాదని ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బజ్వా పేర్కొంటూ తన తీర్పును రిజర్వ్ చేసుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేసుకునేందుకు వీలుగా 21రోజుల పాటు తాత్కాలిక బెయిల్‌ను ఇస్తూ గత నెల 10న సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. తిరిగి జూన్ 2న లొంగిపోవాల్సిందిగా కోరింది. ఆదివారం ఆయన లొంగిపోవాల్సి వున్నందున శనివారమే ఆదేశాలు ఇవ్వాల్సిందిగా కేజ్రీవాల్ తరపు న్యాయవాది కోర్టుకు విజ్ఞప్తి చేశారు. న్యాయమూర్తి ఆ అభ్యర్థనను తోసిపుచ్చారు. ఇరుపక్షాల వాదనలు, అందజేసిన పత్రాలు చాలా వున్నాయంటూ న్యాయమూర్తి శనివారం తీర్పు ఇచ్చేందుకు తిరస్కరించారు. కేజ్రీవాల్‌కు అస్వస్థతగా వుందని, ఆయనకు చికిత్స అవసరమని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు చెప్పారు. ఇడి తరపు వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఆ వాదనను కొట్టిపారేశారు.

గాజాపై మూడంచెల ప్రణాళిక

- హమాస్ సానుకూల స్పందన
- అడ్డం తిరిగిన నెతన్యాహు

గాజా : గత ఎనిమిది మాసాలుగా గాజాపై కొనసాగుతున్న దాడిని శాశ్వతంగా విరమించాలని, హమాస్ అదుపులో వున్న బందీలను ఖైదీలతో పరస్పర మార్పిడి చేసుకోవాలని, అంతిమంగా గాజా నుండి ఇజ్రాయిల్ పూర్తిగా వైదొలగాలని, తదనంతరం గాజాను పునర్నిర్మించాలన్న అమెరికా అధ్యక్షుడు బైడెన్ చేసిన ఈ ప్రతిపాదన పట్ల హమాస్ సానుకూలంగా స్పందించినా, ఇజ్రాయిల్ తిరస్కరించింది. తాజాగా ప్రతిపాదించిన ఈ మూడంచెల ప్రణాళిక శాశ్వత శాంతికి, బందీల విడుదలకు రోడ్‌మ్యాప్ వంటిదని బైడెన్ వ్యాఖ్యానించారు. గాజా కాల్పుల విరమణ కోసం బైడెన్ చేసిన ప్రతిపాదనను ఆమోదించాల్సిందిగా ఇజ్రాయిల్ ప్రతిపక్ష నేత యార్ లపిడ్ కోరారు. ఈ విషయంలో ప్రభుత్వానికి తమ పార్టీ మద్దతునిస్తుందన్నారు. ఇజ్రాయిల్ ప్రభుత్వం ఇక ఎంత మాత్రమూ ఈ విషయాన్ని నిర్లక్ష్యం చేయరాదన్నారు. మరోవైపు రఫా క్రాసింగ్‌ను తిరిగి తెరిపించే విషయమై చర్చించేందుకు అమెరికా, ఈజిప్ట్, ఇజ్రాయిల్ అధికారులు ఆదివారం కైరోలో సమావేశం కానున్నారు.

బైడెన్ ప్రతిపాదనపై ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు అడ్డం తిరిగితే అమెరికా నుంచి ఎలాంటి స్పందన లేదు. పైగా నెతన్యాహును అమెరికన్ కాంగ్రెస్‌లో ఉభయసభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడేందుకు రావాల్సిందిగా కాంగ్రెస్ దిగువసభ స్పీకర్ మైక్ జాన్సన్ ఆహ్వానించారు. ఇజ్రాయిల్‌కు అమెరికా మద్దతును పునరుద్ఘాటించడమే ఈ ఆహ్వానం ఉద్దేశమని జాన్సన్ చెప్పారు. భద్రతా మండలిలో స్వతంత్ర పాలస్తీనాను పూర్తి సభ్యదేశంగా గుర్తించాలన్న తీర్మానాన్ని అమెరికా వీటో చేసింది. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న దాష్టీకాలను ఖండిస్తూ ఐరాసలో తీర్మానం వచ్చిన ప్రతిసారి అమెరికా దానిని అడ్డుకుంటూ వస్తోంది. ఇజ్రాయిల్‌కు ఆయుధాలు, డబ్బు అందించడాన్ని యూనివర్సిటీ విద్యార్థులు నిరసిస్తూ దేశవ్యాపితంగా క్యాంపస్‌లలో గుడారాలు వేసుకుని నిరసన తెలిపితే ఆ ఉద్యమంపై ఉక్కుపాదం మోపింది.

ఇదిలావుండగా, గత 24 గంటల్లో ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో 95 మంది పాలస్తీనియన్లు మరణించారని, మరో 350మంది గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో నబ్లస్‌కు తూర్పున గల బలాటా శరణార్థ శిబిరంపై జరిగిన మిలటరీ దాడిలో ముగ్గురు పాలస్తీనియన్లు మరణించారు.


బ్రూక్లిన్ మ్యూజియంను ముట్టడించిన నిరసనకారులు

పాలస్తీనాకు సంఘీభావంగా బ్రూక్లిన్ మ్యూజియం ముట్టడి

గాజాకు సంఘీభావంగా గత కొన్ని నెలలుగా అమెరికాలో ఉద్యమిస్తున్న నిరసనకారులు శుక్రవారం న్యూయార్క్‌లోని బ్రూక్లిన్ మ్యూజియాన్ని ముట్టడించారు. పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ సాగిస్తున్న ఊచకోతను ఆపాలని, కాల్పుల విరమణ తక్షణమే పాటించాలని వారు నినదించారు. ప్రదర్శనగా మ్యూజియం బిల్డింగ్ లోపలికి వెళ్లి పెద్ద పెద్ద బ్యానర్లను ప్రదర్శిస్తూ, బిగ్గరగా నినదించారు. ఇజ్రాయిల్ సైన్యం బారి నుండి దక్షిణ గాజాలో పిల్లలను కాపాడాలని వారు కోరారు.

విదేశాల్లోనే సగం భారత బంగారం



- అక్కడే ఆర్‌బిఐ ఎందుకు నిల్వ చేస్తోంది..!
- దేశంలో 4 లక్షల కిలోల బంగారం
- ఈ ఏడాది భారీగా కొనుగోళ్లు

న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన దాదాపు సగం బంగారం విదేశాల్లోనే ఉంది. ఇటీవల ఒక మెట్రిక్ టన్ను (లక్ష కిలోల) పసిడిని ఇంగ్లాండ్ నుంచి భారత్‌కు తరలించడంతో దీనిపై అనేక మందిలో ఆసక్తి పెరిగింది. ఇంత భారీ మొత్తంలో విదేశాల్లో ఎలా పెడుతోందని ఆశ్చర్యం కలుగుతోంది. 2023 ఏడాదిలో అంతర్జాతీయ మార్కెట్‌లో కొనుగోలు చేసిన మొత్తం బంగారం కంటే ఈ ఏడాది కేవలం నాలుగు నెలల్లోనే ఒకటిన్నర రెట్ల కొనుగోళ్లు పెంచడం విశేషం. ప్రపంచ భౌగోళిక అంశాల్లో నెలకొన్న అనిశ్చిత్తుల నేపథ్యంలో పసిడి కొనుగోళ్లు పెరిగాయని ఇటి ఓ రిపోర్ట్‌లో విశ్లేషించింది. పలు దేశాల్లో ప్రస్తుత యుద్ధ ఆందోళనల నేపథ్యంలో బంగారాన్ని తిరిగి భారత్‌కు తరలించడంపై ఆర్‌బిఐ దృష్టి సారించిందని సమాచారం.

విదేశాల్లో ఎంతుంది..?

2024 మార్చి చివరి నాటికి ఆర్‌బిఐ మొత్తం 822.10 మెట్రిక్ టన్నుల (8,22,100 కిలోలు) బంగారాన్ని కలిగి ఉంది. ఇందులో 408.31 మెట్రిక్ టన్నులు (4,08,3100) దేశీయంగానే ఉంది. మిగతా 387.26 మెట్రిక్ టన్నుల (3,87,2600 కిలోలు) బంగారాన్ని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్ (బిఐఎస్) వద్ద ఉంచింది. మరో 26.53 మెట్రిక్ టన్నుల (26,530 కిలోలు) బంగారం డిపాజిట్ల రూపంలో ఉన్నాయి.

విదేశాల్లోనే ఎందుకు..?

1990-91లో భారత్ వద్ద కేవలం 15 రోజుల దిగుమతులకు సరిపడా విదేశీ మారక ద్రవ్య నిల్వలను కలిగి ఉన్నప్పుడు.. మే 1991లో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌కు ఆర్‌బిఐ తన బంగారం నిల్వల్లో కొంత భాగాన్ని తాకట్టు పెట్టింది. ఇందుకోసం 46.91 టన్నుల బంగారాన్ని ఇంగ్లండ్‌కు రవాణా చేసింది. దీంతో 405 మిలియన్ డాలర్ల (అప్పట్లో దాదాపు రూ.41 కోట్ల) రుణాన్ని సేకరించింది. 1991లో డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ.23గా ఉంది. అప్పట్లో బ్యాంక్ ఆఫ్ జపాన్‌లోనూ కొంత తనఖా పెట్టింది.

నవంబర్ 1991 నాటికి రుణం తిరిగి చెల్లించబడినప్పటికీ, రవాణా, భద్రతా కారణాల నేపథ్యంలో బంగారాన్ని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ ఖజానాలో ఉంచాలని రిజర్వ్ బ్యాంక్ నిర్ణయించింది. ఫారెక్స్‌లోకి ప్రవేశించి కొంత రాబడిని సంపాదించడానికి ట్రేడింగ్‌కు ఉపయోగించవచ్చని అప్పటి ప్రభుత్వం యోచించింది. అదే విధంగా అంతర్జాతీయ మార్కెట్ నుండి ఆర్‌బిఐ బంగారాన్ని సేకరించడం ప్రారంభించింది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వద్ద ఉంచడం వల్ల సరఫరాకు సౌకర్యవంతంగా ఉంటుంది.

ప్రమాదాలు ఏమిటి?


భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల సమయంలో అంతర్జాతీయ ఆస్తుల భద్రతపై అనిశ్చితి ఉంటుంది. పశ్చిమంలో ప్రస్తుత పరిస్థితుల్లో రష్యా ఆస్తులను స్తంభింపజేయడంతో బ్రిటన్ ఆర్థిక వ్యవస్థపై సాధారణంగానే ఆందోళనలను పెంచుతుంది. ఈ నేపథ్యంలోనే భారత ప్రభుత్వానికి విదేశాల్లోని బంగారు నిల్వల భద్రతపై ఆందోళనలు నెలకొని ఉంటాయి.

ఆర్‌బిఐ ఏమి చేయగలదు?

ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి ఆర్‌బిఐ దేశీయ మార్కెట్‌లోని బంగారం డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ముఖ్యంగా గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడింగ్ ఫండ్స్ వంటి పెట్టుబడి ఉత్పత్తులలో బంగారం వినిమయాన్ని నిర్వహించడానికి వీలుంది. అదే సమయంలో బులియన్ బంగారం దేశంలోని సరిహద్దులో ఉండేలా చూసుకుంటుంది.

పసిడిని ఎందుకు కొనడం..?

ద్రవ్యోల్బణం, కరెన్సీ అస్థిరతలను ఎదుర్కోవడానికి, విదేశీ మారకపు నిల్వలను మెరుగుపర్చుకోవడం కోసం ఆర్‌బిఐ పసిడిని కొనుగోలు చేస్తుంది. డాలర్లపై విశ్వాసం తగ్గినప్పుడు బంగారాన్ని కొనుగోలు చేయడానికి సెంట్రల్ బ్యాంక్‌లు ఆసక్తి చూపుతాయి. ప్రపంచ దేశాల మధ్య అనిశ్చితి చోటు చేసుకున్నప్పుడు బంగారం ధరలు పెరుగుతాయి. అలాంటి క్లిష్ట సమయాలను ఎదుర్కోవడానికి ముందు జాగ్రత్తగా సెంట్రల్ బ్యాంక్‌లు పసిడిని అధికంగా కొనుగోలు చేస్తాయి. ఏ దేశంతో అయినా నగదులోకి మార్చుకోవడం కూడా సులభం. సంక్షోభ సమయాల్లో పసిడిని స్థిర, సెక్యూర్డ్ ఆస్తులుగా సెంట్రల్ బ్యాంక్‌లు భావిస్తాయి.



రూ. 1.26 లక్షల కోట్ల డివిడెండ్‌తో పిఎస్‌యుల రికార్డు

న్యూఢిల్లీ : నయా ఉదారవాద విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థలు కుంచించుకుపోయాయి. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. ప్రభుత్వ రంగ సంస్థల్ని కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టడం జరుగుతూనే ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థకు కోట్ల రూపాయల ఆదాయం ఆర్జించిపెడుతోన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వాలే నాశనం చేయాలని చూస్తున్నాయి. వివరాల్లోకి వెళితే... గడచిన ఏడాది కంటే ఈ ఏడాది సిపిఎస్‌యు (సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్)లు రూ.1.26 లక్షల కోట్ల డివిడెండ్‌తో రికార్డు సృష్టించాయి. గతేడాది కంటే ఈ ఏడాది సిపిఎస్‌యుల డివిడెండ్ 28.7 శాతం పెరిగింది. గతేడాది (2023) డివిడెండ్ 97,750 కోట్ల రూపాయలు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఆదాయాన్ని సమకూర్చడంలో ఈ సిపిఎస్‌యులకు 60 శాతం వాటా వుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో చెల్లించే డివిడెండ్లు ఉన్నప్పటికీ.. పిఎస్‌యుల వల్ల రూ.76,166 కోట్ల డివిడెండ్ వచ్చే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది. క్రితం ఏడాది రూ. 59,406 కోట్లు కంటే ఈ ఏడాది 28.2 శాతం పెరగొచ్చునని కేంద్ర ప్రభుత్వం అంచనా.

గడచిన ఐదేళ్ల నుంచి కేంద్ర ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే సిపిఎస్‌యుల వాటా పెరుగుతూనే ఉంది. వార్షిక వృద్ధిరేటు 19.2 శాతం. ప్రత్యేకించి ఈ కాలంలో వృద్ధిరేటు 18.9 శాతంగా ఉంది. వివిధ ప్రభుత్వ రంగ వాటాలను పరిశీలిస్తే.. ఎన్‌టిపిసి వాటా 51.1 శాతంతో చాలా తక్కువగా ఉంది. 98.25 శాతంతో పంజాబ్, సింధ్ బ్యాంకులు అత్యధిక వాటాను కలిగి ఉన్నాయి.

2024లో జాబితాలో ఉన్న సిపిఎస్‌యుల వల్ల రెండింతలు ఆదాయం రానుంది. దీంతో బడ్జెట్‌కు డబుల్ బొనాంజా అవుతుంది. దీంతో వీటి వాటా 2.11 ట్రిలియన్లు అవుతుందని ఆర్‌బిఐ తెలిపింది. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ ఏడాది డివిడెండ్, లాభాలు పబ్లిక్ సెక్టార్ నుండి 1.54 లక్షల కోట్లు వసూలయ్యే అవకాశం ఉందని ఆర్‌బిఐతో సహా పలు సంస్థలు అంచనా వేశాయి. గతేడాది 2023లో ప్రభుత్వరంగ సంస్థల నుండి డివిడెండ్‌లు, వాటి నుండి వచ్చిన లాభాలు రూ. 99,913 కోట్లుగా ఉంది. ఈ ఏడాది రూ.16,945.5 కోట్ల చెల్లింపుతో రిఫైనర్ ఇండియాన్ ఆయిల్ కంపెనీ (ఐఓసి) అతిపెద్ద డివిడెండ్ చెల్లింపుదారుగా ఉంది. గతేడాది కంటే ఈ ఏడాది ఈ కంపెనీ చెల్లింపు దాదాపు 300 శాతం పెరిగింది. దీని తర్వాత కోల్ ఇండియా (రూ.15,715 కోట్లు), ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (రూ.15,411 కోట్లు), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (రూ.10,463 కోట్లు)లు డివిడెండ్ చెల్లింపుదారుగా నిలిచాయి.

డివిడెండ్లలో ఇండియన్ ఆయిల్ కంపెనీలు

టాప్ ఈక్విటీ డివిడెండ్ల పిఎస్‌యుల జాబితా

2024 ఈక్విటీ డివిడెండ్ (కోట్లలో		శాతాల్లో..
ఇండియన్ ఆయిల్	16,945.5	300.0
కోల్ ఇండియా	15,715.0	5.2
ఓన్‌జిసి	15,410.8	8.9
ఎస్‌బిఐ	12,226.7	21.2
పవర్ గ్రిడ్	10,463.2	1.7
ఎన్‌టిపిసి	7,514.9	6.9
ఎల్‌ఐసి	6,325.0	233.3
బిపిసిఎల్	4,486.2	426.7
పిఎఫ్‌సి	4,455.1	27.4
బ్యాంక్ ఆఫ్ బరోడా	3,935.0	38.2

మొత్తం మీద వ్యాపారంలో జాబితా చేయబడిన 60 సిపిఎస్‌యులలో 42 డివిడెండ్ల ప్రామాణిక నమూనాను బిజినెస్ స్టాండర్డ్ ప్రకటించింది. 2022లో 44, 2023లో 47, ఈ ఏడాది 42కి సిపిఎస్‌యులు పడిపోయాయి.

హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్, మంగళూర్ రిఫైనరీస్ అండ్ పెట్రో కెమికల్స్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్, పెట్రోనెట్ ఎల్‌ఎన్‌జి, ఇంద్రప్రస్థ గ్యాస్, ఎస్‌బిఐ కార్డ్స్, ఎస్‌బిఐ లైఫ్ ఇన్సురెన్స్, ఐడిబిఐ బ్యాంక్ డివిడెండ్ల జాబితాలో ఉన్నాయి. వీటితోపాటు ప్రభుత్వ జోక్యం లేని ఇతర సిపిఎస్‌యులు కూడా ఉన్నాయి.

డివిడెండ్ల జాబితాలో ఉన్న 60 సిపిఎస్‌యుల లాభాలు 40.2 శాతం పెరిగి 4.69 లక్షల కోట్ల రూపాయల గరిష్ట స్థాయిని నమోదు చేశాయి. గతేడాది రూ. 3.35 లక్షల కోట్ల లాభాలు ఉన్నాయి. ఇక సిపిఎస్‌యులు 26.8 మేర పంపిణీ చేయనున్నాయి. అయితే ఈక్విటీ డివిడెండ్‌గా వాటి నికర లాభాల శాతం గతేడాది కంటే ఈ ఏడాది తగ్గింది. గతేడాది 29.2శాతంగా ఉంది.

ఇక ఈ సిపిఎస్‌యుల సంయుక్త నికర అమ్మకాలు 44.8 లక్షల కోట్లతో 2.6 శాతంగా ఉన్నాయి. పిఎస్‌యుల అమ్మకాలు గత మూడు సంవత్సరాల నుంచి వేగం మందగించింది.

ముగిసిన 45 గంటల మోడీ ధ్యానం

కన్యాకుమారి: లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగియడంతో కన్యాకుమారిలో ప్రధాని మోడీ నిర్వహించిన 45 గంటల ధాన్యం శనివారం ముగిసింది. శనివారం మధ్యాహ్నం ధ్యానం ముగిసిన తర్వాత ఆయన వివేకానంద రాక్ మెమోరియల్ పక్కనే ఉన్న తమిళ కవి తిరువల్లూరు విగ్రహానికి పూలమాల వేసి నమస్కరించారు.

4న మహారాష్ట్ర థియేటర్లలో ఎన్నికల ఫలితాలు..!

ముంబయి : ఈ నెల 4న ఎన్నికల ఫలితాల కోసం యావత్ దేశం టీవీలు, ఫోన్లకు అతుక్కుపోతుంది. మహారాష్ట్రలో 4వ తేదీన సినిమా థియేటర్లలో ఎన్నికల ఫలితాలు సందడి చేయనున్నాయి. ముంబైలో ఎస్‌ఎం 5 కళ్యాణ్, సియాన్, నాగ్‌పూర్‌లోని మూవీమ్యాక్స్ ఎటర్నిటీ, కంజూర్‌మార్గ్‌లోని మూవీమ్యాక్స్, థానేలోని ఎటర్నిటీ మాల్, వండర్ మాల్, పుణెలోని మూవీమ్యాక్స్, మీరా రోడ్ ప్రాంతంలోని మూవీమాక్స్ చైన్ ఆఫ్ థియేటర్లు ఈ నెల 4న ఎన్నికల ఫలితాలను ప్రదర్శిస్తాయి.ఇందుకోసం ఇప్పటికే ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయాలు జరిగిపోయాయి. ఉదయం 9 గంటల నుంచి ఆ థియేటర్‌లలోకి అనుమతిస్తారు. సుమారు 6గంటల పాటు థియేటర్‌లో ఎన్నికల ఫలితాలను ప్రదర్శిస్తారు. టికెట్ ధర రూ.99 నుంచి రూ.300 వరకు ఉంటుంది.

ఇండిగో విమానానికి మళ్లీ బాంబు బెదిరింపు కాల్ ..!

ముంబయి : ఇండిగో విమానానికి శనివారం ఉదయం బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. చెన్నై నుంచి 172 మంది ప్రయాణికులతో ముంబయికి వెళుతున్న 6 ఇ 5314 ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో.. అధికారులు అప్రమత్తమయ్యారు. విమానాన్ని ముంబయిలో అత్యవసరంగా ల్యాండింగ్ చేసి, ప్రయాణికులను ఖాళీ చేయించారు. ప్రోటోకాల్ ప్రకారం విమానాన్ని ఐసోలేషన్ బేకు తరలించి తనిఖీ చేస్తున్నారు. అన్ని భద్రతా తనిఖీలు పూర్తయిన తర్వాత, విమానాన్ని టెర్మినల్ ప్రాంతంలో తిరిగి ఉంచుతామని ఎయిర్‌లైన్స్ ఒక ప్రకటనలో పేర్కొంది. వారం రోజుల వ్యవధిలో ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడం రెండోసారి. మే 28న ఢిల్లీ నుంచి వారణాసికి వెళుతున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఈ విమానం ఉదయం 5 గంటలకు బయలుదేరాల్సి ఉండగా.. టేకాఫ్‌కు సిద్ధమవుతున్న సమయంలో బాత్రూమ్‌లో ఓ టిష్యూ పేపర్‌పై 'బాంబు' అని రాసి ఉండటాన్ని సిబ్బంది గుర్తించారు. వెంటనే ప్రయాణికులను అత్యవసర ద్వారం ద్వారా దించేసి.. ఎయిర్‌పోర్టు అధికారులను అప్రమత్తం చేశారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

అల్యూమినియం ఫ్యాక్టరీలో గ్యాస్ లీక్

30 మందికి తీవ్ర అస్వస్థత

ప్రజాశక్తి - ఏర్పేడు (తిరుపతి జిల్లా)

తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం రాజులపాలెం టోల్‌గేట్ పక్కన నిర్మించిన సిఎంఆర్ ఇకో అల్యూమినియం ఫ్యాక్టరీలో శనివారం గ్యాస్ లీకై 30 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిలో 25 మంది మహిళలు ఉన్నారు. ఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సిఎంఆర్ ఇకో అల్యూమినియం కర్మాగారంలో అల్యూమినియం అల్లోయ్ ప్రైమరీ మెటీరియల్ తయారవుతుంది. స్క్రాప్ మెటీరియల్‌ను కరిగించేందుకు వేస్ట్ ఆయిల్‌ను వాడతారు. ఈ ఆయిల్‌ను మండించేందుకు గ్యాస్‌ను ఉపయోగిస్తారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం స్క్రాప్ మెటీరియల్‌ను కగిరించే సమయంలో ఎక్కువ గ్యాస్ లీకేజ్ అవడంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు 30 మంది అస్వస్థతకు గురయ్యారు. చికిత్స నిమిత్తం వీరిని రేణిగుంటలోని బాలాజీ ఆస్పత్రికి తరలించి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీలో పనిచేసేవారంతా ఎక్కువమంది 'నాన్ లోకల్' కావడం గమనార్హం.

బాధితులను పరామర్శించిన ఎంపి మద్దిల గురుమూర్తి

రేణిగుంట బాలాజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఎంపి మద్దిల గురుమూర్తి పరామర్శించి ధైర్యం చెప్పారు. అత్యుత్తమ చికిత్స అందించాలని యాజమాన్యాన్ని కోరారు. అనంతరం సిఎంఆర్ కర్మాగారం ప్రతినిధులతో మాట్లాడి ప్రమాదం ఏ విధంగా జరిగిందో తెలుసుకున్నారు. ఇకపై ఇలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.

బాధితులకు న్యాయం చేయాలి : రంగయ్య, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు

రైతుసంఘం జిల్లా నాయకులు రంగయ్య, రాంబాబు, వెంకటేశ్వర్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఈ ఘటనల చోటుచేసుకుందని అన్నారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అప్పుల బాధతో చేనేత కార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-సోమందేపల్లి (అనంతపురం జిల్లా)



రఫిక్ (ఫైల్‌ఫొటో)

అప్పుల బాధతో చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జిల్లా సోమందేపల్లి మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... సోమందేపల్లి ఇంద్రానగర్‌లో నివాసముంటున్న రఫిక్ (43) దాదాపు 20 ఏళ్లుగా చేనేత కార్మికుడిగా కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ మధ్యకాలంలో చేనేత పరిశ్రమ పూర్తిగా కుంటపడడంతో తనకున్న నాలుగు మగ్గాలను ఆపేశారు. ఒక మగ్గాన్ని తానే నేస్తూ జీవనం సాగించేవారు. మగ్గాల నిర్వహణ, కుటుంబ పోషణ నిమిత్తం రఫిక్ సుమారు రూ.20 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పుల చెల్లింపునకు పలువురికి చెక్కులు ఇచ్చారు. చెక్కులు సమయం పూర్తవడంతో రెండు రోజుల క్రితం కొందరు రుణగ్రస్తులు ఆయన ఇంటి వద్దకు వచ్చి అప్పుడు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో మగ్గం గుంతకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య యాస్మిన్, కుమార్తె షాహీన, కుమారుడు షెక్షావలి ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.1.5 కోట్లు నగదు సీజ్

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె (వైఎస్ఆర్ జిల్లా)

వైఎస్ఆర్ జిల్లా చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని జయరాజ్ గార్డెన్ సమీపంలోని చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కారులో తరలిస్తున్న రూ.1.50 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నామని సిఐ శంకర్ నాయక్ తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణానికి తిరుమలయ్య అనే బంగారు వ్యాపారి నగదును తిరుపతికి తీసుకెళు తున్నారని చెప్పారు. తిరుపతిలో స్థలం కొన్నారని, డబ్బులు కట్టేందుకు తీసుకెళుతున్నట్లు తిరుమలయ్య చెప్పారన్నారు. ఎలాంటి బిల్లులూ లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకుని ట్రెజరీలో అప్పగించామని తెలిపారు.

చంద్రబాబు పర్యటనపై గోప్యత ఎందుకు?

- మంత్రి జోగి రమేష్ ప్రశ్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటనను గోప్యంగా ఉంచాల్సిన అవసరం ఏముందని మంత్రి జోగి రమేష్ ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు విదేశీ పర్యటన మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారిందని పేర్కొన్నారు. రహస్య పర్యటన వెనుక కారణం ఏమిటని ప్రశ్నించారు. 'దోచుకున్న డబ్బును దాచుకోవటానికి వెళ్లారో! విదేశాల్లో పెట్టుబడులు పెట్టడానికి వెళ్లారో!! ' ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నాయకుడు కాబట్టి ఆయన పర్యటన గురించి ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- దేవీపట్నం (అల్లూరి సీతారామరాజు జిల్లా)



నిర్వాసితుల సమస్యలు తెలుసుకుంటున్న వి.వెంకటేశ్వర్లు, శ్రీవాణి తదితరులు

పోలవరం నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా రంపచోడవరం నియోజకవర్గం దేవీపట్నం మండలంలోని పోలవరం నిర్వాసిత కాలనీలైన భీంపల్లి-1, పెంకులపాడు కాలనీ, కొండమొదలు కాలనీ, చిన్నారిగండి కాలనీ, గానుబంధు కాలనీ సహా పలు ప్రాంతాల్లో సిపిఎం బృందం శనివారం పర్యటించింది. నిర్వాసితుల సమస్యలను అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోలవరం నిర్వాసిత కాలనీల్లో చాలా సమస్యలు నెలకొని ఉన్నాయన్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన చాలామంది యువతకు ప్యాకేజీ ఇవ్వలేదన్నారు. పలు గ్రామాల్లో భూమికి భూమి ఇవ్వని ఉదంతాలు ఉన్నాయని తెలిపారు. కొంతమందికి సగం భూమి ఇచ్చి సగం ఇవ్వకపోవడం, ప్యాకేజీ అందివ్వకపోవడం వంటి సమస్యలు ఉన్నాయన్నారు. నిర్వాసితులకు ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం అండగా ఉండాల్సింది పోయి ఏదో ఒక కారణంతో సమస్యలను పక్కదారి పట్టిస్తున్నాయని తెలిపారు. ఇటీవల ఓ నిర్వాసితుడు పోలవరం ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయాన్ని గుర్తు చేశారు. నిర్వాసితులందరికీ ప్యాకేజీ, పునరావాసం అమలయ్యే వరకూ సిపిఎం పోరాడుతుందని, వారికి ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల శ్రీవాణి, నాయకులు శాంతిరాజు పాల్గొన్నారు.

వడదెబ్బకు నలుగురు మృతి

ప్రజాశక్తి- యంత్రాంగం

ప్రకాశం, తిరుపతి జిల్లాల్లో వడదెబ్బకు శనివారం నలుగురు మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకరారం... ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం రాయవరం గ్రామానికి చెందిన కంది శ్రీనివాసరెడ్డి (45) మసాలా బండి నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రతిరోజూలాగే తోపుడు బండి తీసుకొని గ్రామంలోని వివిధ కూడళ్ల వద్ద బొరుగులు, మసాలా విక్రయించారు. ఎండ తీవ్రత పెరగడంతో తీవ్ర అస్వస్థతకు గురై కింద పడిపోయారు. స్థానికులు మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించగా అప్పటికే ఆయన మృతి చెందారు. శింగరాయకొండ రైల్వేస్టేషన్‌లో సుమారు 60 సంవత్సరాలు వయసు కలిగిన ఓ వద్ధుడు ఐస్ బండి వేసుకొని జీవనం సాగిస్తున్నారు.. వడగాల్పులకు తట్టుకోలేక మృతి చెందారు. శింగరాయకొండ మండలం సోమరాజుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులవారిపాలేనికి చెందిన పోకూరి లక్ష్మమ్మ (80) భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బస్సు షెల్టర్‌లోనే ఉంటున్నారు. వడగాలులకు ఆమె మృతి చెందారు.

తిరుపతి జిల్లా కెవిబి పురం మండలం కోటమంగాపురం గ్రామానికి చెందిన మెరుల చంద్రయ్య (57) కూలి పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. పని కోసం రోజూ కెవిబి పురం వచ్చి వెళ్తున్నారు. మూడు రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో నీరసించారు. పని చేస్తున్న ప్రాంతంలో కళ్లు తిరిగి పడిపోయారు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు.

పాము కాటుతో వైసిపి మండల నాయకుడు మృతి

ప్రజాశక్తి- గజపతినగరం (విజయనగరం)

పాము కాటుతో వైసిపి నాయకుడు మృతి చెందిన ఘటన విజయనగరం జిల్లా గజపతినగరం మండలంలో శనివారం చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వైసిపి గజపతినగరం మండల నాయకుడు, మార్కెటింగ్ ఆత్మ కమిటీ చైర్మన్ సామంతుల పైడిరాజు గురువారం వ్యవసాయ పనుల నిమిత్తం పొలంలోకి వెళ్లారు. అక్కడ ఆయన పాముకాటు గురై స్పృహ కోల్పోవడంతో విజయనగరంలోని ఒక ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని ఒక ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి శనివారం ఉదయం పైడిరాజు మృతి చెందారు. ఆయన లోగిశ గ్రామంలో వైస్ సర్పంచిగా పనిచేశారు. 2012లో కొన్ని కారణాల వల్ల టిడిపిని వీడి కాంగ్రెస్‌లో చేరి ఆ గ్రామంలో స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో లోగిస బంగారునాయుడు గెలుపునకు కృషి చేశారు. బంగారునాయుడు మరణం అనంతరం వైసిపిలో చేరి గ్రామంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు.

ఇండియా ఫోరానికి అండగా నిలవాలి

- చంద్రబాబుకు, జగన్‌కు కె.రామకృష్ణ హితవు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



దేశవ్యాప్తంగా బిజెపి పట్ల, ప్రధాని నరేంద్ర మోడీ పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ఈ నేపథ్యంలో ఇండియా ఫోరానికి మంచి ఫలితాలు వచ్చే అవకాశముందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. కేంద్రంలో ఇండియా ఫోరం అధికారంలోకి వస్తేనే ప్రత్యేక హోదా సాధ్యమని, అందువల్ల టిడిపి అధినేత చంద్రబాబు, వైసిపి అధినేత జగన్ ఇండియా ఫోరానికి అండగా నిలిచి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని ఆయన కోరారు. శనివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం దాసరిభవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన జరిగిన జూన్ 2తో పదేళ్లు ముగుస్తుండగా, విభజన అంశాల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం విచారకరమన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎపికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. అభివృద్ధికి ఆమడదూరంలో అప్పులపాలైన రాష్ట్రం కోలుకోవాలంటే ప్రత్యేకహోదా ఒక్కటే శరణ్యమని, అది ఇండియా ఫోరంతోనే సాధ్యమని చెప్పారు. ఇప్పటివరకు ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్‌పై కూడా ఆదివారంతో హక్కు కోల్పోతున్నామన్నారు. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరంను పదేళ్లుగా పూర్తి చేయకుండా కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలపై నెపం నెడుతూ నీరుగార్చారని విమర్శించారు. ఎపికి పదేళ్లుగా అన్యాయం చేసిన కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై వైసిపి, టిడిపి పార్టీలు రెండూ మాట్లాడాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, జి ఓబులేసు, జి ఈశ్వరయ్య, కెవివి ప్రసాద్ పాల్గొన్నారు.

అసైన్డ్ భూ కొనుగోళ్లపై సమగ్ర విచారణ చేయాలి

- ఆ భూములను లాక్కోవడం పెద్ద కుంభకోణం
- కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి మాల్యాద్రి

ప్రజాశక్తి - పూసపాటిరేగ (విజయనగరం జిల్లా)



అసైన్డు భూముల్లో నుంచి ఎంపి నిధులతో వేసిన రహదారిని పరిశీలిస్తున్న కెవిపిఎస్, సిపిఎం, డిబిఎస్‌యు నాయకులు

అసైన్డ్ భూ కొనుగోళ్లపై సమగ్ర విచారణ జరిపించాలని, పేదల భూములను అన్యాక్రాంతం చేయడానికి, లాక్కోవడానికి ఉపయోగపడే జిఒ నెంబర్ 9/23 రద్దు చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎ మాల్యాద్రి డిమాండ్ చేశారు. పేద బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వం అసైన్డ్ చేసిన భూములను పెద్దలు లాగేసుకోవడం పెద్ద కుంభకోణమని అన్నారు. విజయనగరం జిల్లా పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో వందల ఎకరాల అసైన్డ్ భూములను అక్రమ జిఒలు మాటున పెద్దలు కొట్టేస్తున్నారంటూ ప్రజాశక్తి పత్రికల్లో వచ్చిన వరుస కథనాలకు స్పందించి మల్యాద్రి, దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి చిట్టి బాబు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి రమణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి సూర్యనారాయణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆర్ ఆనంద్ కలిసి శనివారం పూసపాటి రేగ మండలంలో ఆయా భూములను పరిశీలించి, దళితులు, భూ హక్కుదారులతో మాట్లాడారు. తమకు ఉన్న ఎకర అరా భూములన్నీ అమ్మేయడానికి సిద్ధపడి అడ్వాన్సులు తీసుకున్నామంటూ భూ హక్కుదారులు తెలిపారు. ఒక్కో ఎకరాకు రూ.18, 20, 25 లక్షలు చొప్పున రేటుకట్టారని, ఎకరాకు లక్ష నుండి నాలుగు లక్షల వరకు అడ్వాన్సులిస్తూ అగ్రిమెంట్ చేసుకున్నామని వివరించారు.

అనంతరం మల్యాద్రి మాట్లాడుతూ కోట్లు విలువ చేసే భూములను లక్షల్లో కొనుగోళుకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అసైన్డ్ భూముల కోసం జాతీయ రహదారి నుండి సుమారు పది లక్షల ఎంపి నిధులతో రహదారి నిర్మించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఆ ప్రాంతంలో ఉన్న నాలుగు వందల ఎకరాలు అసైన్డ్ భూములకు మధ్య నుండి రహదారి నిర్మించడం పెద్ద కుంభకోణమన్నారు. దళిత కాలనీలలో మౌలిక సౌకర్యాలు కల్పించకుండా ఎంపి ల్యాండ్స్ నిధులతో జనసంచారం లేని చోట రోడ్డు నిర్మాణం చేపట్టడం అన్యాయమన్నారు. అక్రమ కొనుగోళ్లలో దళారులపై, అవకతవకలపై సిట్ దర్యాప్తు జరిపి అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



విమాన ఇంధనం మరింత చౌక

- ఎటిఎఫ్ ధర 6.5 శాతం తగ్గింపు
- వాణిజ్య సిలిండర్‌పైనా రూ.69 కోత

న్యూఢిల్లీ : సామాన్యులపై అధికంగా భారం పడే పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపునకు మీనమేషాలు లెక్కించే కేంద్ర ప్రభుత్వం.. సంపన్నులు ప్రయాణించే విమానాలకు కావాల్సిన ఇంధనంపై పదేపదే ధరలను తగ్గిస్తుంది. తాజాగా ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఎటిఎఫ్) 6.5 శాతం తగ్గించింది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో లీటర్ ఎటిఎఫ్ ధర రూ.6,673.87 లేదా 6.5 శాతం తగ్గింపుతో రూ.94,969.01లకు చేర్చుతూ.. కేంద్ర చమురు సంస్థలు నోటిఫికేషన్‌లో తెలిపాయి. గత నెల ఒకటో తేదీన ఎటిఎఫ్‌పై స్వల్పంగా 0.7 శాతం లేదా రూ.749.25 పెంచగా.. ఈ దఫా ఏకంగా భారీగా తగ్గించడం విశేషం. మహారాష్ట్ర రాజధాని ముంబయిలో ఎటిఎఫ్ ధర రూ.95,173.70 నుంచి రూ.88,834.27లకు తగ్గింది. ప్రతి నెలా కేంద్ర ప్రభుత్వ చమురు సంస్థలు అంతర్జాతీయ మార్కెట్లో ఫ్యుయల్ ధరలు, విదేశీ మారక ద్రవ్యం నిల్వలకు అనుగుణంగా ఎటిఎఫ్ ధరలను సవరిస్తుంటాయి.

ఎటిఎఫ్ సహా వాణిజ్య గ్యాస్ సిలీండర్లపై ధరను తగ్గించింది. హోటళ్లు, రెస్టారెంట్లలో వినియోగించే వాణిజ్య సిలిండర్ (19కిలోలు) ధర రూ.69 తగ్గి రూ.1676కు చేర్చింది. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర తగ్గడం వరుసగా మూడో నెల. ఈ ఏడాది జనవరి తర్వాత తొలిసారి గత ఏప్రిల్‌లో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.30.5 తగ్గిస్తే, గత నెల ఒకటో తేదీన రూ.19 తగ్గించాయి. అయితే కుటుంబాలు వినియోగించే 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధర రూ.803 యథాతథంగా కొనసాగుతోంది.

మారుతి సుజుకి అమ్మకాల్లో 2% పతనం

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి అమ్మకాల్లో పతనాన్ని చవి చూసింది. 2024 మేలో 2 శాతం తగ్గుదలతో 1,74,551 యూనిట్లను విక్రయించింది. గతేడాది ఇదే నెలలో 1,78,083 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. చిన్న కార్లలో ఆల్టో, ఎస్ ప్రెసో విక్రయాలు 9,902 యూనిట్లకు తగ్గాయి. 2023 ఇదే నెలలో 12,236 యూనిట్లను సరఫరా చేసింది. కాంపాక్ట్ కార్లలో బలెనో, సెలిరియో, డిజైర్, స్విఫ్ట్, టూర్ ఎస్, వాగన్‌ఆర్ అమ్మకాలు 71,419 నుంచి 68,206 యూనిట్లకు తగ్గాయి.

పెరిగిన టాటా మోటార్స్ అమ్మకాలు

దిగ్గజ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ 2024మేలో 2 శాతం వృద్ధితో 75,173 యూనిట్ల అమ్మకాలు చేసింది. ఇంతక్రితం ఏడాది ఇదే నెలలో 73,448 యూనిట్ల విక్రయాలు చేసింది. వాణిజ్య వాహన అమ్మకాలు 2 శాతం పెరిగి 29,691 యూనిట్లుగా, ప్యాసింజర్ వాహన అమ్మకాలు 47,075 యూనిట్లుగా నమోదయ్యాయి.

హ్యుందాయ్ విక్రయాలు 7% వృద్ధి

హ్యుందాయ్ మోటార్ ఇండియా (హెచ్‌ఎంఐఎల్) గడిచిన మేలో 7 శాతం వృద్ధితో 63,551 యూనిట్ల అమ్మకాలు చేసింది. 2023 మేలో 59,601 యూనిట్ల విక్రయాలు చేసింది. గత నెల ఎగుమతుల్లో 31 శాతం పెరిగి 14,400గా నమోదయ్యినట్లు ఆ కంపెనీ పేర్కొంది.

దూసుకెళ్లిన టొయోటా

గడిచిన మేలో టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) అమ్మకాలు భారీగా పెరిగాయి. 2024 మేలో 24 శాతం వృద్ధితో 25,273 యూనిట్ల విక్రయాలు చేసింది. 2023 మేలో 20,410 యూనిట్ల అమ్మకాలు చేసింది.

ఎంజి మోటార్ 4,769 యూనిట్ల అమ్మకాలు

ఎంజి మోటార్ ఇండియా 2024 మేలో 5 శాతం తగ్గుదలతో 4,769 యూనిట్ల అమ్మకాలను నమోదు చేసింది. 2023 ఇదే మాసంలో 5,006 యూనిట్ల విక్రయాలు చేసింది. కాగా విద్యుత్ వాహన అమ్మకాల్లో ప్రగతిని కనబర్చినట్లు ఆ సంస్థ పేర్కొంది.

ఎంఅండ్ఎం 17% వృద్ధి

మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) గడిచిన మేలో మొత్తం ఆటో అమ్మకాల్లో 17 శాతం వృద్ధితో 71,682 యూనిట్లుగా నమోదు చేసినట్లు పేర్కొంది. 2023 ఇదే నెలలో 61,415 యూనిట్ల విక్రయాలు చేసింది. ఇదే సమయంలో 32,886 యూనిట్ల ప్యాసింజర్ వాహన అమ్మకాలు చేయగా.. గడిచిన మేలో 31 శాతం వృద్ధితో 43,218 యూనిట్లను విక్రయించింది.

సరిపడ విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్రంలో వ్యవసాయ సీజన్‌కు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి రైతులకు సరిపడా పత్తి, వేరుశనగ, వరి విత్తనాలు, ఎరువులు, జీలగలు మంజూరు చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి కోరారు. వైఎస్ఆర్ జిల్లాలోని రైతు సంఘం జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతంగానికి సబ్సిడీ రూపంలో ఆర్‌బికె కేంద్రాల ద్వారా అవసరమైన విత్తనాలు వెంటనే అందించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు దృష్టి సారించాలని కోరారు. మెట్ట ప్రాంతాల్లో సాగు చేసే పత్తి విత్తనాలను అధిక ధరలకు విక్రయించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్కేలాఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకు రుణాలు రైతులందరికీ అందించాలని డిమాండ్ చేశారు. ముందుగా భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు ఏ ఎరువులు వాడాలో అవగాహన కలిగించాలని కోరారు. కౌలు రైతులకు భూ యజమానులకు సంబంధం లేకుండా గ్రామ సభల ద్వారా కార్డులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అవకతవకలుగా ఉన్న భూ సర్వేను రద్దుచేసి రైతుల సమక్షంలో గ్రామ స్థాయి రెవెన్యూ అధికారులు రీ సర్వే చేసి గత పాసు పుస్తకాలను అనుసరించి సవరించాలని కోరారు. రైతుల మధ్య చిచ్చుపెట్టే విధంగా ఉన్న భూ సర్వే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామ, మండల స్థాయిలో రైతులను చైతన్యపరిచి రైతాంగ సమస్యలు పరిష్కరించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాలకృష్ణయ్య, దస్తగిరిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, వెంకటసుబ్బయ్య, చిన్న సిద్ధయ్య, రామచంద్రారెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు.

పేదలపై ప్రభుత్వం విద్యుత్ భారాలు : టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచి వైసిపి ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తోందని టిడిపి వాణిజ్య విభాగం అధ్యక్షులు డూండి రాకేష్ విమర్శించారు. అధికారం పోతున్నా ముఖ్యమంత్రి జగన్ భారాలు మోపుతున్నారని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల సొమ్ముతో హెలికాప్టర్లు, విమానాల్లో తిరుగుతూ రాష్ట్రాన్ని జగన్ అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు.

పేదల భూముల కాజేతకు సిఎస్ కుట్ర: వర్ల రామయ్య

పేదల భూములను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి, అతని కుమారుడు యత్నిస్తున్నారని టిడిపి పొలిట్ బ్యూరోసభ్యులు వర్ల రామయ్య ఆరోపించారు. భూ అక్రమాలపై సిబిఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. తమ పార్టీ చీఫ్ పోలీంగ్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమానికి చంద్రబాబు రాకుండానే వచ్చినట్లు ఒక మీడియా సంస్థ కథనాలు రాయడం సమంజసం కాదని టిడిపి ఎమ్మెల్సీ పి అశోక్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే పిన్నెల్లి నుంచి ప్రాణ హాని ఉంది

- సుప్రీంకోర్టును ఆశ్రయించిన నంబూరి శేషగిరిరావు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బాధితుడు నంబూరి శేషగిరిరావు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. తనకు ప్రాణహాని ఉందని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిన్నెల్లికి హైకోర్టు ఇచ్చిన అరెస్టు మినహాయింపు ఆదేశాలు రద్దు చేయాలని అందులో కోరారు. ఇవిఎం ధ్వంసం చేసిన ఘటనలో తనపై దాడి చేశారని పిటిషన్‌లో వివరించారు. కౌంటింగ్ రోజు కూడా హింసకు పాల్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇవిఎం ధ్వంసం చేసిన ఘటనపై శేషగిరిరావు మరో పిటిషన్ దాఖలు చేశారు. ఆధారాలున్నా ఎమ్మెల్యే పేరు, అనుచరుల పేర్లు లేకుండా కేసు పెట్టారని, గుర్తు తెలియని వ్యక్తులంటూ ఎమ్మెల్యేకు అనుకూలంగా వ్యవహరించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ అంశాలన్నీ హైకోర్టు పరిగణనలోకి తీసుకోకుండా ముందస్తు బెయిల్ ఇచ్చిందని వివరించారు. శేషగిరిరావు దాఖలు చేసిన రెండు పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టనుంది.

ఎఫ్‌డిలపై యూనియన్ బ్యాంక్ వడ్డీ పెంపు

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అందించే వడ్డీ రేట్లను పెంచింది. రూ.2 కోట్ల కంటే తక్కువ ఎఫ్‌డీపై పెంచిన వడ్డీ రేట్లు వర్తిస్తాయని తెలిపింది. కొత్త వడ్డీ రేట్లు జూన్ 1నుంచే అమల్లోకి వచ్చాయని పేర్కొంది. సాధారణ ఖాతాదారుల ఎఫ్‌డిలకు సంబంధించి.. 7 రోజుల నుంచి 45 రోజుల మధ్య కాలపరిమితి కలిగిన ఎఫ్‌డీపై 3.5 శాతం వడ్డీ అందిస్తోంది. 45 రోజుల నుంచి 90 రోజుల కాలవ్యవధి ఎఫ్‌డీలపై 4.50 శాతం, 91 రోజుల నుంచి 180 రోజుల మధ్య 4.80 శాతం, 181 రోజుల నుంచి ఏడాది లోపల 6.25 శాతం వడ్డీ చెల్లించనుంది. ఏడాది నుంచి 399 రోజుల కాలవ్యవధి ఎఫ్‌డీ రేట్లను 6.75 శాతం, 399 రోజులకు చేసే ఎఫ్‌డీపై 7.25 శాతం, 400 రోజుల నుంచి 998 రోజుల మధ్య 6.50 శాతం, 1000 రోజులు నుంచి 10 ఏళ్ల మధ్య 6.50 శాతం వడ్డీ రేటు అందిస్తోన్నట్లు పేర్కొంది. సీనియర్ సిటిజన్స్ అదనంగా 0.5 శాతం వడ్డీ పొందనున్నారని తెలిపింది.

వేసవి విడిది

పాత నాణేలు సేకరించాం..



హాయ్ ఫ్రెండ్స్,
మేమంతా మంచి స్నేహితులం. పురాతన నాణేలు సేకరించడం మాకు చాలా ఇష్టం. ఈ వేసవి సెలవుల్లో మా ఊరంతా తిరిగి పురాతన నాణేలు సేకరించాం. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ ట్రంకు పెట్టెల అడుగుభాగంలో, ముడుపుల రూపంలో భద్రపరిచిన పురాతన నాణేలు కనిపిస్తుంటాయి. ముఖ్యంగా వృద్ధులు భద్రంగా సునబకాయల్లో ఉంచుకున్న రాగి నాణేలను మేమంతా ఒక్కొక్కటిగా సేకరించాం. ఇంకా, పాతిక సంవత్సరాల కిందటి వరకు చలామణిలో ఉన్న ఐదు పైసలు, పది పైసలు, 20 పైసలు, పావలా, 50 పైసల నాణేలను కూడా సేకరించాం. అలాగే కొన్ని ఇళ్లల్లో పూర్వీకుల నుండి దాచి వుంచిన పురాతన రాగి నాణేలను కూడా అడిగి తీసుకున్నాం. గ్రామం నుండి ఉపాధి కోసం విదేశాలకు వెళ్లివచ్చిన యువకులను అడిగి కొన్ని విదేశీ నాణేలను సేకరించాం. అలా ఈ వేసవి సెలవులు మాకు మధుర జ్ఞాపకాన్ని అందించాయి.

- అమన్, సాక్షి, లెనిన్, వరుణ్, అమృత .
మాకనపల్లి, పలాస, శ్రీకాకుళం జిల్లా.

స్కేటింగ్ నేర్చుకున్నాం



హాయ్ ఫ్రెండ్స్,
నా పేరు యశ్వంత్. 6వ తరగతి చదువుతున్నాను. నాకు చదువుతో పాటు స్కేటింగ్ చేయడం చాలా ఇష్టం. మా నాన్నగారు ప్రతి వేసవి సెలవుల్లో నాకు స్కేటింగ్ నేర్పిస్తారు. రోలర్ స్కేటింగ్ కోచ్ పర్యవేక్షణలో నేను చాలా శ్రద్ధ పెట్టి స్కేటింగ్ నేర్చుకుంటున్నాను. చదువుతో పాటు శారీరక దృఢత్వం పెంచుకుంటే మనలో ఆత్మవిశ్వాసం బాగా పెరుగుతుంది. నేనైతే, వేసవి సెలవులు ఎప్పుడు వస్తాయా అని సంవత్సరమంతా ఎదురుచూస్తాను. మరి మీరు ఫ్రెండ్స్..


డి.యశ్వంత్,
6వ తరగతి,
ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్,
రాజమండ్రి.

బొమ్మరిల్లు





బి.షణ్ముక్,
6వ తరగతి, అనకాపల్లి.






దండ. అరుణశ్రీ,
9వ తరగతి, అప్పలరాజు పురం జెడ్‌పిహెచ్ స్కూల్,
చీడికాడ మండలం, అనకాపల్లి.



రుక్సానా,
9వ తరగతి, ఎపి మోడల్ స్కూల్,
ఎం తిమ్మాపురం, మహానంది.







ఎం.ఇషిత,
3వ తరగతి,
కృష్ణలంక.



JEEVANA జీవన the family



కామెడీ పంచులు... వెండితెరపై వెలుగులు

తెలుగు వెండితెరపై నవ్వులు పండించిన రాజాబాబు, రేలంగి, సుత్తి వీరభద్రరావు, సుత్తివేలు, అల్లు రామలింగయ్య, పద్మనాభం, జంధ్యాల, బ్రహ్మానందం, ధర్మవరపు సుబ్రహ్మణ్యం, ఆలీ, ఎంఎస్ నారాయణ, ఎవిఎస్, ఆలీ, సునీల్ తదితరులను స్ఫూర్తిగా తీసుకుని కళారంగంలో రాణిస్తున్నారు వీరంకి వెంకట నరసింహారావు. చిన్నతనం నుంచి కళలపై అభిమానంతో సాధన చేసి రంగస్థల నటుడిగా, దర్శకుడిగా, టివి, సినీ నటుడిగా ప్రయాణం సాగిస్తున్నారు. సినీ క్యారెక్టర్ ఆర్టిస్టుగా ప్రస్తుతం ఆయన బిజీగా దూసుకుపోతున్నారు. ఆయన మాటల్లోనూ, మిమిక్రీలోనూ, ఏకపాత్రాభినయంలోనూ, నటన కౌశలంలోనూ అడుగడుగునా హాస్యపు జల్లులు వరదలా పారుతూనే ఉంటాయి. స్వతహాగా మామూలు మాటలే కామెడీ పంచులుగా ఆసువుగా మాట్లాడుతుండటం ఆయన ప్రత్యేకత. ఈయన మార్కు కామెడీని వింటే ఎంతటి శారీరక, మానసిక, ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నా కొంతసేపు ఆ బాధలన్నీ మర్చిపోయి ఆనందంగా గడుపుతారంటే అతిశయోక్తి కాలేదు.

ఎన్‌టిఆర్ జిల్లా జి.కొండూరు మండలం కోడూరు గ్రామానికి చెందిన వీరయ్య, సరస్వతి దంపతులకు 1962లో వీరంకి వెంకట నరసింహారావు జన్మించారు. 1972లో పాఠశాల విద్యను అభ్యసించే సమయంలో పన్నెండో ఏట ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో 'బాలయేసు' నాటకం ద్వారా ఏసుప్రభువు పాత్రతో కళాకారుడిగా ముఖానికి రంగుపూసుకుని నటనకు శ్రీకారం చుట్టారు. ఉన్నత పాఠశాల స్థాయిలో 'ముష్ఠిగ్రహాలు', 'చెవిటిమేళం', 'ప్రజారాజ్యం','రేపేంది?' అనే నాటికలు, 'గుండెలు మార్చబడును' అనే నాటకంలో తన నటనాకౌశలాన్ని ప్రదర్శించారు. కళాశాలస్థాయిలో 'గాలివాన', 'సమాజం మారాలి', 'కలియుగ ధర్మం', నాటకాలతోపాటుగా 'నేటి సమాజంలో ఒక పాఠశాల' నాటికలో నటించి పలువురి మన్ననలు పొందారు. పౌరాణికాల్లో సైతం నటించి మెప్పించారు. సీతాకళ్యాణం నాటకంలో 'రావణబ్రహ్మ'గా పలు ప్రాంతాల్లో నటించారు. వీరబ్రహ్మేంద్రస్వామి, భక్త కన్నప్ప, శ్రీనివాసకళ్యాణం నాటకాల్లో పాత్రలు పోషించి పౌరాణికాల పట్ల అభిరుచిని చాటుకున్నారు.

ప్రేమసామ్రాజ్యంతో నంది అవార్డు

'ప్రేమ సామ్రాజ్యం' నాటకంలో శాడిస్ట్ తండ్రి పాత్రలో అద్వితీయ నటనను ప్రదర్శించారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనలో భాగంగా హైదరాబాద్ రవీంద్ర భారతిలో ప్రదర్శించగా ఈ నాటకానికి నాలుగు నంది అవార్డులు వచ్చాయి. ఇదే నాటకాన్ని వివిధ ప్రాంతాల్లో 40కిపైగా ప్రదర్శనలు ఇచ్చారు. మరో సందేశాత్మక నాటిక 'కర్మణా జయతే ద్విజ:' నాటికలో కరీమ్ పాత్ర ధారిగా 2005లో జగ్గయ్యపేట, 2006లో కోదాడలో ప్రదర్శించి ఉత్తమ నటుడిగా ఎంపికై బహుమతులు అందుకున్నారు.



సాంఘిక, పౌరాణిక, నాటికలను వివిధ ప్రదేశాల్లో ప్రదర్శించి పురస్కారాలు, జ్ఞాపికలు పొందారు. దూరదర్శన్‌లో సైతం 'నిశ్శబ్ధగీతం', 'పాణిగ్రహణం', 'సంక్రాంతి అల్లుడు', 'సుజలాం సుఫలాం', 'నాయిక' నాటికల్లో నటించారు. 'నేటి సమాజంలో ఒక పాఠశాల'లో నటనకు ఉత్తమ హాస్యనటుడిగా అవార్డును అందుకున్నారు. ఆ తర్వాత రాముడు-రంగడు, పూల రంగడు, గాలివానలో నటనకు ఉత్తమ హాస్యనటుడిగా, సమాజం మారాలి, కలియుగ ధర్మం, ప్రజారాజ్యం, వందనోటు, సీతా కళ్యాణం తదితర పౌరాణిక నాటకాలు ఆయనకు మంచి పేరు ప్రఖ్యాతులను తెచ్చిపెట్టాయి. కలియుగ ధర్మంలో నటనకు గాను ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్టుగా అవార్డును అందుకున్నారు.

టెలిఫిలింగ్‌లోనూ అత్యుత్తమ ప్రతిభ

సినీ దర్శకులు దిలీప్‌రాజా దర్శకత్వంలో తీసిన నిశ్శబ్ధగీతం, సంక్రాంతి అల్లుడు, సుజలాం సుఫలాం, స్వయంవరం, శాంతి సంబరం, పాణిగ్రహణం, నాయిక, బండి రా తదితర టెలీఫిలిమ్స్‌లో నటించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

సినీరంగ ప్రవేశం జరిగింది ఇలా...

ఎంఎస్ కోటారెడ్డి 'లవ్‌గేమ్' సినిమాతో ఆయనకు మంచి ప్రేరు ప్రఖ్యాతులు వచ్చాయి. ప్రతిభను కనబర్చటంతో ఎంపిక చేశారు. 'లవ్‌గేమ్', 'నవ్వులే నవ్వులు' అనే చిత్రాల్లో చిన్నపాత్రలు పోషించారు. ప్రస్తుతం పది సినిమాల వరకూ ఆయన చేస్తున్నారు. సత్యదేవ్ హీరోగా నటించిన 'కృష్ణమ్మ' సినిమా మే 10న విడుదలైన విషయం తెలిసిందే. దీనిలో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా వీరంకి నరసింహారావు పోలీసు అధికారి పాత్రలో నటించారు. వీధి రౌడీల ఆగడాలను ఎదిరించేలా, వారి అరాచకత్వాన్ని ప్రశ్నించే పోలీసు పాత్రలో నటించి కామెడీ పంచులతో మెప్పించారు.

-యడవల్లి శ్రీనివాసరావు

రెగ్యులర్ షూటింగ్‌లతో బిజీగా గడుపుతున్నా



హీరో సుమన్ నటిస్తున్న 'దిగి వచ్చిన కరుణామయుడు' సినిమాలోనూ ఆయన కీరోల్‌లో నటిస్తున్నా. 'ధర్మచక్రం'లోనూ ముఖ్యమంత్రిగా ప్రధాన పాత్ర పోషిస్తున్నా. 'అల్లరోడు'లో హాస్య ప్రధానమైన పాత్రను పోషించా. 'బాపట్ల ఎంపి' సినిమాలోనూ ఇప్పటికే నా పార్టు ఉన్న షూటింగ్ పూర్తయ్యింది. విజయవాడకు చెందిన డైరెక్టర్ అమ్మ రమేష్ ద్వారా '143 ఎఎం' చిత్రంలోనూ నటిస్తున్నా. రామ్‌గోపాల్ వర్మ తీసిన 'వ్యూహం' సినిమాలోనూ నటించా. 2006 నుంచి 2011 వరకూ కోడూరు సర్పంచ్‌గా పనిచేశా. శ్రీ చైతన్య కళా సమితి ద్వారా అభ్యుదయ కళాకారులను తీర్చిదిద్దుతున్నాం.

- వీరంకి వెంకట నరసింహారావు,
సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్



మళ్లీ సెట్‌పైకి 'హరి హర వీర మల్లు'

హీరో పవన్ కళ్యాణ్ తన కెరీర్‌లో తొలిసారిగా హిస్టారికల్ ఎపిక్ వారియర్ మూవీ 'హరి హర వీర మల్లు'లో ఒక యోధుడి పాత్రలో కనిపించనున్నారు. దర్శకుడు జ్యోతి కృష్ణ, ఈ సినిమా మిగిలిన షుటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులను క్రిష్ జాగర్లమూడి పర్యవేక్షణలో పూర్తి చేయబోతున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత ఎఎం రత్నం భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 17వ శతాబ్దంలో పేదల పక్షాన పోరాడిన ఒక యోధుడి కథగా రూపొందుతోన్న ఈ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం కోసం, నిర్మాతలు ప్రత్యేకంగా చార్మినార్, ఎర్రకోట సహా మచిలీపట్నం ఓడరేవు వంటి భారీ సెట్‌లను అంతర్జాతీయ స్థాయి నిర్మాణ విలువలతో ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు. మనోజ్ పరమహంస సినిమాటోగ్రఫీ బాధ్యతలు స్వీకరించారు. త్వరలోనే ఈ సినిమా షుటింగ్ ను ప్రారంభించే పనిలో పడ్డారు. అందులో భాగంగానే నిర్మాత ఏం రత్నం, దర్శకుడు జ్యోతి కృష్ణతో పాటు ప్రొడక్షన్ డిజైనర్ తోట తరణి, విఎఫ్‌ఎక్స్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ మోహన్‌లతో మనోజ్ పరమహంస చర్చిస్తున్న ఒక ఫోటోని చిత్ర యూనిట్ అధికారికంగా విడుదల చేసింది. ఈ ఏడాది చివరి నాటికి పార్ట్-1 'స్వార్డ్ వర్సెస్ స్పిరిట్'ని విడుదల చేయడానికి టీమ్ సిద్ధమవుతోంది. హీరోయిన్‌గా నిధి అగర్వాల్, బాబీ డియోల్, సునీల్, నోరా ఫతేహి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంగీతం ఎం.ఎం. కీరవాణి. జ్ఞానశేఖర్ వి.ఎస్ వ్యవహరిస్తున్నారు.

'యావరేజ్ స్టూడెంట్ నాని' మోషన్ పోస్టర్ రిలీజ్



దర్శకులు హీరోలుగా, హీరోలు దర్శకులుగా మారి సక్సెస్ అందుకొంటున్నారు. 'మెరిసే మెరిసే' మూవీతో పవన్ కుమార్ కొత్తూరి దర్శకుడిగా మారారు. 'యావరేజ్ స్టూడెంట్ నాని' అనే చిత్రంతో హీరో, దర్శకుడు, నిర్మాతగా పవన్ కుమార్ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. తాజాగా మోషన్ పోస్టర్ రిలీజ్ చేశారు. యూత్‌ఫుల్, లవ్, యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ గతంలో విడుదలైన విషయం తెలిసిందే. సాహిబా భాసిన్, స్నేహ మాల్వియ, వివియా సంత్‌లు హీరోయిన్లుగా నటించారు. కార్తీక్ బి కొడకండ్ల సంగీతమందించారు. సినిమాకు సంబంధించిన ఇతర వివరాలు త్వరలోనే ప్రకటించనున్నారు.

మిడిల్ క్లాస్ కష్టాలతో 'మ్యూజిక్ షాప్ మూర్తి' ట్రైలర్

అజయ్ ఘోష్, చాందినీ చౌదరి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'మ్యూజిక్ షాప్ మూర్తి'. ఈ నెల 14న థియేటర్లలోకి రాబోతుంది. హర్ష గారపాటి, రంగారావు గారపాటి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. శివ పాలడుగు దర్శకుడు. ఇప్పటికే టీజర్, పాటలు, పోస్టర్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ఈ ట్రైలర్ చూస్తే నవ్వించేలా, ఏడిపించేలా ఉంది. మిడిల్ క్లాస్ కష్టాలను, కల కనడానికి, ఆ కలను నెరవేర్చుకోవడానికి వయసుతో సంబంధం లేదనే కాన్సెప్ట్ చూపించబోతున్నారు. 'అన్నీ మన కోసమే చేసుకోకూడదు.. కొన్ని మన అనుకునేవాళ్ల కోసం వదులుకోవాలి' అంటూ అజయ్ ఘోష్ చెప్పిన ఎమోషనల్ డైలాగ్ ఆకట్టుకుంటోంది.



ఎమోషనల్‌గా శర్వానంద్ 'మనమే' ట్రైలర్



శర్వానంద్, కృతీశెట్టి జంటగా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'మనమే'. శర్వానంద్ 35వ సినిమాగా ఫ్యామిలీ జానర్‌లో రానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. లండన్ నేపథ్యంలో, కొత్తతరం ప్రేమకథతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై వస్తున్న ఈ చిత్రంలో బాలనటుడు విక్రమ్ ఆదిత్య కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాను ఈనెల 7న విడుదల చేయనున్నట్లుగా చిత్ర యూనిట్ వెల్లడించింది.

త్వరలో'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సీక్వెల్ : విశ్వక్‌సేన్



విశ్వక్ సేన్ కథానాయకుడిగా నటించిన చిత్రం గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి. శుక్రవారం ఈ సినిమా విడుదలైన సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో హీరో విశ్వక్ సేన్, దర్శకుడు కృష్ణ చైతన్య తమ సంతోషాన్ని పంచుకున్నారు. త్వరలో 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'కి సీక్వెల్ ఉంటుందన్నారు. విశ్వక్ సేన్ మాట్లాడుతూ 'తెలుగు ప్రేక్షకులు థియేటర్లలో సినిమాలను ఆదరించడంలో ఎప్పుడూ ముందుంటారు. దేశంలోనే వసూళ్ల పరంగా మనం ముందున్నాం. కొన్ని రోజులుగా థియేటర్ల దగ్గర సందడి లేదు. కొంత విరామం తరువాత మళ్లీ మా సినిమా కోసం ప్రేక్షకులు థియేటర్ల బాట పట్టడం ఎంతో ఆనందంగా ఉంది' అని అన్నారు. కృష్ణచైతన్య మాట్లాడుతూ సినిమాకి వస్తున్న స్పందనతో చాలా హ్యాపీగా ఉన్నామన్నారు. త్వరలో సక్సెస్ మీట్ నిర్వహిస్తామన్నారు.

కమర్షియల్ మార్కెట్‌కు క్రికెట్!

తొలిసారి ఐసిసి ఈవెంట్‌కు అమెరికా ఆతిథ్యం
మెగా ఈవెంట్ హంగామా కనిపించని వైనం
నేటి నుంచి ఐసిసి టీ20 ప్రపంచకప్



ఐసిసి టీ20 ప్రపంచకప్. ఆధునిక క్రికెట్‌లో అభిమానులకు అతిపెద్ద పండుగ. పొట్టి కప్పు పోరు ఎక్కడ జరిగినా హంగామా మామూలుగా ఉండదు. స్టార్ క్రికెటర్లకు స్వాగతం పలుకుతూ ఎయిర్‌పోర్ట్‌లో అభిమానుల కేరింతలు, క్యాబ్ డ్రైవర్ల నుంచి ఎక్కడ చూసినా కప్పు ఎవరు నెగ్గుతారనే చర్చ, ఆతిథ్య నగరాల్లో భారీ స్థాయిలో హోర్డింగ్‌లు, టికెట్ల సోల్డ్‌అవుట్ గోల. కానీ ఐసిసి టీ20 ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇస్తున్న అమెరికాలో ఇదేమీ కనిపించటం లేదు. అమెరికాలో టీ20 ప్రపంచకప్ జరుగుతుందని ప్రపంచానికి తెలుసు.. కానీ అమెరికాకు ఆ సంగతి తెలియదేమో అనే పరిస్థితి!. 2024 ఐసిసి టీ20 ప్రపంచకప్ నేడు ఆరంభం.

క్రీడావిభాగం : కమర్షియల్ సొబగులు దిద్దుకున్న క్రికెట్.. ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద స్పోర్ట్స్ మార్కెట్‌లోకి అడుగుపెట్టింది. ఆదాయం అన్వేషణలో భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ చుట్టూ తిరుగుతున్న ఐసీసీ.. భవిష్యత్‌లో అమెరికాను అతి పెద్ద ఆదాయ వనరుగా మార్చుకునే ఆలోచనలో ఉంది. అందుకే, అమెరికాలో క్రికెట్‌కు పెద్దగా క్రేజ్ లేకపోయినా ఏకంగా టీ20 ప్రపంచకప్‌నే అక్కడ నిర్వహిస్తోంది. అమెరికాలో ప్రతి క్రీడ కమర్షియల్ రూపంలో అత్యంత విజయంతం అయ్యాయి! ఆ జాబితాలోకి క్రికెట్ ఏనాడైనా చేరుతుందనే నమ్మకంతో అమెరికాలో పునాది వేసేందుకు ఐసీసీ తీవ్రంగా శ్రమపడుతోంది. 20 జట్లు పోటీపడుతున్న ఐసీసీ టీ20 ప్రపంచకప్ నేడు అమెరికా, కెనడా ఆరంభ మ్యాచ్‌తో షురూ కానుంది. గ్రూప్-ఏలో పాకిస్థాన్‌తో పాటు చోటుచేసుకున్న భారత్.. తొలి మ్యాచ్‌లో ఐర్లాండ్‌తో తలపడనుంది.

ఆకాశంలో టికెట్ల ధరలు : క్రికెట్‌ను కమర్షియల్‌గా మరింత ముందుకు తీసుకెళ్లేందుకే అమెరికాలో మెగా ఈవెంట్ ప్లాన్ చేసిన ఐసీసీ.. టికెట్ల ధరల అంశంలో వెనక్కి ఎలా తగ్గుతుంది?. భారత్, పాకిస్థాన్ మ్యాచ్ క్రేజ్‌ను వంద శాతం సొమ్ముచేసుకునేందుకు ఐసీసీ రంగం సిద్ధం చేసింది. సాధారణ స్టాండ్స్ టికెట్ల ధరలు రూ.25 వేలు, రూ.35 వేలుగా నిర్ణయించారు. ఇక హాస్పిటాలిటీ విభాగాల్లో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. డైమండ్ క్లబ్ టికెట్‌కు రూ.8.5 లక్షలు గరిష్ఠ ధర. కార్నర్ క్లబ్ టికెట్ ధర రూ.2.31 లక్షలు, ప్రీమియం క్లబ్ లాంజ్ టికెట్ ధర రూ.2.10 లక్షలు, పెవిలియన్ క్లబ్ టికెట్ ధర రూ. 1.68 లక్షలు, బౌండరీ క్లబ్ టికెట్ ధర రూ.1.26 లక్షలు. భారత్, పాకిస్థాన్ మ్యాచ్ రోజు పార్కింగ్‌కు సైతం గరిష్టంగా రూ.21 వేలు వసూలు చేయనున్నారు. ఇతర మ్యాచులకు మాత్రం టికెట్ల ధరలు సాధారణంగానే ఉన్నాయి. గరిష్టంగా రూ.63-84 వేల వరకు ఉన్నాయి. పార్కింగ్ టికెట్ ధర రూ.3500 వరకు నిర్ణయించారు. భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు సాధారణ స్టాండ్స్ టికెట్లు (రూ.25 వేలు, రూ.35 వేలు) పూర్తిగా అమ్ముడైనట్టు తెలుస్తోంది. కార్పోరేట్ బాక్స్‌ల టికెట్లు అందుబాటులో ఉన్నాయి.

కొత్త చాంపియన్‌ను చూస్తామా? : ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఇప్పటివరకు ఎనిమిది ఎడిషన్లు జరిగింది. ఆరు జట్లు ఇప్పటివరకు పొట్టి ప్రపంచకప్‌ను అందుకున్నాయి. అందులో రెండు జట్లు రెండేసి సార్లు విజేతలుగా నిలిచాయి. తొలిసారి 20 జట్లు పోటీ పడుతున్నా.. టైటిల్ వేట ప్రధానంగా ఎనిమిది జట్లు నడుమే సాగనుంది. భారత్ (2007), పాకిస్థాన్ (2009), ఇంగ్లాండ్ (2010), వెస్టిండీస్ (2012), శ్రీలంక (2014), వెస్టిండీస్ (2016), ఆస్ట్రేలియా (2021), ఇంగ్లాండ్ (2022) ఇప్పటివరకు జరిగిన టీ20 ప్రపంచకప్‌లలో చాంపియన్లుగా నిలిచాయి. భారత్ సహా ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, వెస్టిండీస్‌లు ఈసారి సెమీఫైనల్ ఫేవరేట్లుగా నిలిచాయి. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా సహా బంగ్లాదేశ్ తొలిసారి టైటిల్ అందుకోవాలని ఆరాటపడుతున్నాయి. రెండు అంచెల్లో గ్రూప్ దశ మ్యాచుల అనంతరం సెమీఫైనల్స్ బెర్త్ ఖరారు కానున్నాయి. దీంతో సహజంగానే బలమైన జట్లే నాకౌట్‌కు చేరుకుంటాయి. సంచలన విజయాలతో ముందుకెళ్లే అవకాశాలు అతి స్వల్పం.

కొత్త రూల్స్ గురూ : వైట్‌బాల్ క్రికెట్‌లో నూతన నిబంధనలు జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చాయి. నేడు ఆరంభం కానున్న టీ20 ప్రపంచకప్‌లో కొత్త రూల్స్ అమలు చేస్తారు. ఐసీసీ రూల్స్ ప్రకారం స్టాప్‌క్లాక్‌ను ఏర్పాటు చేస్తారు. ప్రతి ఇన్నింగ్స్ 90 నిమిషాల్లో ముగియాలి. ప్రతి రెండు ఓవర్ల నడుమ వ్యవధి 60 సెకండ్లు మించరాదు. ఒకవేళ మ్యాచ్‌లో ఓవర్ల మధ్య విరామం 60 సెకండ్ల కంటే ఎక్కువగా ఉంటే తొలి రెండు సార్లు అంపైర్ హెచ్చరిక జారీ చేస్తాడు. మూడోసారీ అదే ఆలస్యం జరిగితే ఫీల్డింగ్ జట్టుకు ఐదు పరుగుల జరిమానా విధిస్తాడు. 90 నిమిషాల సమయం మించిపోతే ఆఖరు ఓవర్‌కు బౌండరీ లైన్ వద్ద ఓ ఫీల్డర్ కుదింపు, మ్యాచ్ ఫీజులో కొత యథాతథంగా కొనసాగుతాయి.

మెరిసిన పంత్, పాండ్య

- సంజూ, దూబె విఫలం
- భారత్ స్కోరు 182/5



న్యూయార్క్ : ఐసీసీ టీ20 ప్రపంచకప్ సన్నాహక సమరంలో వికెట్ కీపర్, బ్యాటర్ రిషబ్ పంత్ (53, 32 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో రాణించాడు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య (40 నాటౌట్, 23 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) డెత్ ఓవర్లతో ధనాధన్ మోత మోగించాడు. పంత్, పాండ్య మెరుపులతో బంగ్లాదేశ్‌తో ఏకైక వార్మప్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 182 పరుగులు చేసింది. ఎనిమిది మంది బౌలర్లను ప్రయోగించిన బంగ్లాదేశ్.. బలమైన భారత్‌ను 182 పరుగులకు కట్టడి చేసింది.

పంత్ ఫటాఫట్ : న్యూయార్క్ నయా స్టేడియంలో టాస్ నెగ్గిన టీమ్ ఇండియా తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఆలస్యంగా జట్టుతో చేరిన విరాట్ కోహ్లి వార్మప్ మ్యాచ్‌కు దూరంగా ఉన్నాడు. జట్టుతో పాటు స్టేడియానికి వచ్చినా.. మైదానంలోకి అడుగుపెట్టలేదు. కోహ్లి లేకపోవటంతో రోహిత్ శర్మ తోడుగా యశస్వి జైస్వాల్ ఓపెనర్‌గా వస్తాడని అంచనా వేయగా.. సంజు శాంసన్ (1) ఓపెనర్‌గా వచ్చాడు. ఆరు బంతులు ఆడిన శాంసన్ ఒక్క పరుగే వికెట్ కోల్పోయాడు. కెప్టెన్ రోహిత్ శర్మ (23) సైతం ఆశించిన ప్రదర్శన చేయలేదు. రెండు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 19 బంతుల్లో 23 పరుగులే చేశాడు. నం.3 బ్యాటర్‌గా వచ్చిన రిషబ్ పంత్ (53) ధనాధన్ దంచికొట్టాడు. పవర్‌ప్లేలో సూపర్ షాట్లతో అలరించాడు. నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 32 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68